**RAMANEEYAM** *(Anthology of Short Stories)*
by **ANAAMAKUDU**

"సీతారాముళ్లనే బావామరదళ్ల - ధరిమిలా ఆలూమగళ్ల - ఆ పైన తల్లీతండ్రుళ్ల - ఆ పిమ్మట అవ్వాతాతళ్ల కథలివి. వీళ్ళందరూ కలిపి ఇద్దరే!

చిన్న చిన్న ఉబలాటాల ఆరాటాల పోరాటాల చెలగాటాల పరీమళాల (నీ జుట్టు నిశి - నీ ముఖం శశి; కళ్లు మూస్తే మొగ్గలు - తెరిస్తే పువ్వులు) ఘుమ ఘుమలతో నోరూరించే - తింటే 'వ-హల్‌వా' అనిపించే ఆలుమగల ముత్యాల ముగ్గులు. విశేషం ఏమిటంటే సుద్ద ముగ్గుల్లా ఈ ముగ్గులు చెదరవు. చెరగవు.

ఇవి హృదయాకాశంలో అ-క్షరాలు. ఆరంభంలో ఆలుమగల కసి ముద్దులు. ఆనక అమ్మానాన్నల పసి ముద్దులు. ఆ తరువాత అవ్వాతాతల బోసి నవ్వుల ముగ్గులు."

- ముళ్ళపూడి వెంకటరమణ




సీతకి రామంలా - రామానికి సీతలా -
'సీతారామం'లా ఉండగలిగితే -
ఏ దంపతుల జీవితం అయినా -
'అంకురం' నుండి 'వానప్రస్థం' దాకా -
'రమణీయం'

- అనామకుడు

వాహిని బుక్‌ట్రస్ట్
1.9.286/3 విద్యానగర్, హైదరాబాద్ 500044

104 Pages :: Rs. 50/-

ISBN 81 - 88512 - 61 - 3



# [illegible]

## అనామకుడు



హాసిని బుక్ ప్రెస్స్

1.9.286/3 విద్యానగర్. హైదరాబాద్ 500044

**RAMANEEYAM** *(Anthology of Short Stories)*
*by* **ANAAMAKUDU**

First Edition : January, 2006

Publication No. 62

© Dr. A.S. Ramasastri

*Cover Design :*
BAPU

*Illustrations :*
*Bali, Chandra, Chandu, Gopi, Karunakar and Ponnapalli*

*Produced & Published by :*
**Vahini Book Trust (V.B.T.)**
1-9-286/3, Vidyanagar
Hyderabad - 500 044.

A
Service Oriented
Institution
Administrated
by
Y.V.S.R.S. SAI

*For Copies :*
Vahini Book Trust, 1-9-286/3, Vidyanagar, Hyderabad - 500 044.
Visalandhra Book House, Bank Street, Hyderabad & Other Branches
Navodaya Book House, Opp: Aryasamaj Mandir, Badi Chowdi, Hyderabad
Navayuga Book House, Sultan Bazar, Hyderabad.
Navodaya Publishers, Governorpet, Vijayawada.

*Typesetting:*
**Rachana Entinti Patrika,** Hyderabad - 500 044

*Text & Title Printed at :*
**Charita Impressions,** 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020

No. of Pages : 104

Price : Rs. 40/- US $ : 4

ISBN :

(గాయత్రీ) దేవీ!

నేనైన నీకు

నీనైన నేను

\- (రామం) బావ

# కృతజ్ఞతలు

ముందుమాట రాసిచ్చిన రమణగారికి –

ముఖచిత్రం గీసిచ్చిన బాపుగారికి –

ముచ్చటగా అచ్చేసిన శాయిగారికి –

హృదయపూర్వక కృతజ్ఞతలు

## అనామకుడు

## ముందుగా....


❖ దాంపత్య ఋతుసంహారము........ ముళ్ళపూడి వెంకటరమణ ....... 6


## కథాక్రమం....


❖ రమణీయం ............................................................ 8

❖ న యయౌ న తస్థౌ ............................................................ 20

❖ అంకురం ............................................................ 27

❖ ఓ దశాబ్దం ............................................................ 37

❖ మధురం.... మధురం.... ............................................................ 48

❖ చతుర్థాంకం ............................................................ 54

❖ అవునా? ............................................................ 69

❖ అలిగిన వేళ ............................................................ 77

❖ వానప్రస్థం ............................................................ 84

*అనుబంధ కథ :*

❖ ఏకపత్నీవ్రతం ............................................................ 95

E:\
Ramaneeyam\
Ramaneeyam
4

# దాంపత్య ఋతుసంహారము

కొన్ని రచనలు వడియాలు పెట్టినట్టుంటాయి.

కొన్ని జంతికలు పోసినట్టుంటాయి.

కొన్ని మాత్రం ముగ్గులు వేసినట్టుంటాయి.

పై రెండూ తింటే కరుసైపోయినట్టే –

ఇవాళ వేసే ముగ్గులు చూస్తూండగా రేపులోపు చెదురుతాయి; చెరుగుతాయి. లేకపోతే కొత్త ముగ్గులు రావు గదా. అంచేత ముగ్గులు చెదరడం, చెరగడం సహజం – అవసరం. అదే జీవితం!

ఇంతకీ ముగ్గుల రంగేమిటీ?

వైటా? బ్రౌనా? రెండు కలిస్తేనే రూపం కదా. దాంపత్య తాంబూల రాగం అదే గదా!

“నిన్న” కన్న బిడ్డ “ఇవాళ”.

“ఇవాళ”లు – రేపటికి పేరెంట్సూ, ఎల్లుండికి తాతలూ అవ్వలూను. ఏడాదికి ఆరు ఋతువులున్నట్టే ఆలుమగల దాంపత్య కాలచక్రంలోనూ వుంటాయి.

పెళ్ళి, సంతోషం, సంసారం, సంగరం, సంతానం, సంతృప్తి అనే మజిలీల మీదుగా – కామం పెరిగి, విరిగి, తరిగి నిష్కామభరితమైన స్నేహంగా, ప్రేమగా పరివర్తనం చెంది పండడమే దాంపత్య జీవన ఋతుచక్రం. దాలిగుంట మీద పాలదాకలో పాలు నిదానంగా కాగి, మరిగి, పొంగి పొంగి, కుంగి స్థిరపడి ఎర్రడాలు మీగడ తేలడం దాంపత్య సౌభాగ్యం.

ఏవిటలా చదవడం ఆపి, కళ్లు తేలేస్తున్నారు?




సరదానంద వాక్యాలు గంభీరానంద సన్యాసానంద ప్రసంగ పాఠాల్లా కనబడుచున్నాయా? ఏం లేదు. ప్రేమలో పడడం, పెళ్లాడడం, కామించడం, రెచ్చిపోవడం, అలిసిపోవడం, క్రమంగా కోరికలు వెలిసి పోవడం – కొండొకచో కలుపు గడ్డి కల్పవృక్షంలా కనబడడం, తేలిగ్గా నాలిక్కరుచుకోవడం, నవ్వుకోవడం – ఇదీ వరస! ఇదే తాత్పర్యం!!

సీతారాముల్లనే బావామరదళ్ల – ధరిమిలా ఆలూమగళ్ల – ఆ పైన తల్లీతండ్రుల్ల – ఆ పిమ్మట అవ్వాతాతళ్ల కథలివి. వీళ్ళందరూ కలిపి ఇద్దరే!

చిన్న చిన్న ఉబలాటాల ఆరాటాల పోరాటాల చెలగాటాల పరీమళాల (నీ జుట్టు నిశి – నీ ముఖం శశి; కళ్లు మూస్తే మొగ్గలు – తెరిస్తే పువ్వులు) ఘుమ ఘుమలతో నోరూరించే – తింటే ‘వ–హల్వా’ అనిపించే ఆలుమగల ముత్యాల ముగ్గులు. విశేషం ఏమిటంటే సుద్ద ముగ్గుల్లా ఈ ముగ్గులు చెదరవు. చెరగవు.

ఇవి హృదయాకాశంలో అ–క్షరాలు. ఆరంభంలో ఆలుమగల కసి ముద్దులు. ఆనక అమ్మానాన్నల పసి ముద్దులు. ఆ తరువాత అవ్వాతాతల బోసి నవ్వుల ముగ్గులు.

ఇవి రాసిన అనామకుడికీ, రాయించిన అనామికకూ... శతమానంభవతి!



**(ముళ్ళపూడి వెంకటరమణ)**

'రచన' – ఉగాది ప్రత్యేక సంచిక – 1994

E:\
Ramaneeyam\
Ramaneeyam
5

# రమణీయం

"**కాఫీ**" అంది సీత నెమ్మదిగా.

"ఊఁ" అన్నాడు పేపర్లోంచి తలెత్తకుండా రామం.

"కాఫీ" అంది సీత స్వరం కొంచెం పెంచి.

"ఊఁ" అన్నాడు అదే ఫోజులో, అదే స్వరంతో రామం.

"కాఫీ" అని మళ్ళీ అని తను అన్నదానికి భౌతికమైన ఋజువుగా కాఫీ కప్పుని అందించింది సీత.

తన కళ్ళకీ, పేపర్లోని అక్షరాలకీ మధ్యన అడ్డంగా వచ్చిన కాఫీ కప్పుని అందుకుని, పక్కన పెట్టేసి, మళ్ళీ పేపరు చదవడంలో మునిగిపోయాడు రామం.

"ఏముందందులో?" అని అడిగింది సీత కుర్చీలో కూర్చుంటూ.

ఆ ఇంటి మొత్తానికి గాలీ, వెలుతురూ వచ్చే అవకాశం ఉన్న ఒకే ఒక్క చోటు ఆ బాల్కనీ. ఓ ఆదివారం ఉదయం ఆ బాల్కనీలో, ఓ కుర్చీలో కూర్చుని పేపరు చదువు కుంటున్నాడు రామం. అతనికి ఎదురుగా ఉన్న ఇంకో కుర్చీలో కూర్చుంది సీత.

"కాఫీ" అన్నాడు రామం.

"నేనడిగింది కప్పులో ఏముందని కాదు, పేపర్లో ఏముందని?" అంది సీత.





"ఏమో" అన్నాడు రామం.

"ఏముందో తెలియనప్పుడు దాన్ని చదవడం ఎందుకు?" అనడిగింది సీత.

"ఏముందో తెలిస్తే ఇంక చదవడం ఎందుకు? తెలియదు కాబట్టే చదవడం" అన్నాడు రామం.



"చదివితే ఏం తెలుస్తుంది? ఏమీ లేదనా –" అని పేపరు లాక్కుని పక్కన పడేసి కాఫీ కప్పు అందించింది సీత.

కాఫీ ఓ గుక్కెడు తాగి, పక్కన పెట్టి, –

"నీ మొహంలా ఉంది" అన్నాడు రామం.

"ఏం తక్కువయింది?" అంది సీత.

"బొట్టు" అన్నాడు రామం.

వెంటనే వేలితో నుదిటిని ఒకసారి తడుముకు చూసుకుని, "మొహం కడుక్కున్నాక బొట్టెట్టుకోవడం మర్చిపోయినట్లున్నాను" అని తనలో తాను అనుకుంటున్నట్లు రామంతో అని మంగళసూత్రాల్నొకసారి కళ్ళ కద్దుకుని, బొట్టు తొందరగా పెట్టుకోవాలన్న సదుద్దేశ్యంతో కుర్చీలోంచి లేచి వెనక్కి గిరుక్కున తిరిగింది.

ఎంత స్పీడుగా ఏ పని చెయ్యాలో తెలిసిన కాళ్ళూ, చేతులూ సీత సదుద్దేశ్యంతో ఏకీభవించి సహకరించాయి కానీ, సీత జడ మాత్రం, సీత వెనక్కి తిరిగిన వేగానికి పైకి లేచి, రామం కళ్ళకి తగిలింది.

"సీతా" అన్నాడు బాధగా రామం.

"ఏమయింది?" అంది మళ్ళీ ఇటు తిరిగి సీత. ఆ తిరగడంలో వెనకనున్న జడ ముందుకొచ్చింది.

సీత ఎంత పొడుగుందో అందులో సగం కన్న ఎక్కువ పొడుగుంది సీత జడ. సీత జడ ఎంత లావుందో అంతకు రెండింతలు కన్నా తక్కువ లావుంది సీత.

"జడ...." అన్నాడు కళ్ళను చూపిస్తూ రామం.

"తగిలిందా" అంటూ రామం దగ్గరికి నడిచి, అతని కళ్ళకు దగ్గరగా తన పెదాలను తీసికెళ్ళి ఊది, "ఏం చెయ్యనీ జడను" అని అంటూ జడని వెనక్కి వేసుకుని లోపలకు నెమ్మదిగా నడుస్తూ, "బోయ్‌కట్ చేయించుకోనా?" అని అడిగింది సీత.

జడ లేని సీతను ఊహించుకుందామని కళ్ళు మూసుకుని, ఆ రూపం ఊహించుకోలేక కళ్ళు తెరిచాడు రామం.

ఎదురుగా కుర్చీలో కూర్చునుంది సీత.

"ఎలా వచ్చావు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఇలా" అంది లోపలి గదిలోంచి బాల్కనీలోకి వచ్చేదారిని చూపిస్తూ సీత.

"నేనడిగింది దారి కాదు. నడిచిన అలికిడి వినపడకుండా ఎలా వచ్చావు?" అని అడిగాడు రామం.

"ఈ ప్రపంచంలో వినిపించని సవ్వడులెన్నో ఉన్నాయి" అంది సీత ఓ జీవిత



E:\
Ramaneeyam\
Ramaneeyam
6



సత్యాన్ని బోధిస్తున్నట్లుగా.

"ఇంట్లో కుంకం లేదా" అనడిగాడు రామం మళ్ళీ పేపర్ తీస్తూ.

"బొట్టు పెట్టుకున్నాగా" అంది సీత కుర్చీలో కూర్చుంటూ.

"నేనడిగింది మనింట్లో కుంకం లేదా?" అని అన్నాడు పేపర్లోంచి తలెత్తకుండా రామం.

"ఏం – మీకు కావాలా?" అంది సరదాగా నవ్వుతూ సీత.

"నా మొహానికి మెత్తుకోవడానికి కాదు – నీ మొహానికి ఆ స్టిక్కర్ బొట్టు బాలేదు – కుంకం బొట్టెట్టుకో" అన్నాడు రామం తీవ్రంగా పేపర్లోకి చూస్తూనే.

"నేను స్టిక్కర్ బొట్టు పెట్టుకున్నానా – చూడండి" అంది సీత.

పేపర్ పక్కకి పెట్టి, "ఓసి సర్కారీ" అన్నాడు రామం.

"మా అమ్మా నాన్నలు నాకు అందంగా సీత అని పేరు పెడితే ఈ సర్కారీ ఏం పిలుపు?" అంది సీత.

"నుదుటనున్న స్టిక్కర్ బొట్టుని మాయం చేసి ఈ కుంకం బొట్టునెలా పెట్టుకున్నావు? ఇదంతా ఇంద్రజాలంలా ఉంది. నీకు తెలియదులే కానీ, మేజిక్కులు చెయ్యడంలో సర్కార్ చాలా గొప్పవాడు. నువ్వు కూడా అలా ఇంద్రజాలం చేస్తున్నావని నిన్ను 'సర్కార్' అని పిలుద్దాం అనుకున్నాను. ఆడదానివయిపోయావని 'సర్కారీ' అన్నాను" అన్నాడు రామం.

"నేను స్టిక్కర్ పెట్టుకుంటే మీరు కుంకం పెట్టుకోమంటారనీ, ఇదుగో, ఇలా ముక్కుపొడెం వాళ్ళు నశ్యాన్ని పట్టుకున్నట్టు కుంకం పట్టుకుని తెచ్చాను" అంది సీత చేతి వేళ్ళతో అభినయం చూపుతూ.

"అది నీ నుదిటి మీద కెలా వచ్చింది?" అన్నాడు రామం.

"పెట్టుకుంటే" అంది సీత.

"ఏడిసినట్లుంది నీ తెలివి" అన్నాడు రామం.

"నీ తెలివిలాగానే" అంది సీత. అన్న వెంటనే రామానిక్కనిపించేటట్లు నాలిక్కరుచుకుంది.

"ఎందుకు నాలిక కరుచుకుంటున్నావు? నీ అన్నావనా?" అని అడిగాడు రామం.

"ఏమీ అనుకోకండి" అంది సీత గారంగా.

వాళ్ళిద్దరికీ రెండోసారి పెళ్ళవడానికి ముందు రామాన్ని నువ్వనేది సీత. ఒక్కోసారి 'పోరా' అనేది కూడా.

రెండోసారి పెళ్ళంటే – వాళ్ళిద్దరిలో ఏ ఒక్కరూ విడివిడిగా గానీ, కలిపి కానీ

రెండుసార్లు పెళ్ళి చేసుకోలేదు.

ఆంధ్ర రాష్ట్రంలో కృష్ణా గోదావరీ నదుల మధ్య ప్రాంతంలో పుట్టిన మరదళ్ళు అమ్మాయిలుగా కాక, అంతకు ముందు పుట్టిన బావలకు భార్యలుగా పుడతారు.

సీత పుట్టడమే రామానికి భార్యగా పుట్టింది. అది మొదటి పెళ్ళి.

సీత పుట్టిన ఇరవై రెండేళ్ళకి సీతారాములకి కళ్యాణ మండపంలో పెళ్ళయింది. అది రెండవ పెళ్ళి.

ఈ రెండు పెళ్ళిళ్ళకు మధ్య సీత రామాన్ని 'నువ్వ'నేది. రెండవ పెళ్ళి తరువాత 'మీ'రనడం నేర్చుకుంటోంది.

నుదుటున ఎర్రటి కుంకం బొట్టుతో ఉన్న సీతని చూశాక సీత నైటీలో ఉండడం చూశాడు రామం. అంతకు ముందు కూడా సీత నైటీలోనే ఉంది. అప్పుడు రామం సీతని గానీ, నైటీనిగాని చూళ్ళేదని కాదు. అయితే కుంకం బొట్టుకీ, నైటీకీ పొంతన కుదరదన్న భావంతో సీత బొట్టు పెట్టుకున్నాక సీతని చూశాడు. చూసి –

"ఆ నైటీ మార్చెయ్యి" అన్నాడు.

"ఇది కొని రెండు నెలలు దాటింది. కొట్టువాడు తీసుకోడు" అంది సీత.

"కొట్లో కాదు, ఇంట్లో" అన్నాడు రామం.

"నీళ్ళోసుకుని – " అంది సాగదీస్తూ సీత.

"నీళ్ళోసుకునా?" అన్నాడు రామం ఆశ్చర్యపడుతూ.

"అవును. నీళ్ళోసుకుని" అని, అని అన్నాక రామం మొహంలోని నవ్వుని చూసి, ఆ నవ్వుకి కారణమేమై ఉంటుందా అన్న ఆలోచనలో పడింది.

తను అడిగిన ప్రశ్నలోని కొంటెతనం సీతకి స్ఫురించేలోగానే రామం అన్నాడు – "నీళ్ళోసుకుందుకు అంత తొందరెందుకు?" అని.

"ఆ నీళ్ళోసుకోడం కాదు, మామూలుగా మీరు పోసుకునే నీళ్ళ లాంటి నీళ్ళు పోసుకున్నాక" అంది సీత సిగ్గూ, వ్యంగ్యం ధ్వనిస్తున్న కంఠస్వరంతో.

ఆ ధ్వని విననట్లుగా, "ఇప్పుడే మార్చుకో" అన్నాడు రామం.

"ఈ నైటీ కేమయింది?" అంది సీత.

"ఈ నైటీకేమీ అవలేదు. అవలేదు కానీ, ఈ నైటీ విప్పేసి, మొన్న పండక్కి నేను కొన్న ఎరుపు పువ్వుల డిజైనున్న తెల్ల రంగు చీర కట్టుకో" అన్నాడు రామం.

"మొన్న ఏం పండగ?" అంది సీత ఆశ్చర్యంగా.

"మొన్న కాకపోతే – నెల క్రితం – సంవత్సరాదికి కొన్నాగా – అది" అన్నాడు రామం.



E:\
Ramaneeyam\
Ramaneeyam
7



"ఇది సెప్టెంబరు నెల. సంవత్సరాది ఏప్రిల్‌లో వెళ్ళింది" అంది సీత.

"అదే ఏప్రిల్‌లో కొన్న చీర"

"సంవత్సరాదికి మనం మా ఊళ్ళో ఉన్నాం. మనిద్దరికీ బట్టలు కొన్నది మా నాన్న" అంది సీత.

"అయితే సంక్రాంతికి కొన్నానేమో" అన్నాడు రామం.

"సంక్రాంతి కింకా మన పెళ్ళవలేదు" అంది సీత.

"అయితేనేం – మనకి పెళ్ళవక పోతేనేం – నేను నీకు చీర కొనకూడదా?"

"నిక్షేపంగా కొనచ్చు. అయినా – మనకు పెళ్ళయినా మీరు నాకు చీర కొనలేదు. పెళ్ళికి ముందూ కొనలేదు – తర్వాతా కొనలేదు."

"కొన్నట్లే అనిపిస్తోంది నాకు" అన్నాడు రామం.

"కొనలేదనే అనిపిస్తోంది నాకు" అంది సీత.

"......"

"నేనున్నానా, కొన్నప్పుడు?" అడిగింది సీత.

"ఉన్నావా? లేవా?" అన్నాడు ఆలోచిస్తూ రామం.

"లేను. ఎందుకంటే మీరు కొనలేదు కనక" అంది సీత.

"కొన్నాను, చీర కొనడంలో నా కనుమానం లేదు" అన్నాడు రామం.

"కొంటే నా కివ్వలేదు" అంది సీత.

"నీ కోసం కొన్న చీర నీక్కాక ఇంకెవరికిస్తాను?" అన్నాడు రామం.

"ఇంకెవరికో..."

"అంటే" అన్నాడు రామం.

"అంటే అంటే అంటేనే...." అంది సీత.

"నువ్వు ఏమంటున్నావో నా కర్థం కావడం లేదు" అన్నాడు రామం.

"అర్థం అవకేం. అవుతోంది. అయితే కానట్లు మాట్లాడుతున్నారు అంతే!" అంది సీత.

"అది కాదు సీతా చీర కొని ఎవరికిచ్చాననంటావు?"

"ఎందరున్నారు ఇవ్వడానికి?"

"నీకు కాక ఇంకెవరికిస్తాను?"

"ఏమో, నాకేం తెలుసు? ఎవరికిచ్చారో ఆ రమణీమణిని గుర్తు చేసుకుంటూ కూర్చోండి" అంది సీత.

"ఛ! రమణికి కాదు. రమణికి ఆ చీర బాగా నప్పేదేమో కానీ, ఆవిడ కివ్వలేదు"

అన్నాడు రామం.

"రమణి ఎవరు?" అనడిగింది సీత.

"రమణి తెలియదా నీకు?" అన్నాడు అమాయకంగా రామం.

"చెప్పండి – తెలుసుకుంటాను" అంది వ్యంగ్యంగా సీత.

"మా ఆఫీసులో స్టెనో. బావుంటుంది" అన్నాడు రామం, సీత మాటల్లోని వ్యంగ్యాన్ని విననట్లు.

"స్టెనోలు కాక భార్యలు బావుంటారా?" అని అడిగి, రామం సమాధానం కోసం ఎదురు చూస్తున్నట్లు మొహం పెట్టుకు కూర్చుంది సీత.

సమాధానంగా సోదాహరణమైన చిన్న ఉపన్యాసం ఇచ్చాడు రామం.

"స్టెనోలూ, భార్యలూ పరస్పర భిన్నమైన గుంపులన్నట్లు మాట్లాడుతున్నావు నువ్వు. కొందరు స్టెనోలు భార్యలు కాకపోవచ్చు. కాని కొందరు స్టెనోలు భార్యలవచ్చు కూడా. ఉదాహరణకి రమణి స్టెనోయే కాని భార్య కాదు."

"కొందరు స్టెనోలు భార్యలవరు, సవతులవుతారు" అంది సీత.

"నువ్వేదో మనసులో పెట్టుకు మాట్లాడుతున్నావు" అన్నాడు రామం.

"నేనేం మనసులో పెట్టుకు మాట్లాడ్డం లేదు. మీరే మీ మనసులో ఆ రమణిని ఉంచుకుని, నాతో తియ్యని కబుర్లు చెప్తున్నారు" అంది సీత.

"ఛ, ఛ! నా మనసులో ఏ రమణీ లేదు – నువ్వు తప్పు" అన్నాడు రామం.

"తెల్ల రంగు మీద ఎర్ర పువ్వుల డిజైనున్న చీర కొన్నారా లేదా?" క్రాస్ ఎగ్జామినేషన్ మొదలెట్టింది సీత.

"కొన్నాను" అన్నాడు రామం నిజం చెప్తానని ప్రమాణం చేసిన ముద్దాయిలా.

"కొన్నప్పుడు మీతో ఇంకెవరో ఉన్నారు కదూ?"

"ఉన్నారు""

"అది నేను కాదు కదూ?"

"కాదు"

"మీతో ఎవరున్నారో వాళ్ళకే ఆ చీర ఇచ్చారు కదూ?"

"అదే గుర్తు రావడం లేదు"

"రాదు – ఎలా గుర్తొస్తుందీ – ఆ చీరని మీరిచ్చింది రమణి కయితే"

"మళ్ళీ అదే మాట – నేను రమణి కివ్వలేదు"

"మరెవరికిచ్చారు? నా కివ్వలేదు. మీ అమ్మగారి కివ్వలేదు. ఇచ్చేందుకు మీకు అక్క చెల్లెళ్ళు లేరు. రమణికి కాక ఇంకెవరికి ఇస్తారు?"



E:\
Ramaneeyam\
Ramaneeyam
8



"ఎవరికిచ్చానో గుర్తుకు రావడం లేదు. అసలా చీర కొన్న విషయమే మర్చిపోయాను. ఈ రోజు నీ నుదుటున కుంకం బొట్టు చూస్తోంటే ఆ చీర మీద ఉన్న పువ్వుల రంగు గుర్తొచ్చింది. ఎవరికిచ్చానబ్బా!"

"రమణికి"

"రమణి కెందుకిస్తాను?"

"ఇవ్వాలనిపించి"

"రమణి కెందుకివ్వాలనిపిస్తుంది?"

"ఈ ప్రశ్నకి నేను సమాధానం చెప్పలేను. సమాధానం నాకు తెలియక కాదు. కానీ, నా నోటితో నేను చెప్పలేను"

"అంత చెప్పలేని సమాధానం మనస్సులో ఉంచుకోవడం ఎందుకు? చెప్పెయ్యి"

"నేను చెప్పలేను, నన్నొదిలెయ్యండి"

"నువ్వనసరంగా నన్ను అనుమానించి, అవమానిస్తున్నావు. ఈ రమణితోనో, ఇంకో రమణితోనో సంబంధం లేదు నాకు"

"నేను నమ్మను. పేరుకి మాత్రం మీరు రాములు. నిజానికి కృష్ణుడే! ఈ రమణి ఓ గోపిక మాత్రం అయ్యుంటుంది. ఇంకెందరో గోపికలుండే ఉంటారు"

"నన్ను నమ్ము సీతా, నేను కృష్ణుడి లాంటి వాడిని కాను, రాముడి లాంటి వాడినే"

"కాదు – కృష్ణుడి లాంటి వారే"

"కాదు – రాముడి లాంటి వాణ్ణే"

"కాదు – కృష్ణుడి లాంటి వారే"

"కాదు – రాముడి లాంటి వాణ్ణే"

"కాదు – కృష్ణుడి లాంటి వారే"

"అవును – కృష్ణుడి లాంటి వాణ్ణే"

"ఏమన్నారు? అవుననే కదూ? నాకు తెలుసు?" అని ఇంకా ఏవో అనబోతున్న సీత మాటలకి అడ్డొస్తూ –

"కృష్ణుడు కూడా అనవసరంగా శమంతక మణిని ఎత్తుకుపోయాడని అపనిందల పాలయ్యాడు. నా బ్రతుకూ అలాగే ఉంది" అన్నాడు రామం.

"కృష్ణుడు నీలాపనిందల పాలయ్యాడు" అంది సీత, రామం అన్న మాటల్లోని తప్పుని సవరిస్తున్నట్లు.

"నేనూ అంతే!"

"మీవి నీలాపనిందలు కావు. నిజమైన నిందలే!" అంది సీత.

"నిజమైన నిందలు కావు. నీలాపనిందలే!!!" అన్నాడు రామం.

"అంత గట్టిగా ఎలా చెప్తున్నారు?" అని అడిగింది సీత.

"ఎందుకంటే వినాయక చవితి నాడు నాకు పూజ చెయ్యడం, వినాయక వ్రత కథ వినడం చిన్నప్పట్నుంచీ అలవాటు లేదు. ఎన్నో సంవత్సరాల పాపాలన్నీ నన్ను చుట్టుకుని, ఈ రోజు ఇలా నా భార్య చేత అనుమానించబడుతున్నాను."

"అంతకు ముందు సంవత్సరాల చవితుల పాపాలు ఇప్పుడింకా ఉండవు. ఏ సంవత్సరపు పాపపుణ్యాలు ఆ సంవత్సరం చవితితో క్లోజ్ అయిపోతాయి" అంది సీత.

"ఈ సంవత్సరం కూడా నేను పూజ చెయ్యలేదుగా – నువ్వే – ఒక్కదానివే చేసుకున్నావు" అన్నాడు రామం.

"మిమ్మల్ని కూడా పూజ చేసుకోమన్నాను. మీరే చేసుకోలేదు. కథ చెప్తానంటే విన్నన్నారు. నేనేం చెయ్యను?"

"భార్యవి కదా – ఆ మాత్రం నచ్చచెప్పద్దూ?"

"ఆ రోజు – అప్పటికింకా మీరు గడ్డం గీసుకోకపోయినా ఫరవాలేదనుకుని, గరుకు గడ్డాన్ని పట్టుకుని బతిమాలి మరీ చెప్పాను. విన్లేదు మీరు. అయినా మీకో విషయం గుర్తుందో లేదో కానీ, మిమ్మల్ని ఆ రోజు చంద్రుణ్ణి చూడనియ్యలేదు నేను" అంది సీత.

"అలా ఎలా?" అన్నాడు రామం.

"మీరు కథ విని నెత్తి మీద అక్షింతలు వేసుకోలేదని, ఆ రోజు సాయంత్రం నుండి మిమ్మల్ని బెడ్రూం నుండి కదలనియ్యలేదు" అంది సీత కాస్త సిగ్గుపడుతూ. అలా సిగ్గు పడుతూ కూడా అంతకు ముందున్న అలకని తగ్గించుకోలేదు. ఆ రెండు ఫీలింగులూ అద్భుతంగా కలిసిపోయి కనిపించాయి సీత మొహంలో రామానికి. అయితే ఆ అందం కన్న సీత తన కోసం చేసిన త్యాగానికి ఎక్కువ విలువ ఇస్తున్నట్లు, "నువ్వెంత మంచిదానవు సీతా – నేనంటే నీ కెంత ప్రేమ?" అన్నాడు రామం.

"నాకుంటే ఏం లాభం? మీకుండొద్దూ?" అంది సీత సిగ్గును వదిలేసి, అలకని వదలకుండా.

"మళ్ళీ అదే అపవాదు" అన్నాడు రామం.

"అపవాదు కాదు, నిజమే! చవితినాడు మీరు పూజ చెయ్యలేదు – కథ – వినలేదు – అయితే చంద్రుణ్ణి కూడా చూడలేదు" అంది సీత.



E:\
Ramaneeyam\
Ramaneeyam
9



"నన్ను చీర గురించి గుర్తు చేసుకోనియ్యి" అన్నాడు రామం కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ.

"పెళ్ళాయ్యాక మనం చీర కొనడానికి ఎక్కడికీ వెళ్ళలేదు" అంది సీత.

"పెళ్ళికి ముందే కొనుంటాను" అన్నాడు రామం కళ్ళు తెరవకుండా.

"కొని ఎవరికిచ్చారు?"

"అదే గుర్తుకు రావడం లేదు."

"మీ వాలకం చూస్తూంటే మీరు నన్ను మోసం చేస్తున్నట్లుంది. మిమ్మల్ని నమ్ముకున్నందుకు నన్ను నట్టేట్లో ముంచేటట్టున్నారు" అంది సీత.

కళ్ళు తెరవలేదు రామం.

"ఏదో ఒక రోజు ఆ రమణిని ఇంటికి తీసుకొచ్చేసేటట్లున్నారు మీరు?" అంది సీత.

నోరు విప్పలేదు రామం.

"నేను అరుస్తూంటే, నోరెత్తరేం మీరు? ఇలాంటి మౌన స్వాముల వేషాలు వేసేవాళ్ళు రకరకాల వెర్రి వేషాలేస్తారు. మీరు ఆ రమణిని ఇంటికి తీసుకొచ్చేలోగా నేను మా పుట్టింటికి వెళ్ళిపోతాను" అంటూ లోపలికి వెళ్లింది సీత.

కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నట్లున్న రామం ఉన్నట్లుండి ఏదో గుర్తొచ్చినట్లు కళ్ళు తెరిచి, 'సీతా!' అని అరవబోయాడు.

ఎదురుగా కుర్చీలో సీత కూర్చునుంది.

"ఇది కలయా? నిజమా? వైష్ణవీ మాయయా?" అన్నాడు రామం.

"వైష్ణవి ఎవరు?" అని అడిగింది సీత.

"విష్ణువు భార్య"

"నేనే విష్ణువునీ ఎరగను – రాముడిని తప్ప" అంది సీత.

"ఇంతకీ ఈ మాయెలా చేశావు?" అనడిగాడు రామం.

"మాయలు కృష్ణుడు చేస్తాడు. రాధ కాదు"

"నువ్వు సీతవా? రాధవా?"

"మీరు రాముడైతే సీతను. కృష్ణుడైతే రాధను"

"నేను రాముణ్ణే. నాకు ఏ రమణితోనూ సంబంధం లేదు"

"ఈ రమణితో కూడానా?" అంది తన్ను తాను చూపించుకుంటూ సీత.

"అదొదిలెయ్యి – ఈ చీరెలా వచ్చింది?"

"ఎక్కడకు – నా ఒంటి మీదకా, ఈ ఇంటి లోనికా?" అంది నాటకంలోని

డైలాగు చెప్తున్నట్లుగా.

"ముందుది ముందు చెప్పు"

"మీరు ఆలోచనల్లో మునిగిపోయి, కళ్ళు మూసుకుని ఉండగా కట్టుకున్నాను"

"అంత తొందరగా ఎలా మార్చావు సర్కారీ?"

"మార్చలేదు. నైటీ మీదే కట్టుకున్నాను"

"ఇంక రెండో విషయం – ఈ ఇంటికి ఎలాగొచ్చింది?"

"నేనే తెచ్చాను"

"ఎక్కణ్ణుంచి?"

"మా పుట్టింటి నుంచి"

"ఇది నేనే కొన్నాను. నేనే సెలెక్ట్ చేసి, నేనే డబ్బిచ్చి కొన్నాను. ఇది మీ పుట్టింటికెలా వచ్చింది?"

"దీన్ని కొన్నప్పుడు మీ పక్కనెవరున్నారు?"

"మామయ్య"

"మన పెళ్ళికి ఓ నెల ముందు పెళ్ళి బట్టలు కొనడానికి మీ ఊరు వచ్చారు నాన్న. మీరు, నాన్న కలిసి కొట్టు కెళ్ళారు. నాన్న బట్టలు కొంటుంటే మీరు ఈ చీర తీసుకుని డబ్బిచ్చారు. ఈ చీర పాకెట్టు, తక్కిన బట్టల పాకెట్టుతో కలిసి మా ఊరొచ్చింది. కొట్లో మీరు కొన్నారనీ, మా నాన్న ఆ చీర నా కిచ్చి కట్టుకోమన్నారు. నేను కట్టుకోలేదు. నా పెట్టెలో జాగ్రత్తగా దాచిపెట్టాను. పుట్టింటి నుండి ఇక్కడికి వస్తున్నప్పుడు నా పెట్టెలో ఇదీ వచ్చింది"

"ఈ చీర నీ పెట్టెలో ఉందని నాకు తెలుసు" అన్నాడు 'రామారావు కృష్ణుడి'లా చిర్నవ్వుతో రామం.

"తెలుసా?" అంది 'జమున సత్యభామ'లా కోపిస్తూ సీత.

"చీర పాకెట్టుని కావాలనే మావయ్య కొన్న తక్కిన బట్టల పాకెట్టులో పెట్టాను నేను. అది నీ కందుతుందనీ, దాన్ని కట్టుకు సిగ్గుపడుతూ నా దగ్గరకు వస్తావనీ, ఊహించుకుంటున్నాను. ఇన్నాళ్ళూ ఎప్పుడు ఈ చీర ఆ పెట్టెలోంచి నీ ఒంటి మీద కొస్తుందా అని ఎదురు చూస్తున్నాను. ఇన్నాళ్ళ కొచ్చిందది"

"ఏమో ఎవరికి కొన్న చీరో తెలియకుండా ఎలా కట్టుకోను?" అంది సీత.

"నన్నడిగి ఉండొచ్చుగా" అన్నాడు రామం.

"మీరు నన్ను కట్టుకోమని చెప్పి ఉండొచ్చుగా" అంది సీత.

"నీకు నచ్చక నువ్వు కట్టుకోడంలేదేమో అనుకున్నాను"



E:\ Ramaneeyam\ Ramaneeyam 10



"ఒకవేళ అడిగితే అది నా కోసం కొనలేదంటారేమోనని నేను భయపడ్డాను"

"నీకు కాక ఇంకెవరికి కొంటాను?"

"రమణికి"

"మళ్ళీ అదే మాట"

"ఊరికే అంటున్నా – మీకే రమణితోనూ సంబంధం లేదని తెలియదా నాకు?"

"మరెందుకలా అన్నావు ఇంతసేపు?"

"నీలాపనింద" అంది సీత.

"ఇంతకీ నేను చవితి రోజు చంద్రుణ్ణి చూడలేదు కదా. నా కెందుకు నీలాపనింద, అబద్ధంతో అయినా తగిలిందంటావ్?"

"ఏమో!" అంది సీత.

"నేను చెప్పనా? నువ్వు చూడలేదు. కానీ నేను చూశాను చంద్రుణ్ణా రోజు"

"మనిద్దరం ఒకే చోట ఉన్నాం. నాకు కనిపించని చంద్రుడు మీకెలా కనిపించాడు?"

"ఈ క్షణంలో నీకు చంద్రుడు కనిపిస్తున్నాడా?"

ఆకాశం వైపొకసారి చూసి, "లేదు" అంది సీత.

"నిరంతరం నాకు కనిపిస్తూనే ఉంటాడు – చవితి చంద్రుడు కాదు, పున్నమి చంద్రుడు" అన్నాడు సీత మొహం వైపు చూస్తూ.

"ఆఁ" అంది సీత సాగదీస్తూ.

"నీ జుట్టు నిశి, నీ మొహం శశి" అన్నాడు రామం.

"ఏడిసినట్లుంది, నీ కవిత్వం" అని, నాలిక్కరుచుకుని, "కాఫీ వేడిచేసి తెస్తానుండండి" అంటూ  వంగి కాఫీ కప్పందుకుని లేచి నిల్చుంది, తెల్లరంగు పైన ఎఱ్ర పువ్వు డిజైనున్న చీరలో సీత.

"చాలా బావుంది" అన్నాడు రామం.

"ఏంటీ" ఈ చీరా?" అంది సీత.

"ఈ చీర నీకు" అన్నాడు రామం. అంటూ చీర కొంగందుకోబోయాడు.

"ఆశ" అంటూ వెనక్కి జరిగింది సీత.

"ఇది నేను కొన్న చీరేగా" అన్నాడు రామం కుర్చీలోంచి లేస్తూ.

"అయితే మాత్రం నా ఒంటి మీదకి చేరాక నాదే" అంటూ లోపలికి నడిచింది సీత.

సీత వెంటే కదిలింది సీత జడ.

ఆ వెనకే రామం.

❁

'జాగృతి' – దీపావళి ప్రత్యేక సంచిక (1996)

# న యయౌ న తస్థౌ

"వచ్చినట్లే లేదు. అప్పుడే వెళ్ళిపోతున్నారు. వస్తారు, వస్తారు అనుకున్నంతసేపు పట్టలేదు. రావడం, వెళ్ళడం కూడా అయిపోతున్నాయి"

"నాకూ అలానే ఉంది. పెళ్ళయి ఇక్కడ నుండి వెళ్ళినప్పటి నుండి ఎదురు చూస్తున్నాను – దసరా పండక్కి ఇంటికి రావచ్చునని. నాలుగు నెలలు ఎదురు చూస్తే, వారం రోజులు నాలుగు క్షణాల్లా అయిపోయాయి. వెళ్ళాలంటే నాకూ బెంగగా ఉంది."

"నాకు తెలీదా ఏంటి, ఈ బెంగ? అది కాదు కానీ, మీరు ఇంకో రెండు రోజులుండి వెళ్ళకూడదూ?"

"కుదరదమ్మా, ఆయన బయల్దేరుతున్నప్పుడే చెప్పారు. రేపు డ్యూటీలో చేరిపోతానని – ఆగడం కుదరదు"

"పోనీ, ఇంకోసారి అడుగరాదూ?"



E:\
Ramaneeyam\
Ramaneeyam
11



"అడుగుతాను, ఇంకో రెండు రోజులుండగలిగితే, నాకూ బావుంటుంది. అడిగి చూస్తాను. ఆయన సరేనంటే ఆనందమే."

"లేస్తున్నట్లున్నాడు. ఏమైనా కావాలేమో కనుక్కో"

❋ ❋ ❋

"ఏమండీ!"

"ఊ–"

"లేచారా?"

"ఇప్పుడే లేస్తున్నాను"

"ఇవిగో, మంచినీళ్ళు"

"....."

"ఏమైనా తింటారా?"

"మధ్యాహ్నం తిన్న అన్నమే ఇంకా అరగలేదు. ఇప్పుడింక ఏమీ తినలేను"

"ఏమండీ–"

"ఊ–"

"మీరు రేపు డ్యూటీలో చేరి తీరాలా అని అమ్మ అడగమంది"

"అత్తయ్య అడగమందా – నువ్వే అడుగుతున్నావా?"

"అమ్మతోడు – అమ్మే అడగమంది"

"చేరి తీరాలని ముందే చెప్పానుగా. ఆ మాటే చెప్పాల్సింది"

"నేను చెప్పాను. అయినా కుదురుతుందేమోనని కాస్త కనుక్కోమంది. పోనీ రెండు రోజులుండి వెళ్ళవచ్చుగా అంది"

"అదేమీ కుదరదు కానీ – కాస్త కాఫీ తీసుకురా"

❋ ❋ ❋

"ఏమన్నాడే, అల్లుడు?"

"కుదరదన్నారమ్మా, వెళ్ళి తీరాలట"

"తప్పదన్నమాట"

"తప్పదన్నారు. రాములమ్మ జున్నుపాలు తెస్తానంది దానికింకా కుదిరినట్లు లేదు. నాకు తినే యోగం లేదన్నమాట"

"అది కనిపించి మరీ చెప్పింది – అమ్మాయిగారు వెళ్ళేలోగా తెస్తానని"

"ఆదిలక్ష్మి సీతాఫలాలు తేలేదు. పండుగ రోజులు దానికీ తీరిక ఉండి ఉండదు. రేపో, ఎల్లుండో తెస్తుందేమో"

"అందుకేగా రెండు రోజులుండి వెళ్ళమంటున్నాను. నువ్వేమో కుదరదంటున్నావు"

"కుదరనిది నాకు కాదు, మీ అల్లుడికి"

"పోనీ, నువ్వుండరాదూ రెండు రోజులు?"

"రెండు రోజులేం – నువ్వు దీపావళి వరకు ఉండమంటావు"

"ఏం ఉండకూడదా? – ఇది నీ ఇల్లు కాదా?"

"నాకూ ఉండాలనే ఉంది. దసరా సరదా పండగే. అంతకన్నా సంబరాల పండగ దీపావళి. దీపావళికి ఆ పక్కింటి శారదా, ఈ పక్కింటి సరస్వతీ కూడా వస్తారట. అందరం దీపాలు వెలిగించుకుని చిచ్చుబుడ్లు కాల్చుకోవచ్చు"

"అల్లుడితో చెప్పు – ఉండిపో"




E:\
Ramaneeyam\
Ramaneeyam
12



"ఉండు – కాఫీ ఇచ్చి వస్తాను"

❁ ❁ ❁

"కాఫీ నువ్వు చేసావా? అత్తయ్యా?"

"కాఫీ బావుందా? లేదా?"



"బావుంది. నువ్వు చేసి ఉండవు"

"అమ్మే చేసింది"

"రేపటి నుండి ఈ కాఫీ యోగం ఉండదు నాకు"

"అందుకే ఇంకో రెండు రోజులుండి, ఈ కాఫీ యోగం అనుభవించండి"

"కుదరదన్నానుగా"

"మీకు కుదరకపోతే, నన్ను దీపావళి దాకా ఉండమంటోంది అమ్మ"

"ఎప్పటి దాకా?"

"దీపావళి దాకా"

"దీపావళి అంటే, ఇంకా ఎన్ని రోజులు?"

"ఎంత – ఇరవై రోజులు"

"ఇరవై రోజులు నిన్ను వదిలి నేనుండగలనా? నువ్వు నన్ను వదిలి ఉంటావా?"

"అమ్మ ఉండమంటోంది"

"నీ యిష్టం. నీకు ఉండాలనిపిస్తే నువ్వు ఉండు. నా కష్టం నేను పడతాను"

"మీరు కష్టపడాలని కాదు"

"కాదా. నువ్వు లేకపోతే నాకు కష్టం కాదూ?"

"భోజనానికి ఇబ్బంది అవుతుంది కదూ?"

"భోజనానికి కాదు – దానికేం – ఎక్కడో నాలుగు మెతుకులు కతికితే సరిపోతుంది. పెళ్ళికి ముందర అలవాటు లేదా ఏమిటి, హోటల్ భోజనం?"

"మరి ఇంక అవస్త ఏముంది?"

"ఆ మాత్రం తెలియదా? తెలిసే అడుగుతున్నావా?"

"తెలిస్తే ఎందుకడుగుతాను? తెలియకే అడుగుతున్నాను"

"నువ్వు లేకుండా నాకు ఒక్క క్షణం గడవదు. నీ ముద్దు మోము చూడకుండా నేనుండగలనా?"

"మీ మొద్దు మోము చూడకుండా నేనుండగలనా?"

"ఏమన్నావు?"

"మొద్దు మోము అన్నాను"

"నాది మొద్దు మోమా?"

"మీరెవరి వారు?"

"నీ వాణ్ణి"

"మీరు నా వారయతే, మీ మోము ఎవరిది?"



E:\
Ramaneeyam\
Ramaneeyam
13



"నీదే"

"నా మోముని నేను ముద్దనుకుంటానా, మొద్దనుకుంటానా?"

"నీ నన్ను పంపించి, నువ్వు ఇక్కడ సుఖంగా ఉండగలవా?"

"ఉండలేను."

"మరి ఉంటానని అన్నావు"

"అమ్మ అడిగింది కదా, అని"

"నీ యిష్టం – నీకు ఉండాలనిపిస్తే ఉండు"

"నా ఇష్టమైతే, మీతో వచ్చెయ్యాలనే. మీరు పక్కన లేకుంటే, నాకు తిండి సయిస్తుందా, నిద్ర పడుతుందా? అమ్మో – మీరు లేకుండా ఉండడమే"

"మరి ఎలా ఉంటావు?"

"ఉండలేను"

"అయితే, ఈ రోజు నాతో వచ్చేస్తావా?"

"వచ్చేస్తాను. ఈ కాఫీ కప్పు పెట్టేసి వస్తానుండండి"

❋ ❋ ❋

"ఏమ్మా, టిక్కెట్ కేన్సిల్ చేయించుకుంటావా?"

"నేను లేకుండా ఉండలేనన్నారమ్మా ఆయన"

"మగాళ్ళు అలానే అంటారమ్మా. పెళ్ళయిన కొత్తలో ఏ మగాడూ భార్య లేకుండా ఉండగలననడు"

"ఆయనే కాదు – నేనూ –"

"నువ్వూ ఉండలేవు. నాకు తెలియదూ? నేను ఉండగలిగానా? నువ్వూ అంతే. అప్పుడు నాకూ మా అమ్మా నాన్నల బాధ అర్థం కాలేదు"

"నాకు తెలుసునమ్మా. నేను వెళ్తే నువ్వు బాధపడతావని. నాకూ నీ దగ్గర కొన్నాళ్ళు ఉండాలనే ఉంది. ఆయన ఒక్కరూ ఉండాలని...."

"నాకు తెలియదా తల్లీ నీ బాధ"

"వారం రోజులవుతోంది వచ్చి. స్నేహితుల ఇంటికి వెళ్ళలేదు. వేణుగోపాలస్వామి గుడికి వెళ్ళలేదు."

"నువ్వు వచ్చినట్లు పూజారిగారికి తెలుసు కూడా."

"గుడికెళ్ళి పూజ చేయించాలి. ఇంకొన్నాళ్ళు ఉంటే, స్నేహితులను కలవడం కూడా అవుతుంది. ఆదిలక్ష్మిని చూసి చాలా రోజులయింది. అది సీతాఫలాలు తెస్తుంది"

"ఈరోజు వెళ్ళిపోతుంటే చెప్పు, నాన్నగారిని పంపి సీతాఫలాలు తెప్పిస్తాను."

"వద్దమ్మా – పళ్ళు మా ఊళ్ళో దొరకవూ? ఆదిలక్ష్మి తెచ్చిన పళ్ళు తినాలనుంది. నేను తింటోంటే, దాని కళ్ళలో ఎంత ఆనందమో"

"దానికి నువ్వంటే ఎంతో ఆపేక్ష."

"శారద అమ్మగారు, నేను ఊరు వచ్చి, వాళ్ళింటికి వెళ్ళకుండా వెళ్ళిపోయానంటే బాధపడతారు"

"సరస్వతి వదినె బాధపడదూ?"

"ఏంటో, ఎవ్వరినీ కలవకుండా వెళ్ళిపోతున్నాను"

"అందుకే ఉండమంటున్నాను"

"నాకూ ఉండాలనే ఉంది"

"ఉండు తల్లీ! మళ్ళీ ఇప్పుడే వస్తావా ఏంటి? సంక్రాంతి దాకా రాకపోవచ్చు. ఇంక రెండు వారాలేగా దీపావళి. అంతవరకూ ఉండి వెళ్ళు"

"నాన్నగారి దగ్గర కూర్చుని మాట్లాడినట్లే లేదు. నాకూ కొన్నాళ్ళు ఉండాలనే ఉంది. ఉండు ఆయనకు చెప్పి వస్తాను"

❁ ❁ ❁

"అదేంటి, ఇప్పుడేగా ఈ రోజు నాతో వచ్చేస్తానన్నావు"

"కొన్నాళ్ళు ఉండి వస్తానండీ"

"ఎన్నాళ్ళు ఉన్నా అలానే అనిపిస్తుంది. దీపావళి తర్వాత మాత్రం రావాలని ఉంటుందా? ఇక్కడ ఉంటే నీకు బానే ఉంటుందేమో – నేను ఒక్కడినే ఉండాలి. నువ్వు లేకుండా నేను ఉండలేనని అంటున్నా, నీకు నా మీద జాలి కలగడం లేదు"

"అలా అనకండి"

"అలా కాక, ఇంకేమనమంటావు? పెళ్ళయినప్పట్నుంచి, ఒక్క రోజయినా నిన్ను వదిలి ఉన్నానా నేను? ఇప్పుడు ఎలా ఉండడం?"

"పోనీలెండి – వచ్చేస్తాను"

"నా కోసం నువ్వు వచ్చెయ్యక్కర్లేదు"

"మీ కోసం కాదు. నా కోసం – నేనూ మిమ్మల్ని వదిలి ఉండలేను. నేనూ వచ్చేస్తాను"

❁ ❁ ❁

"అదేంటి – ఇప్పుడేగా ఉంటానన్నావు?"

❁ ❁ ❁

"అదేంటీ – ఇప్పుడేగా వస్తానన్నావు?" ❁



E:\
Ramaneeyam\
Ramaneeyam
14



'రచన' – జన్మదిన ప్రత్యేక సంచిక – ఫిబ్రవరి, *1999*

# అంకురం

**ఆ** రోజే ధనుర్మాసం మొదలయింది. దాంతో పాటే చలీ మొదలయింది. చలంటే భరించలేని చలి కాదు.

సంవత్సరంలో సగం పైగా వేసవి వేడినే అనుభవించే నగర వాసులకు – డిసెంబర్, జనవరి నెలలే కాస్త చల్లదనాన్నీ, ఆహ్లాదాన్నీ ఇచ్చేవి.

ఆ చల్లదనం ఇచ్చే నిద్రలోనూ – నిద్ర ప్రసాదించే సుఖంలోనూ మునిగి ఉన్న రామానికి ఉదయం నాలుగవుతూండగా హటాత్తుగా మెలకువ వచ్చింది.

అతని మనస్సు ఏదో కావాలని తహతహ లాడింది. అతని కళ్ళు దేన్నో చూడాలని

తొందరపడ్డాయి.

మంచం మీద నుండి లేచి కిటికీ దగ్గర కెళ్ళి చూశాడు.

మూడంతస్తుల మేడ మీద నుండి ఇంటి ముందున్న రోడ్డు నిర్మానుష్యంగా కనిపించింది.

మేడలోని తక్కిన ఫ్లాట్ల నుండి ఏ అలికిడీ లేదు.

తను చూడదలచుకున్నది, చూడలేక పోతున్నందుకు ఏం చెయ్యాలో తెలియక ఆలోచిస్తూ వెనక్కి తిరిగాడు.

మంచం మీద సుఖంగా నిద్రపోతోంది సీత.

అంతకు ముందు సంవత్సరం ధనుర్మాసానికి సీత రామం ఇంట్లో లేదు. రామం సీత ఇంట్లో ఉన్నాడు. సీత ఇల్లంటే సీత తండ్రి ఇల్లు. అంటే రామం మేనమామ ఇల్లు.

ఆ సంవత్సరం ధనుర్మాసానికి రామం ఆ ఇంటికి వెళ్ళకపోతేనో –

వెళ్ళినా ఉదయమే లేచి సీత ముగ్గులు పెట్టడం చూడకపోతేనో–

చూసినా రామం అలా తన్మయుడై తన్ని చూసేవాడన్న సంగతి సీత కనిపెట్టి ఉండక పోతేనో –

ఈ సంవత్సరం ధనుర్మాసానికి కూడా సీత, సీత ఇంట్లోనే ఉండేది.

పోయిన సంవత్సరానికి ముందు, రామం ఎప్పుడూ సీత వాళ్ళ ఊరు ధనుర్మాసం సమయానికి వెళ్ళలేదు. ఉదయమే లేచి సీత ముగ్గులు పెడ్తుండడం చూడలేదు.

లేదు కాబట్టే సీతని చేసుకోమని తల్లి ఎంత చెప్తున్నా రామం అంగీకారం చెప్పలేదు. అప్పటికి రామానికి సీతను పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన లేదు. అలాగని చేసుకోకూడదన్న ఆలోచనా లేదు.

తన్ని పెళ్ళి చేసుకుంటానని అనని రామానికి తనంటే ఇష్టం ఉందో లేదోనన్న అనుమానంతో, సీతా రామాన్ని పెళ్ళి చేసుకొంటానని అనలేదు.

వాళ్ళిద్దరిలోనూ ఒకరినొకరు పెళ్ళి చేసుకోవాలని ఆలోచన మొలకెత్తింది, పోయిన సంవత్సరపు ధనుర్మాసం తొలి దినానే. ఆ రోజు నుండి ఓ నెల రోజులు గడిచి సంక్రాంతి పండగ వచ్చేసరికి, వాళ్ళిద్దరూ ఒకరినొకరు విడిచి ఉండలేని స్థితికి వచ్చేశారు. ఒకరికి ఒకరై, ఒక్కరై ఉండిపోవాలనుకున్నారు. వాళ్ళు అనుకున్నదీ, వాళ్ళ తల్లితండ్రులు అనుకున్నదీ ఒక్కటే అవ్వడంతో, ఇద్దరి పెళ్ళి సవ్యంగా జరిగిపోయింది.

ఆ సమయంలో రామం కొత్త ఉద్యోగంలో చేరడంతో కొత్త దంపతులు కొత్త



E:\
Ramaneeyam\
Ramaneeyam
15





నగరంలో కొత్త కాపురం మొదలెట్టారు.

నెలలు రోజుల్లా, రోజులు గంటల్లా, గంటలు నిమిషాల్లా కులాసాగా గడిపేస్తున్న వారి జీవితంలోకి మళ్ళీ ప్రవేశించింది ధనుర్మాసం.

దాంతో రామంలో బాధ మొదలయ్యింది. అది భరించలేక సీత దగ్గరికెళ్ళి పక్కన కూర్చున్నాడు.

అంత నిద్రలోనూ, రామం తన పక్కన కూర్చోడాన్ని గమనించిన సీత అతని

జుట్టు లోకి వేళ్ళు దూర్చి – "ఏంటీ" అని అడిగింది.

నిద్ర మత్తులో మాట్లాడుతున్న సీత గొంతు మత్తుగా, అందంగా వినిపించింది. కానీ, దాన్ని గమనించే స్థితిలో లేని రామం –

"మెలకువ వచ్చేసింది" అని అన్నాడు.

"టైమెంతయిందేంటి?" అని అడిగింది సీత – అదే నిద్ర మత్తులో, అదే మత్తు గొంతుతో.

"నాలుగుంపావయింది" అన్నాడు రామం.

"అంతేనా, ఇంకా రెండు గంటలు పడుక్కోవచ్చు. పడుక్కోండి" అంది సీత.

"నిద్ర రావడం లేదు" అన్నాడు రామం.

రామం ఎందుకో బాధపడుతున్నాడనిపించి, లేచి కూర్చుని, "ఏమయింది?" అని అడిగింది సీత.

"పోయిన సంవత్సరం ఇదే రోజు, ఇదే సమయం మనం ఎక్కడున్నామో, ఏం చేస్తున్నామో గుర్తుందా, నీకు?" అని అడిగాడు రామం.

సీత కొంతసేపు ఆలోచించి, "అసలు ఈ రోజు ప్రత్యేకత ఏంటో" అని స్వగతంలో అంటున్నట్లు అంది.

"ఈ రోజే ధనుర్మాసం మొదటి రోజు" అన్నాడు రామం – ఇది కూడా గుర్తు లేదా అన్నట్లు చూస్తూ.

"అవును" అంది సీత – అయితే ఏమిటన్నట్లు చూస్తూ.

"పోయిన సంవత్సరం ఈ రోజే సన్నని నీ నాజూకు వేళ్ళ నుండి జాలువారుతున్న ముగ్గుని నేను చూసింది" అన్నాడు రామం సీత వేళ్ళని తన వేళ్లలోకి తీసుకుంటూ.

"కొత్త చోటులో సరిగ్గా నిద్ర పట్టడం లేదన్న నెపంతో – ఆ రోజే కాదు – ఆ నెల రోజులూ – నేను ముగ్గు పెట్టడం చూస్తూనే ఉన్నారు మీరు" అంది సీత.

"ఆ రోజు నా కింకా గుర్తుంది సీతా!" అంటూ తన మనోస్క్రీను మీద రంగుల చలన చిత్రాన్ని చూస్తూ – సినిమా ఫక్కీలో మాట్లాడసాగాడు రామం.

అదే సీనుని తన మనోస్క్రీను మీద చూస్తూ వినసాగింది సీత.

❀ ❀ ❀

ధనుర్మాసం ఉదయమే లేచి ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులు పెట్టడం సీతకి చిన్నప్పట్నుంచి ఉన్న ఇష్టమైన అలవాటు. స్కూలూ, కాలేజీల చదువుతో పాటు కొత్త కొత్త ముగ్గులు నేర్చుకొని ఇంటి ముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దుతూండేది.

ఆ సంవత్సరం ధనుర్మాసానికి ముందు రోజు సీతా వాళ్ళ ఊరొచ్చాడు రామం.



E:\
Ramaneeyam\
Ramaneeyam
16



అంతకు ముందు చేస్తున్న ఉద్యోగం మానేశాక కొత్త ఉద్యోగంలో చేరడానికి ముందు కొన్నాళ్ళ వ్యవధి దొరికితే ఆ విరామాన్ని సీతా వాళ్ళింట్లో గడపడానికి వచ్చాడు రామం.

వాళ్లిద్దరూ బావా మరదళ్ళు అయినా – చుట్టూ ఉన్న వాళ్ళు వాళ్లిద్దర్నీ భార్యాభర్తలనే అనుకుంటున్నా – వాళ్లిద్దరికీ పెళ్ళి చేసుకుందామనే అభిప్రాయం ఆ రోజు కింకా కలగలేదు.

ఆ రాత్రి అందరూ సరదాగా కబుర్లు చెప్పుకొని పడుక్కున్నారు.

ఉదయం నాలుగవుతూండగా ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చేసింది రామానికి. కిటికీలోంచి వీధి గుమ్మంలోకి చూశాడు.

ఆకాశంలోని చుక్కల ప్రతిబింబాల్లా, నేల నిండా చుక్కలు కనిపించాయి.

ప్రతిబింబాలు నీళ్ళలో కాక నేల మీద ఎలా కనిపిస్తున్నాయా అని కళ్ళు. నులుము కుని చూసిన రామానికి –

ఆ నేల మీద చుక్కలు నింగిలోని చుక్కల ప్రతిబింబాలు కావనీ, అవి తెల్లటి ముగ్గు చుక్కలని తెలిసింది.

ఇంటి ముందున్న విశాలమైన వీధిలో సగ భాగం దాకా చుక్కలు – ఒకదానికీ, మరోదానికీ సమానమైన దూరాలలో, ఒకే పరిమాణం గల చుక్కలు – అడ్డంగా, నిలువుగా నేల మీద పరుచుకున్న అందమైన చుక్కలు.

వాటినక్కడ పెట్టినది ఎవరా అని చూశాడు రామం.

తెల్లటి ముగ్గు నిండి ఉన్న కొబ్బరి చిప్పని ఒక చేత్తోనూ, చలికి తల చుట్టూ చుట్టుకున్న చీర కొంగుని జారిపోకుండా మరో చేత్తోనూ పట్టుకొని కనిపించింది సీత.

ఆ చుక్కలు పెడుతున్న చక్కని చుక్క తన మరదలు సీతేనా అని ఆశ్చర్యపోయాడు రామం.

అంతకు ముందు సీతని రకరకాల భంగిమల్లో చూశాడు కానీ – ఇలా చుక్కలు పెట్టడం పూర్తి చేసి, గీతలు ఎక్కడ నుండి ప్రారంభిద్దామా అని ఆలోచించుకుంటూ నిల్చున్న భంగిమలో చూడలేదు రామం.

ఆ భంగిమలో అద్భుతంగా కనిపించింది సీత.

సీత సన్నగా, పొడుగ్గా, అందంగా ఉంటుంది. సీత కళ్ళూ, చెవులూ, ముక్కూ మూతీ, మొహం అన్నీ అందంగానే ఉంటాయి. అన్నిటికన్నా అందంగా ఉండేది సీత జడ. నల్లగా, పొడుగ్గా ఉండే సీత కురుల్ని – పాపుగంట అల్లితే సీత జడవుతుంది.

సీత ఎక్కడ ముగ్గు వేయ్యాలో నిర్ణయించుకుని, ఆ మూలకి నడిచి, సన్నని నాజూకు వేళ్ళ మధ్య ముగ్గు నుంచుకుని గీతలు వెయ్యడానికి వంగింది. సీత వెన్నెముక సీత చెప్పినట్లు విని, విల్లులా వంగింది కానీ, సీత జడ అలా వంగలేక పక్కకి జారింది. జడని సద్దుకుని, ముగ్గు వెయ్యడం మొదలు పెట్టింది సీత.

సన్నటి పొడుగాటి వేళ్ళ మధ్య నుండి జాలువారుతున్న ముగ్గు వంకరులు పోతూ, వంకీలు తిరుగుతూ అందమైన రంగవల్లిగా మారిపోతున్న దృశ్యం రామాన్ని తన్మయుణ్ణి చేసింది. తనకి తెలియకుండా వీధిలోకి నడిచాడు. ఇంటి గుమ్మం దగ్గర సీతని చూస్తూ అలా నిల్చుండి పోయాడు.

రామం రావడం, నిలబడడం, తన్ని చూస్తూనే ఉండడం చూసింది సీత. అయినా చూడనట్లు ముగ్గు వేస్తూనే ఉంది. రామం చూస్తూనే ఉన్నాడు. ముగ్గు పూర్తయ్యేసరికి నెమ్మదిగా తెల్లారడం మొదలయింది.

ఆ కాంతిలో భగవంతుడు సృష్టించిన సీతా, సీత సృష్టించిన ముగ్గూ అద్భుతంగా కనిపించాయి రామానికి.

ముగ్గు పూర్తి చేసుకొని, దానికి కొంచెం దూరంగా నిల్చుని, అది ఎలాగుందా అని చూసుకుంటోంది సీత.

"చాలా బావుంది" అన్నాడు రామం.

"నువ్వెప్పుడు లేచి వచ్చావు?" అని అడిగింది సీత – అప్పుడే రామాన్ని చూస్తున్నట్లు.

"నువ్వు చుక్కలు పూర్తి చేసి, గీతలు మొదలెట్టాక" అన్నాడు రామం.

"బావుందా?" అని అడిగింది సీత.

"ఇందాక అన్నానుగా, చాలా బావుంది" అన్నాడు రామం.

"బావుంటే..." అని ఆపేసింది సీత.

"ఆ – బావుంటే" అని అడిగాడు రామం.

"ఏం లేదు. బావుంటే బావున్నట్లే" అంది సీత. అంటూ లోపలికి నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

రామం ముగ్గుని చూస్తూ, ముగ్గు పెడుతున్న సీతని ఊహించుకుంటున్నాడు.

సీత ధ్యాసలో ఉన్న రామానికి, అటు పక్కగా ఒక ఎడ్లబండి రావడం కనిపించలేదు. బండివాడు వీధికి అటుపక్కగా వెళ్దాం అని ప్రయత్నించాడు. కానీ బండి చక్రం ఒకటి ముగ్గు మీదకి వచ్చేసింది.

రామం, "ఇటు రాకు – రాకు" అంటూ గట్టిగా అరిచాడు. బండివాడు బండిని ఆపలేకపోయాడు.



E:\
Ramaneeyam\
Ramaneeyam
17



బండి కింద పడి ముగ్గు నలిగింది.

నలిగింది ముగ్గు కాదు. తన హృదయమైనట్లు బాధ పడుతూ బండివాడిని తిట్ట సాగాడు రామం.

వీధిలో ఏమవుతోందో అని కంగారు పడుతూ వచ్చిన సీతతో, "ముగ్గు చెరిగి పోయింది" అన్నాడు రామం.

సీత నవ్వింది.

ఆ నవ్వు, 'నువ్వెంత అమాయకుడివి బావా' అని సీత జాలిగా అడుగుతున్నట్లుంది.

ఆ నవ్వే, 'నా ముగ్గు కోసం నువ్వింత కలవరపడుతున్నావా' అని ఆర్తిగా అడుగు తున్నట్లుంది.

ఇలా రకరకాల భావాలను నవ్వు ద్వారా చెప్పచ్చునన్న సంగతి రామానికి తెలియదు. తెలియడానికి, అలా తెలియజెప్పగల విద్య ఇంకెవ్వరికీ తెలియదు. ఆ విద్య తెలిసింది సీత ఒక్కర్తే! అందుకే సీత నవ్వు అంత మనోహరంగా ఉంటుంది. అందుకే అది రామానికి ఎంతో నచ్చింది.

అలా నవ్వుతూనే అంది సీత –

"ఈ రోజు వేసిన ముగ్గు ఈ నెలంతా ఉంటుందా బావా? ఏ రోజు ముగ్గు ఆ రోజుకే. అసలు నెలంతా ఈ రోజు వేసిన ముగ్గే ఉంటే మిగతా ముప్పై రోజులూ ఏం చేస్తాం? రోజూ ఓ కొత్త ముగ్గు వెయ్యద్దూ? కొత్తదనం లేకుండా రోజూ ఒక్కలాగే ఉంటే జీవితం నిస్సారం అయిపోదూ?" అని అంది.

తను వేసిన ముగ్గు గురించి చెప్తున్నట్లు సీత ఓ చక్కని జీవిత రహస్యాన్ని చెప్పింది రామానికి.

మర్నాటి నుండి సీత ముగ్గుపెట్టే వేళకి ముందే లేచి కూర్చునేవాడు రామం. సీతకి ఓ చెయ్యి ముగ్గు చిప్ప పట్టుకునేందుకు, మరో చెయ్యి జడ సవరించుకునేందుకు అవసరమవుతాయి. ముగ్గు వేసేందుకు కష్టమవుతోందని గ్రహించి ముగ్గు చిప్ప పట్టుకున్నాడు రామం. అందులోంచి సీత సుతారంగా ముగ్గు తీసుకుంటూ రామాన్ని చూసి నవ్వేది. ఆ నవ్వులో రవ్వలనీ, అర్థాలనీ చూసుకునేవాడు రామం.

"నీ చేతిలో ఉన్న కొబ్బరి చిప్పలోంచి ముగ్గు తీసుకోవడం కష్టంగా ఉంది బావా" అంది సీత ఓ రోజు.

"నీకున్నవి రెండు చేతులు, చెయ్యాల్సినవి మూడు పనులు – ముగ్గు చిప్ప పట్టుకోవడం, జడనెత్తి పట్టుకోవడం, ముగ్గు వెయ్యడం. మొదటిది నే చేస్తే నీకు కుదరడం లేదు. మూడోది నాకు రాదు. రెండో పని చెయ్యనా" అని అడిగాడు

రామం.

"ఎవరన్నాచూస్తే" అంది సీత.

"ఎవరన్నా చూస్తే ఏం?" అంటూ సీత జడ పట్టుకు నిల్చున్నాడు రామం.

సీత వంగి ముగ్గు పెట్టడం మొదలెట్టింది.

ముగ్గు పెట్టడం ఓ చోట నిల్చుని, ఓ భంగిమతో చేసే పని కాదు. ముగ్గు పెడు తున్న సీత ఎటు కదులుతుందో చూసుకుంటూ సీతతోనే సీత జడని మోసుకుంటూ తిరిగాడు రామం. అలా తిరగడంలో రామానికి, అలా మోయించుకోవడంలో సీతకీ ఆనందం ఉంది.

"ఎవరన్నా చూస్తే ఏం" అన్నాడు కానీ రామం, ఎవరూ చూడకపోతే బాగుండునను కున్నాడు.

"ఎవరన్నా చూస్తే" అని సీత అంది కానీ, ఎవరైనా చూస్తే బాగుండుననుకుంది.

"ఎన్ని వేల సంవత్సరాల నుండో ఈ భూమి మీద ఎన్నో జంటలని చూశాం, కానీ, ఇలాంటి జంటను చూళ్ళేదు" అని నింగిలోని చుక్కలు అనుకున్నాయో లేదో కానీ, చుట్టుపక్కల ఇళ్ళలో అమ్మలక్కలు మాత్రం, "మేమెప్పుడూ చూళ్ళేదమ్మా ఇలాటి చోద్యం" అని ఒకరితో ఒకరు చెప్పుకున్నారు – కొందరు ఆనందంతో, కొందరు అసూయతో.

"రేపేం ముగ్గు పెడతావు?" అని ఏనాడన్నా రామం అడిగినే, "రేపు చూస్తావుగా" అనేది సీత.

"చెప్పవూ" అని రామం బతిమాలితే, "చెప్పనూ" అని దీర్ఘం తీసేది సీత.

ఆ నెల రోజులూ వాళ్ళిద్దరూ ముగ్గుల సంబరంలో గడిపేశారు.

సంక్రాంతి రోజు వచ్చింది. ఆ రోజు ఉదయం ముగ్గు వేశాక, –

"బావుందా" అనడిగింది సీత.

"బావుంటే…" అన్నాడు రామం, మొదటి రోజు సీత అన్నట్లే.

సీత రామం పక్కకి వచ్చి, నిల్చుని తల వంచుకుని రామానికి మాత్రం వినిపించే టట్లు, "పెళ్లాడవచ్చు" అని లోపలికి తొందరగా వెళ్ళిపోసాగింది.

"బావుంటే పెళ్ళాడడమేమిటి?" అని వెళ్ళిపోతున్న సీతకి వినిపించేలా రామం అరుస్తోంటే –

వెళ్తున్నదల్లా ఒక్కసారిగా ఆగి, వెనక్కి పరుగెత్తుకొచ్చి రామం నోటిని తన వేళ్ళతో మూసి –

"ఆ మాటలనే అరవకుండా మనసులోనే అనుకుంటూ ఆలోచించు. అర్థమవు



E:\
Ramaneeyam\
Ramaneeyam
18



తుంది" అని గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది సీత.

ముగ్గు బావుంటే పెళ్ళాడడమేంటా అని ఆలోచిస్తూ కూర్చున్న రామాన్ని పండగ పూట ఆలస్యం చెయ్యకుండా తలంటుకొమ్మని పంపాడు మేనమామ.

బావుంటే అన్నమాట – బావ, ఉంటే అన్న రెండు మాటలు కలిపితే వస్తుందన్న విషయం – తలంటుకుంటున్న రామం తలలో చటుక్కున మెరిసింది.

స్నానం అయిన వెంటనే సీతని కలిసి, "బావుంటే పెళ్ళాడెయ్యడమేనా" అని అడిగాడు, తనకి సీత చెప్పిన విషయం అర్థమైందన్న విషయాన్ని తెలియపరుస్తూ.

"ఉత్త బావుంటే కాదు – బావుంటే – బావుంటే – " అంది సీత.

"అంటే" అన్నాడు రామం అమాయకంగా.

"బావ ఉంటే, ఆ బావ – బావుంటే" అంది సీత.

"నీకు బావున్నాడా?" అన్నాడు రామం.

"బావున్నాడు – బావున్నాడు" అంటూ కళ్ళు మూసుకుంది సీత.

"సీతా " అన్నాడు రామం. ఆ అనడంలో 'నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను – నిన్నే పెళ్ళి చేసుకుంటాను' అన్న ధ్వనిని రామం వినిపించగలిగాడు.

కళ్ళు మూసుకుని ఉన్న సీత ఆ ధ్వనిని వినగలిగింది.

❀ ❀ ❀

గత స్మృతులలోకి చూసుకుంటూ రామం చెప్తున్నాడు. అవే గత స్మృతులలోకి చూసుకుంటూ వింది సీత. విని –

"ఈ మూడంతస్తుల మేడలో, పై అంతస్తులో, మూలనున్న ఓ ఫ్లాట్‌లో ఉన్నాం మనం. మనకి ముగ్గులేంటీ" అంది.

"నువ్వు ముగ్గులెయ్యాలి, నేను చూడాలి" అన్నాడు రామం.

"నాకూ వేసుకోవాలనే ఉంది. అయితే ఎలా? ఈ మేడల అరణ్యంలో నేల ఏదీ? నేల లేక ముగ్గులెలా? పోనీ ఇంట్లో వేద్దామంటే ఇల్లంతా మొజాయిక్ నేలాయె" అంది నిట్టూరుస్తూ సీత.

తెల్లారింది. సీత మామూలుగా పనులు చెయ్యడం మొదలెట్టింది. కానీ రామం మాత్రం దిగులుగానే ఉన్నాడు. సీత ముగ్గు వేయడం లేదన్న బాధ రామాన్ని వీడడం లేదు.

రోజులు గడుస్తున్న కొద్దీ రామంలో అసంతృప్తి పెరుగుతోంది. అతనికి జీవితం నిస్తేజంగా అనిపించసాగింది. పండగ దగ్గరపడుతోందన్న ధ్యాసే లేదు రామానికి. పండక్కి కొత్త బట్టలు కొందామన్న ఆలోచనే కలగలేదు. రామం మానసిక స్థితి

చూసి ఆ విషయం గుర్తు చెయ్యలేదు సీత.

భోగి పండగ వచ్చి వెళ్ళింది.

సంక్రాంతి రోజు ఉదయమే లేచాడు రామం.

పక్కన సీత కనిపించలేదు.

తనకన్న ముందే ఎందుకు లేచిందా అనుకుంటూ లేచి హాల్లోకి నడిచాడు.

హాలుకు మధ్యగా నేల మీద కూర్చునుంది సీత. అప్పటికే తలంటుకొని, తన పొడుగాటి నల్లటి కురులను ఫేనుగాలిలో ఆరబెట్టుకుంటోంది.

రామానికి సీతా, సీత జుట్టూ ఎప్పటిలా అందంగా కనిపించాయి. వాటితో పాటే సీత కట్టుకున్న చీర కూడా అందంగా కనిపించింది.

పెళ్ళికి ముందెప్పుడో సీత ముచ్చట పడి కొనుక్కున్న ముదురు నీలం రంగు చీర. ఏ డిజైనూ లేని చీర తనకు నచ్చలేదని రామం ఒకసారి అంటే, అప్పటి నుండి కట్టుకోవడం మానేసిన చీర.

ఆ చీర నిండా ఇప్పుడు తెల్లరంగుతో ముగ్గు డిజైనుంది.

రామం దగ్గర కెళ్ళి చూశాడు.

సీత కళ్ళెత్తి రామాన్ని చూసి నవ్వింది హాయిగా.

"సీతా" అన్నాడు రామం ఆనందంతో.

"బావుందా" అని అడిగింది సీత.

"అద్భుతం" అన్నాడు రామం.

"నాకు పెయింటింగ్ రాదు. నేర్చుకున్నాను. ఈ నెల రోజులూ ఇదే పని? చీర నీ కెలాగూ నచ్చలేదుగా. అందుకే దీని మీద నాకు నచ్చిన ముగ్గు డిజైన్ ఫ్యాబ్రిక్ పెయింట్‌తో వేశాను" అంది చీరని చూపిస్తూ సీత.

"నా కోసం – నువ్వు..." అంటూ ఆగాడు రామం.

"మీ కోసం – అంటే – నా కోసమేగా" అంది సీత.

"సీతా" అన్నాడు రామం, సీత పక్కనే కూర్చుంటూ.

సీత నేల మీదకి వాలింది.

తెల్ల రంగు ముగ్గులున్న నీలం రంగు చీర కొంగు నేల మీద పరుచుకుంది.

సీత చీరని ఆనందంగా చూస్తున్నాడు రామం.

రామం మొహాన్ని ఆనందంగా చూస్తోంది సీత.

వాళ్ళిద్దరికీ తెలియకుండా, వాళ్ళని ఆనందంగా చూస్తోంది సీత కడుపు లోపల్నుంచి – ఓ......



E:\
Ramaneeyam\
Ramaneeyam
19



'రచన' – జులై, 1995

# ఓ దశాబ్దం

"ఎంత బావుందో" అన్నాడు రామం. నీలంరంగు సముద్రం లోంచి ఎర్ర రంగు సూర్యుడు నెమ్మదిగా పైకి రావడాన్ని చూస్తూ.

"ఏమిటి?" అంది సీత ఆ దృశ్యాన్నే చూస్తూ.

"మనం ఇలా రావడం" అన్నాడు రామం.

"బావుండక ఏం చేస్తుంది? మొత్తం నాలుగు వేలవుతోందా ఖర్చు?" అంది సీత.

"సీతా! ఈ రోజు కూడా డబ్బు గురించేనా? ఒక్కరోజు ఈ ఒక్కరోజు కాస్తంత

రొమాంటిక్‌గా వుండలేవూ?"

"ఈ ఒక్కరోజేం – పదేళ్ళుగా ప్రతి రోజూ రొమాంటిక్‌గా ఉండాలనే అనుకుంటున్నాం – కుదిరితే కదా?"

"కుదరకపోవడానికి ఏమయింది?"

"అయిపోయిన విషయాల గురించి ఇప్పుడు మాట్లాడుకోవడం ఎందుకు?"

"ఇప్పుడు కాక ఇంకెప్పుడు మాట్లాడుకుంటాం? ఇలా మన పదేళ్ళ వివాహ జీవితాన్ని నెమ్మదిగా నెమరువేసుకుందుకే కదా – మనం ఇంత ఖర్చు పెట్టి ఇలా వచ్చాం"

"ఏం ఖర్చు గురించి మాట్లాడుతున్నారేం? కాస్త – కాస్తంటే కాస్త రొమాంటిక్‌గా మాట్లాడలేరూ?"

"అదొదిలెయ్యి, రొమాంటిక్‌గా ఉండాలని గత పదేళ్ళుగా అనుకుంటూ అలా ఉండలేకపోవడానికి కారణం ఏంటి?"



"మీరు రొమాంటిక్‌గా ఉండలేకపోవడానికి కారణం ఏంటి?"

"నేనా, నేను రొమాంటిక్‌గానే ఉంటున్నా"

అంతే – ఇద్దరి మధ్యా నిశ్శబ్దం అలుముకుంది.

అది వాళ్ళిద్దరికీ పదేళ్ళుగా అలవాటే!

పదేళ్ళ క్రితం సరిగ్గా ఈ రోజే సీతకీ, రామానికీ పెళ్ళయింది.

వాళ్ళిప్పుడు చూస్తున్న సూర్యుడి వయస్సుతోనో, సముద్రం వయస్సుతోనో పోల్చి చూస్తే, పదేళ్ళ కాలం చాలా తక్కువ సమయమే అయినా, మనిషి జీవితంలో పదేళ్ళంటే ఎక్కువే!

పెళ్ళయిన ఈ పదేళ్ళుగా – వాళ్ళు ఎక్కువసేపు మాట్లాడు కోవడం – ఎప్పుడన్నా ఒకసారి కొంతసేపు మాట్లాడుకోకపోవడం – మళ్ళీ మాట్లాడుకోవడం – చేస్తూనే ఉన్నారు.



E:\
Ramaneeyam\
Ramaneeyam
20



పెళ్ళి రోజు – అదీ ఓ దశాబ్ద వివాహ జీవితానికి తర్వాత వచ్చిన పెళ్ళిరోజు చాలా ఆనందంగా గడుపుదామనుకున్నారు. అయితే, ఆనందంగా గడపడమంటే ఏమిటన్న విషయం మీద ఇద్దరికీ అభిప్రాయ భేదం వచ్చింది.

"మా అమ్మా నాన్నల దగ్గరికి వెళ్దాం" అంది సీత.

"పెళ్ళయి పదేళ్ళయింది. ఆనందమైనా, దుఃఖమైనా మొగుడన్నవాడితో పంచుకోవాలనుండదు నీకు. ఏమన్నా అంటే చాలు, మా అమ్మానాన్నల దగ్గర కెళ్దాం అంటావు. నేనక్కడకు రాను. ఇద్దరం ఆఫీసులకి సెలవు పెట్టేద్దాం, మార్నింగ్ షోకి వెళ్దాం, ఆ తర్వాత ఏదన్నా హోటల్లో లంచ్, సాయంత్రం పార్కులో కొంతసేపు



కూర్చున్నాక ఫస్టు షో సినిమా, రాత్రి మళ్లీ హోటల్లో డిన్నర్. ఎలాగుంది ఆలోచన?"

"పెళ్ళి రోజున  కూడా ఈ ఊరేనా? ఆ రోజు నేను ఈ ఊళ్ళో ఉండను కాక ఉండను"

"ఆ రోజు మీ అమ్మా నాన్నల ఊరికి నేను రాను కాక రాను"

అని అనుకున్న వాళ్ళిద్దరూ అటు సీత మాటా, ఇటు రామం మాట కాకుండా పెళ్ళిరోజుకి ముందు రోజు విశాఖపట్నం వచ్చారు. సముద్రం ఒడ్డునున్న హోటల్ రూంలో దిగారు.

రాత్రి పడుక్కుని లేచి, హోటల్ గది బాల్కనీలో కూర్చుని సముద్రాన్ని చూస్తూ మాట్లాడుకోవడం మొదలెట్టి, మధ్యలో నిశ్శబ్దంగా కూర్చుండి పోయారు.

కొంచెసేపు అలా నిశ్శబ్దంగా ఉన్నాక కొంచెం బాధ ధ్వనిస్తున్న కంఠంతో  రామం–

"నేను మెటీయరిలిస్ట్‌ని కాదు సీతా. కుటుంబం కోసం డబ్బు సంపాదించక తప్పదు కదా – అందుకే ఆఫీసు కెళ్ళడం. అదే పది తరాలకు సరిపడా ఆస్తి ఉందనుకుందాం మనకు – నేను ఈ ఆఫీసు రొటీన్ చక్రంలో ఇరుక్కునే వాడినా? ఇలా సూర్యోదయాన్ని చూస్తూనో, కృష్ణశాస్త్రి కవిత్వం చదువుతూనో, ఘంటసాల పాటలు వింటూనో కాలం గడిపేవాడిని కాదూ – నీ ఒళ్ళో తల పెట్టుకుని పడుక్కుని" అన్నాడు.

కొంతసేపు నిశ్శబ్దం తరువాత ఎవరో ఒకరు మళ్ళీ మాటలు మొదలెట్టడం, వెంటనే  రెండవ వాళ్ళు మాట్లాడడం వాళ్ళకి కొత్త కాదు. ఇన్నేళ్ళ ఈ ఆనవాయితీకి అడ్డం రాకుండా సీత –

"నాకు మాత్రం పుస్తకాలు చదవడం ఇష్టం లేకనా. పదేళ్ళ క్రితం వరకు నేను ముళ్ళమూడి వారి పుస్తకాల్లోనో, మంగళంపల్లి వారి సంగీతంలోనో మునిగి ఉండేదాన్ని"

రామం నవ్వి, "నీ ఇష్టాల్లోనే ఏదో లోపం ఉంది సీతా! హాస్యం రాసుకునే ముళ్ళపూడి వెంకట రమణా, గంభీరంగా శాస్త్రీయ సంగీతం పాడే మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఇద్దరినీ సమానంగా మెచ్చుకునే నిన్నే మనగలను" అన్నాడు జాలిగా.

సీత కోపగించుకుంది. సీత కోపగించుకున్నట్లు తెలియడం కష్టం. సీత కళ్ళూ, పెదవులూ ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాయి. సీత ముక్కు – అందంగా, పొడవుగా, పైకి లేచినట్లున్న ముక్కు – కొంచెం ఎర్రబడినట్లు కనిపిస్తే సీతకి కోపం వచ్చినట్లు. సీత బుగ్గలు కెంపుల్లా, పెదవులు పగడాల్లా ఎల్లవేళలా ఎర్రగానే ఉంటాయి. మామూలుగా, తెల్లగా నునుపుదేరి ఉన్న ముక్కే, కోపం వచ్చినప్పుడు మాత్రం కొంచెం



E:\
Ramaneeyam\
Ramaneeyam
21



ఎర్రగా అవుతుంది. ఇది రామానికి తెలుసు.

ఆ కోపంలోనే సీత –

"మీరు నా తెలివితేటల్నీ, నా ఇష్టాన్నీ విమర్శిస్తే నాకేం గానీ, ముళ్ళపూడి వారిని హాస్యం రాసుకునే రచయిత అనడం – నాకేమాత్రం నచ్చలేదు. ఆయన రచనల్లో పైకి కనిపించేది హాస్యమే కానీ, ఆ హాస్యం వెనుక బోల్డు సైకాలజీ, దానికింకా వెనుక ఫిలాసఫీ దాక్కుంటాయి. పుస్తకాలు చదవడమంటే పేజీలు తిరగేసే వాళ్ళకి ఏం అర్థమవుతాయి లెండి ఆయన రచనలు" అంది.

"ఈ రోజు నీతో రచనల గురించీ, రచయితల గురించీ సుదీర్ఘమైన చర్చ చేసేందుకు సమయం లేదు. మనం ఇక్కడి కొచ్చింది మన పదేళ్ళ జీవితం గురించి మాట్లాడుకుందికి. నీకు గుర్తుందో లేదో – పెళ్ళయి వారం రోజులు కూడా కాలేదు – కొత్త దంపతులం మనం – అప్పుడు మనం మద్రాసులో ఉండేవాళ్ళం. ఓ సాయంత్రం ఇలానే బీచ్‌కి వెళ్ళి కూర్చున్నాం. ఆ రోజు పున్నమి. చంద్రోదయం అద్భుతంగా ఉంది.  దాన్ని నేను చూస్తోంటే...." అంటూ ఆగి, సీతని జాలిగా చూసి మళ్ళీ రామం –

"నువ్వు దూరంగా మల్లెపూలు అమ్ముతున్న వాడినే చూస్తూ కూర్చున్నావు" అన్నాడు.

"అయిందా, మీకంత వరకే గుర్తుంది. ఆ మల్లెపువ్వుల వాడు మన దగ్గరకు వచ్చాడు. పెళ్ళయిన కొత్తలో నేను నా దగ్గర బేగ్ ఉంచుకునేదాన్ని కాదు. నా దగ్గర డబ్బు లేదు. మీరు పువ్వులు కొంటారేమోనని చూశాను. వాడిని అరవంలో నాకు రాని భాషలో తిట్టి, తరిమేశారు. పక్కనున్న భార్యకి మల్లెపువ్వులు పెట్టుకోవాలనే ఆశ ఉంటుందని తెలియదు. పోనీ అడిగి తెలుసుకోవాలనైనా అనిపించలేదు"

"నేను చంద్రోదయం వేళ సముద్ర అలలపై ఉన్న వెండి వెన్నెలని చూడ్డంలో నిమగ్నమైపోయి ఉన్నాను. ఆ మల్లెపూల వాడితో బేరమాడ్డం అపుడు నా మనసుకు నచ్చినపని కాదు"

"అసలు బేరమాడాల్సిన అవసరమేముంది? ఓ మూర ఇమ్మని డబ్బులివ్వడమే. ఉహూఁ! అలా చెయ్యలేదు మీరు. వినీల గగనంలో పున్నమి చందమామే కాదు, వినీల కుంతలాల్లో తెల్లని మల్లెలు కూడా అందంగా ఉంటాయి అనే విషయం మీకు ఆ నాడే కాదు ఈనాటిక్కూడా తెలియదు. పదేళ్ళలో ఒక్కసారి కూడా కొనలేదు మీరు మల్లెపూలు"

"నువ్వు కొనుక్కుంటున్నావుగా – రోజుకి ఒకటేం, నాలుగు మూరలు"

"అప్పట్నుండీ, నేను నా దగ్గర డబ్బులుంచుకుంటూనే ఉన్నాను"

"డబ్బు సంపాదిస్తున్నావుగా, ఉంచుకుందుకేం"

"మీ కళ్ళెప్పుడూ, నా సంపాదన మీదే" అంది సీత రామం వైపు చూడకుండా.

"నా వైపు చూసి, నా కళ్ళల్లోకి చూస్తూ – ఆ మాట చెప్పు. నేను నిన్ను సంపాదించి పెట్టమన్నానా? నా సంపాదన మనకి సరిపోతుంది అనలేదూ! నువ్వే, నేనేం చదువుకోని దాన్నా, ఇంట్లో కూర్చుని అరటికాయ ముచికతో నేల మీద తప్పుడు లెక్కలు రాస్తూ కూర్చోడానికి, అంటూ ఉద్యోగంలో చేరావు. నీ డబ్బు నేనొక్క పైసా, ఒక్క పైసా తీసుకున్నానా, నిజం చెప్పు."

"తీసుకోలేదు. అయితే నేను వాడుకుంటున్నానా నా సంపాదన. అందులో ఒక్కపైసా నేను ఖర్చు చెయ్యడం లేదు"

"ఏం నేనేంచేసుకోవద్దనలేదే"

"మీరు చేసుకోమని కూడా అనలేదే"

"నువ్వు ఉద్యోగం చేస్తున్నది, సంపాదిస్తున్నది నీకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండడం కోసం – మరి నేను చేసుకోమని చెప్పేదాకా ఖర్చు చేసుకోకపోతే అదేం స్వతంత్రం?"

"ఎప్పుడన్నా ఒక్కసారి – ఒక్కసారి – సీతా నీ జీతమంతా బ్యాంక్‌లోనే ఉంది. అందులోంచి ఓ పది వేలు తీసుకుని నెక్లెస్ కొనుక్కో అంటారేమోనని చూశాను. ఉహూ" అంది సీత.

అలా అంటున్న సీత కంఠంలో బాధ లేదు.

సీత కంఠంలో నెక్లెసూ లేదు.

"నీ డబ్బుతో, నువ్వు సంపాదిస్తున్న డబ్బుతో నేను నిన్ను కొనుక్కోమనాలా? అసలవేం మాటలు సీతా – నువ్వు కొనుక్కోలేవూ?"

"నేనలా తీసుకుని కొనుక్కోలేను"

"నీకు నువ్వు కొనుక్కోలేవు. అంతేకాదు. మనకి కావాల్సింది కూడా కొనలేవు. ఓసారి గుర్తుందా, వి.సి.ఆర్. కొందామనుకున్నాను. అయితే ఓ నాలుగు వేలు తక్కువయ్యాయి. బాంక్‌లో నా డబ్బుంది కదా, తీసుకుని కొందాం అన్నావూ? అన్లేదు"

"అది నా డబ్బని నేననుకోలేదు. ఇప్పుడూ అనుకోవడంలేదు. ఆర్థిక వ్యవహారాలు చూడాల్సిందీ, చూసుకునేదీ మీరే. అందుకే నేనేం చెప్పలేదు. అసలు చెప్పాలన్న ఆలోచనే కలగలేదు" అంది అమాయకంగా చూస్తూ సీత.

పెళ్ళయి పదేళ్ళయినా – ఏమాత్రం తగ్గని అమాయకత్వం సీత మొహంలో అద్భుతంగా కనిపించింది.

ఆడవాళ్ళ మొహాల్లో అమాయకత్వం అద్భుతంగా కనిపిస్తుంది.



E:\ Ramaneeyam\ Ramaneeyam 22



మగాళ్ళని మగాళ్లుగా గుర్తించే వరకూ ఆడపిల్లల్లో అమాయకత్వం ఉండడం సహజమే! అందుకే పదహారేళ్ళ వయసులో అమ్మాయిలు అందరూ అందంగానే ఉన్నట్లుంటారు.

అయితే సీతలో ఆ అమాయకత్వం పాలు తగ్గనే లేదు. అందుకే అందంగా ఉండే సీత అమాయకత్వపు 'మేలిముసుగు'తో ఇంకా అందంగా సాలార్‌జంగ్ మ్యూజియంలోని 'వీల్డ్' రెబెకాలా ఉంది.

"ఎంత బావున్నావు సీతా" అన్నాడు రామం.

"ఎంత?" అంది సీత.

"నీ జడంత"

"అంతేనా" అంది నిరుత్సాహపడినట్టుగా సీత.

"అంతకన్న పొడవైంది, అందమైంది ఇంకోటి ఏముంది?" అన్నాడు రామం.

నవ్వింది సీత.

నవ్వేశాడు రామం.

"నా వల్లే కదూ మీకు కష్టాలు. నన్ను పెళ్ళి చేసుకోకపోయి ఉంటే మీరు పాటలు వింటూ, కవిత్వం చదువుకుంటూ హాయిగా కాలం గడిపేసేవారు కదూ?" అంది సీత, ఇందాక రామం అన్న మాటల్ని మర్చిపోలేనట్లు.

"నీ కోసం ఆ మాత్రం త్యాగం చెయ్యలేనా" అన్నాడు రామం.

"నా కోసం మీరేం త్యాగం చెయ్యక్కర్లేదు. మీకు కావలసినట్లు మీరుండండి. అప్పుడెప్పుడో పదేళ్ళ క్రితం – తెలియక చేసిన తప్పుకి, నన్ను భరిం చక తప్పదు అనుకోకండి. నేను మిమ్మల్ని విసిగించను. మీ జోలికి రాను. మీకు కావల్సినట్లు మీరుండండి" అంది సీత.

వెంటనే రామం – "నేనూ నీ జోలికి రాను. అసలు నీతో అనవసరంగా మాట్లాడను. నువ్వూ నీ కిష్టమైన పనులుచేసుకో. నీకెంతో కోరికగా ఉంది కదా – ఎమ్మే ప్రైవేటుగా కట్టి చదువుకో" అన్నాడు.

"అదే మీకు కావాల్సింది – నాతో ఏదో తప్పనిసరి కాపురం చేస్తున్నట్లుంటారు మీరు. నాతో మాట్లాడకపోతే నేనేం అనుకుంటానో అని మాట్లాడుతారు – కానీ మీ కిష్టమై కాదు" అంటున్న సీత మాటలకి అడ్డొస్తూ –

"అదేం కాదు సీతా!" అని రామం అంటున్నా వినకుండా సీత –

"నేనేం ఈ రోజు ఎమ్మే చదవను. పెళ్ళయిన కొత్తలో, ఏ పనీ లేకుండా ఇంట్లో కూర్చున్న రోజుల్లో యూనివర్సిటీకి వెళ్ళి చదువుకుంటానంటే – ఆ చదువు ఎందుకు

సీతా – మన ఇద్దరం కలిసి నేర్చుకోవలసిన జీవిత పాఠాలు ఎన్నో ఉన్నాయంటూ ఆపించేశారు. ఈ రోజు నాకు ఊపిరి పీల్చుకునేందుకు కూడా సమయం లేదు. ఎమ్మే చదవనా?"

"ఏమంత ఊపిరి పీల్చుకోలేనంత పనులు నీకు? అన్నిటిలోనూ నీకు నేను సాయం చెయ్యడం లేదూ? నువ్వు ఎమ్మే చదవలేకపోయానని అంటావే కానీ – మొదలెట్టిన ఎంబీయే పెళ్ళనగానే నేను మానేశాను కదా! అది నువ్వు గుర్తించావా?"

"నేనేం మానెయ్యమనలేదు. మీరే మానేశారు"

"ఎందుకు మానేశాను – సాయంత్రాలు క్లాసులకి వెళ్తాను అని నేననేసరికి, నీ మొహంలో ప్రపంచంలోని బాధంతా కనిపించేసేది. ఇంక నేనెలా వెళ్ళగలను?"

"మిమ్మల్ని వెళ్ళమని నేననలేదూ?"

"అన్నావు. వెళ్ళమని నోటితో అన్నావు – అయితే నీ కళ్ళున్నాయే – కళ్ళు – అవి దీనంగా 'వెళ్ళద్దు' అనేవి"

"నా కళ్ళేమనేవో నాకేం తెలుసు. పోనీ ఇప్పుడు చెయ్యండి. – ఎంబిఏ. మీరు నా కోసం చదువు మానుకోవడం ఎందుకు? ఈ సంవత్సరమే చేరండి. నన్ను పెళ్ళి చేసుకుని మీరు మీ చదువు మానుకోవడం నా కిష్టం లేదు" అంది సీత కంఠంలో బాధనీ, కళ్ళలో తడినీ కనపరుస్తూ.

"ఛ ఛ నీ వల్లకాదు నేను మానేసింది. నిన్ను వదిలి వెళ్లడం నాకూ ఇష్టం లేదు. అప్పుడు కాదు, ఇప్పుడూ కూడా"

"నేను ఎమ్మే మానేసింది కూడా అందుకనే. ఎమ్మే అంటే రాత్రిళ్ళు చదువుతూ కూర్చోవాలి" అంది సీత తల కొంచెం వంచుకుని, కళ్ళని వాల్చేస్తూ.

మూసిన సీత కళ్ళనే చూస్తూ రామం, "ఇంతవరకు విరిసిన పువ్వుల్లా ఉన్న నీ కళ్ళు నువ్వలా ముయ్యగానే మొగ్గల్లా కనిపిస్తున్నాయి. పువ్వుకి పువ్వూ, మొగ్గకి మొగ్గా అందంగా ఉంటాయి. అలానే నీ కళ్ళూనూ. కళ్ళు మూస్తే మొగ్గలు, తెరిస్తే పువ్వులూను" అన్నాడు.

సీత ఒక కన్ను మూసి ఉంచి, ఓ కన్ను తెరిచి ఉంచి రామాన్ని చూసి నవ్వింది.

"ఎంత తెలివైనదానవు సీతా" అన్నాడు రామం.

"ఎంత?" అంది సీత.

"నీ అందమంత?"

"అదెంత?"

"నీ..." అని మొదలెట్టాడు రామం.



E:\ Ramaneeyam\ Ramaneeyam 23



"–జడంత" అని పూర్తి చేసింది సీత.

"ఏమయితేనేం, పెళ్ళి మూలంగా నువ్వు చెయ్యాలనుకున్న ఎమ్మే పూర్తి చెయ్యలేకపోయావు. అది పూర్తయి ఉంటే ఏ కాలేజీ లెక్చరర్వో అయ్యుండేదానవు – ఈ కంపెనీలో స్టెనోగా కాకుండా"

"నా ఉద్యోగం నాకేం చిన్నతనంగా లేదు. మీకే మీ ఆవిడ స్టెనో అని చెప్పుకోవడానికి కష్టంగా ఉందేమో"

"అహఁ, నా ఉద్దేశ్యం అది కాదు – ఏవో చేద్దామనుకుని పెళ్ళి కారణంగా చెయ్యలేకపోయావే అని"

"ఎన్నో అనుకుంటాం, అన్నీ సాధించగలుగుతామా?"

"అవును ఎన్నో అనుకుంటాం. అన్నీ సాధించలేం"

"నేనే కాదు, పెళ్ళయ్యాక ఆడవాళ్ళందరూ అంతే, ఏమీ చెయ్యలేరు"

"నువ్వు నీ ఫెమినిస్టు కళ్ళద్దాలు తీసెయ్యి. పెళ్ళయ్యాక ఆడాళ్ళూ, మగాళ్ళూ ఇద్దరూ ఏమీ చెయ్యలేరు" అన్న రామం మాటలకి –

"కాపురం తప్ప" అని చేర్చింది సీత.

"పదేళ్ళలో ఏం సాధించాం?" అన్నాడు రామం ఎక్కడో ఆలోచిస్తున్నట్లుగా.

"ఒకరి నొకరం సాధించుకున్నాం" అంది సీత.

"అది పెళ్ళికి ముందు – పెళ్ళి చేసుకున్నాక?" అన్నాడు రామం.

"నేననేది పెళ్ళి చేసుకున్నాకే" అంది సీత.

అర్థం కానట్లు చూశాడు రామం.

"అర్థం కాకపోతే వచ్చిన నష్టమేమీ లేదు" అంది సీత.

"ఓహో నువ్వనేది మనం ఒకరినొకరం సాధించుకుంటున్నామనేగా" అన్నాడు రామం.

అవుననలేదు సీత. కాదనీ అనలేదు.

సూర్యుడు పూర్తిగా ఉదయించి, ఎండ బాల్కనీలోకి రావడం మొదలయింది.

ఇద్దరూ మాట్లాడకుండా కూర్చుని ఉన్నారు.

"ఏం సాధించాం అని ఆలోచిస్తున్నారా?" అంది సీత కొంతసేపయ్యాక.

"పదేళ్ల జీవితంలో – ఓ చిన్న ఇల్లు, ఓ బుల్లి కారూ, వాటిని సాధించేందుకు చేసిన అప్పులూ – సాధించలేదూ" అన్నాడు రామం.

"అంతేనా, ఎన్ని మర్చిపోలేని అనుభవాల్ని సాధించాం? మనం కలిసి ఉండడం మొదలెట్టిన మూడో రోజునే నాకు జ్వరం వస్తే, మీరు నా కోసం పడిన శ్రమా,

బాధా" అంది సీత.

"నాకోసారి కాలికి దెబ్బ తగిలి, నాలుగు రోజులు కదలలేకపోతే నువ్వు..." అన్నాడు రామం.

"నేను మా ఇంటికి వెళ్ళి వచ్చిన ప్రతీసారి స్టేషన్లో నన్ను దగ్గరకు తీసుకుంటున్న మీ మొహంలో ఆనందం..."

"సాయంత్రం నేనింటికి రాగానే నీ మొహంలో కనిపించే వెలుగు...."

"రాత్రిళ్ళు దూరంగా పడుక్కున్నట్లే పడుక్కుని, నిద్రలో తెలియకుండా వేసినట్లు నా మీద వేసిన చెయ్యి..."

"స్నానం చేస్తూ, నన్ను బాత్రూంలోకి పిల్చి, నా మీద కూడా నీళ్ళు పోసేసి, హాలు తలుపు తెరిచే వుందని నేనన్నప్పుడు మీరు పడ్డ హడావిడీ..."

"ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో.. ఎన్నెన్నో.." అంది సీత నిట్టూరుస్తూ.

"కొంతేదో పోయినట్టుంది... కొంతేదో వచ్చినట్లుంది" అన్నాడు రామం.

"పోయిందీ – వచ్చింది. జీవితం ఎక్కడ వేస్తే అక్కడే ఉన్నట్లుంటుంది" అంది సీత కళ్ళు మూసుకుని.

"కాదు" అన్న అరుపు వినిపించి మూసిన కళ్ళు తెరిచింది సీత.

అయితే ఆ అరుపు రామంది కాదు.

గదిలోంచి చిన్నాడి గొంతది. వాడు చిన్నాడే కానీ, వాడి గొంతు పెద్దది.

'పెద్ద పిల్లా, వాడూ లేచి ఏదో కీచులాడుకుంటున్నారు లాగుంది' – అని సీత అంటూంటే –

"చూడమ్మా, అక్క ఇది నా బ్రష్ కాదంటోంది" అంటూ వచ్చాడు చిన్నాడు సీత దగ్గరికి.

"చూడు నాన్నా వాడు నా బ్రష్ తీసుకుని వాడిదే అంటున్నాడు" అంటూ పెద్ద పిల్ల రామం దగ్గరికి వచ్చింది.

దుబ్బులా ఉన్న చిన్నాడి జుట్టుని తన సన్నని, పొడవాటి వేళ్ళతో సవరించి, "నీ బ్రష్ కలరేంటి?" అని అడిగింది సీత.

వాడు తన చేతిలోని బ్రష్ కలర్ చూసుకుని "బూ" అన్నాడు.

"ఓరి భడవా? నీ చేతిలో ఉన్న బ్రష్ కలర్ చూసుకుని, అలా చెప్తావా?" అన్నాడు రామం.

"లేదు వాడి బ్రష్ కలర్ బ్లూయే" అని రామంతో అని, "బూ కాదు నాన్నా బ్లూ" అంది చిన్నాడితో సీత.



E:\
Ramaneeyam\
Ramaneeyam
24



"నువ్వెప్పుడూ అంతే, వాణ్ణి వేనకేసుకొస్తావు" అన్నాడు రామం.

"మీరు మీ ముద్దుల కూతుర్ని వెనకేసుకు రావడం లేదూ. దాని బ్రష్షేదో కూడా దానికి తెలియదు" అని సీత ఏదో అనబోతుండగా రామం సీతని ఇంకేం మాట్లాడవద్దన్నట్లుగా గిల్లి –

"వెళ్ళండి, వెళ్ళి బ్రష్ చేసుకురండి" అన్నాడు.

పెద్ద పిల్ల నెమ్మదిగా వెళ్ళింది. వెనకే వెళ్తూ చిన్నాడు రామాన్ని చిన్నగా కొట్టి –

"అమ్మనెందుకు గిల్లుతావు?" అన్నాడు.

"చూశారా వాడు నన్నెంత జాగ్రత్తగా చూసుకుంటాడో" అని రామానికి మాత్రం వినిపించేటట్లుగా అని, "తప్పు నాన్నా, నాన్నని కొట్టకూడదు" అంది చిన్నాడితో సీత.

"వెళ్ళు. వెళ్ళి బ్రష్ చేసుకో" అని చిన్నాడితో అని పంపించేసి రామం,

"వాడికి కొట్టడం, గిల్లడం నేర్పిస్తావెందుకు?" అన్నాడు.

"నేనేం వాణ్ణి కొట్టమనలేదు. మీరు నన్ను కొట్టడం, గిల్లడం చూసి నేర్చుకున్నాడు వాడు" అంది సీత.

"నేను నిన్ను కొడతానా? గిల్లుతానా?" అన్నాడు రామం.

"ఇందాక గిల్లలేదూ" అంది సీత.

"అదా, అది గిల్లడం కాదు. వాళ్ళ ముందు మనం వాళ్ళ గురించి మాట్లాడకూడదని నీకు చెప్పాలనే అలా చేశాను" అన్నాడు రామం.

"అది వాడికి తెలుస్తుందా?" అని అడిగింది సీత

"తెలియదు"

"ఇవే కావు వాళ్ళకి ఎన్నో తెలియవు. మనం జాగ్రత్తగా నేర్పించాలి" అంది సీత.

"అవును" అన్నాడు రామం.

"వాళ్ళిద్దర్నీ చూస్తే, నాకు ఇందాక మనం పెళ్ళి చేసుకుని ఏదో పోగొట్టుకున్నాం, ఏమీ సాధించలేకపోయాం అని ఎందుకు అనుకున్నామా అనిపిస్తోంది. మనం ఏదీ పోగొట్టుకోలేదు. ఇద్దరు పిల్లల్ని పొందాం. వీళ్ళు జీవితంలో ఏదన్నా సాధిస్తే మనం సాధించినట్లే" అంది సీత.

"అవును" అంటూ రామం తన తలని సీత తల మీదకి వాల్చాడు. సీత తన తలని రామం తల మీదకి వాల్చుకుంది.

ఇద్దరి మొహాల్లోనూ తృప్తే!

ఒకే రకం తృప్తి!!

'రచన' - జనవరి, 2006

# మధురం.... మధురం...

బాల్కనీలో కూచుని పేపర్ చదువుతూ మధ్యలో ఏదో గుర్తొచ్చినట్లు, "కాఫీ" అని అరిచాడు రామం.

ఆ అరుపుకి సమాధానంగా పక్కనే గాజుల శబ్దం వినిపించడంతో – పేపర్ పక్కన పెట్టాడు.

పక్కనే కుర్చీలో కూర్చునుంది సీత.

సీత కట్టుకున్న కొత్త చీర రంగు ఎరుపు.

సన్నగా పొడుగ్గా నాజూగ్గా ఉన్న సీత వేళ్ళకి పండిన గోరింటాకూ ఎరుపే!

అంతకు కొంచెం సేపు ముందు, ఆ వేళ్ళ చివర్ల నుండి సీత తెల్లని నుదుటి మీదికి చేరిన బొట్టు కూడా ఎరుపు.

ఈ ఎరుపులన్నీ ఓ ఎరుపులా అన్నట్లు నవ్వుతున్న సీత పెదవుల ఎరుపు – ఎరువు తెచ్చుకోని ఎరుపు.

తలంటుకున్న సీతనీ, నవ్వుతున్న సీత పెదవుల్నీ చూస్తూండి పోయాడు రామం, కాఫీ సంగతి మర్చిపోయి.

సరిగ్గా అప్పుడే – "మీ ఇద్దరికీ హేపీ మేరేజ్ డే" అంటూ బాల్కనీలోకి వచ్చారు బాబూ, పాపా. ఇద్దరి చేతుల్లోనూ చెరో కాఫీ కప్పూ ఉన్నాయి.

"అరే – ఈ రోజు కాఫీ మీరు కలిపి తీసుకువచ్చారా? ఎంత ఆనందం?" అంటూ పాప చేతిలోని కాఫీ కప్పు అందుకోబోయాడు రామం.

"ఇది అమ్మది. తమ్ముడి దగ్గర ఉన్నది నీది" అంటూ తన చేతిలోని కప్పును








సీతకి అందించింది పాప.

"తేడా ఏమిటి?" అంటూ బాబు దగ్గర కప్పు తీసుకుని, ఓ గుక్క కాఫీ తాగి, గట్టిగా నవ్వేస్తూ –

"సీతా వీళ్ళకి కాఫీ కలపడం సరిగ్గా నేర్పించలేదు నువ్వు – పంచదార వెయ్యలేదు చూడు" అని అన్నాడు.

తన కప్పులోంచి ఓ గుక్క తాగిన సీత –

"లేదే నా కాఫీలో పంచదార ఉందే" అని రామంతో అని, "చాలా బాగా చేసారు కాఫీ" అని పిల్లలతో అంది.

"అమ్మ కాఫీలో పంచదార వేసి నా దాంట్లో వెయ్యడం మర్చిపోయారేంట్రా?" అన్నాడు ముచ్చటగా వాళ్ళనే చూస్తూ రామం.

"మేం వెయ్యడం మర్చిపోవడం కాదు. అమ్మే ఇన్నాళ్ళూ వెయ్యకుండా ఉండడం మర్చిపోతోంది. అందుకే ఈ రోజు అమ్మని మానెయ్యమని నీ కాఫీ మేమే చేసాం" అంది పాప.

"నేనేం మర్చిపోవడం లేదు. ప్రతిరోజూ నేను వెయ్యననే అంటున్నాను. మీ నాన్నే నా మాట వినడం లేదు" అంది సీత.

"అందుకనే నాన్నకి కాఫీ ఇంక నువ్వు ఇవ్వద్దు. మేమే ఇస్తాం. ఒక్క కాఫీయే కాదు. నాన్న ఏం తినాలో ఏం తినకూడదో అంతా మేమే చూస్తాం" అని అన్నాడు బాబు.

"ఎందుకలా?" అన్నాడు రామం ఏం జరుగుతోందో అర్థం కానట్లు.

"నీకు డయాబిటిస్ ఉంది కదా – అందుకు" అన్నాడు బాబు.

"అదా? డాక్టర్ బోర్డర్ లైనని అన్నాళ్ళే. అంటే ఉన్నట్లు కాదు" అన్నాడు రామం.

"అంటే లేదని కూడా కాదు. డయాబిటిస్ ఉంటే తిండి జాగ్రత్తగా తినాలని అంటున్నారు. అందుకే ఈ రోజు నుండి నువ్వేం తినాలో ఏం తినకూడదో అంతా

మేమే చూసుకుంటాం" అని అంది పాప.

"ఈ రోజు మా పెళ్ళిరోజు కదా – ఈ రోజుకి వదిలెయ్యండి. ఈ రోజు హాయిగా అన్నీ తినెయ్యనియ్యండి. రేపట్నుంచి ఇంక తీపి ముట్టుకోను. సరేనా?" అన్నాడు రామం.

"రేపట్నుంచీ కాదు. ఈ రోజు నుంచే. అసలు ఇప్పట్నుంచే. మంచి పని చెయ్యడం మొదలెట్టడానికి మీ పెళ్ళి రోజే మంచి రోజు. సరేనా?" అన్నాడు బాబు.

"మీకో సంగతి చెప్పనా? గత పదిహేనేళ్ళగా ప్రతి పెళ్ళి రోజూ స్వీట్లూ, కేకులూ, ఐస్‌క్రీములూ తినకుండా ఉండలేదు నేను. అవన్నీ ఈసారి మానేస్తే ఎలా?"

"మానద్దు. అమ్మా మేమూ తింటాం. నువ్వు చూడు. అంతే కానీ తింటానని అనకు. నా కెప్పుడన్నా రొంప చేస్తే ఐస్‌క్రీం మానెయ్యమ్మా అని నువ్వు చెప్పవూ? అలానే ఇదీనూ" అంది పాప.

"నేను పంటి నొప్పని అన్నప్పుడు నాకూ చాక్లేట్లు తినకూడదని చెప్పలేదూ నువ్వు?" అన్నాడు బాబు.

"సీతా ఏమిటీ దారుణం? నువ్వైనా చెప్పు వాళ్ళకి" అన్నాడు రామం.

సీత నవ్వు ఆపుకుంటూ పిల్లలతో – "స్వీట్ తిననియ్యక పోతే పోనీ – ఈ ఒక్క రోజుకీ కాఫీలో ఇంత – వేసామో లేదో అన్నట్లు కొంచెం – పంచదార వేసి ఇవ్వండి" అని అంటోంటే –

"అమ్మా – అన్నీ తెలిసి నువ్వే ఇలా అంటే ఎలా? అసలు నీ వల్లే నాన్నకి తీపి మానడం అవడం లేదు. నువ్వే పెట్టేస్తూంటావు. ఈ రోజు నుండి నాన్న తినకుండా ఉండాలంటే ఇవ్వకుండా నిన్ను చూడాలి" అన్నాడు బాబు.

"తమ్ముడూ – నాన్న తినకుండా నువ్వు చూడు. అమ్మ ఇయ్యకుండా నేను చూస్తాను" అంది పాప.

"ఇది చాలా అన్యాయం. నేను చెప్పేది వినండి. పెళ్ళైన మొదటి సంవత్సరం మేము కాకినాడలో ఉన్నాం. అక్కడ కోటయ్య కాజా దొరుకుతుంది. దాని ఫార్ములా ఏమిటో తెలియదు కానీ తింటోంటే లోపల నుండి రసం నోట్లోకి వస్తుంది. దాన్ని తిండం కూడా ఒక కళ. సరిగ్గా తినలేకపోతే ఒంటి మీదకు కారి పోతుంది. ఆ రోజు మీ అమ్మ కొత్త చీర మీదకు అలానే కారింది. గుర్తుందా సీతా?" అని అడిగాడు రామం.

"నా చీర మీద పడ్డం నిజమే కానీ నేను తింటుండగా కారి కాదు. నేను బానే తిన్నాను. మీరు తింటుండగానే నా చీర మీద పడింది" అని అంది సీత.



E:\
Ramaneeyam\
Ramaneeyam
26



"నేను తింటోంటే నీ చీర మీద ఎలా పడిందబ్బా?" అని అన్నాడు రామం – ఆ సరదా సన్నివేశాన్ని ఊహించుకుంటూ, దాన్ని సీత మాటల్లో వినాలని ఉవ్విళ్ళూరుతూ.

"ఎలాగంటే – అప్పుడు మీరు" అని చెప్పడం మొదలెట్టి పక్కన పిల్లలు ఉన్నారని చూసి టక్కున ఆపేసింది.

సీత ఎందుకు ఆపేసిందో అర్థమైనట్లు రామం –

"ఆ తర్వాత సంవత్సరం మేము బందర్లో ఉన్నాం. అక్కడ మంచి బందరు లడ్డూ దొరుకుతుంది. దాని రుచే రుచి" అని అన్నాడు – ఆ రుచి తన నోట్లో ఇప్పటికీ ఉన్నట్లు ఫీలవుతూ.

"ఆ తర్వాత సంవత్సరం ఎక్కడ ఉన్నారూ? ఏం తిన్నారూ?" అని పాప వైపు కొంటెగా చూస్తూ అడిగాడు బాబు.

సీతనే చూస్తున్న రామానికి బాబు అడగడమే వినిపించింది కానీ వాడి కొంటె నవ్వు కనిపించలేదు.

"ఎక్కడున్నాం సీతా?" అని సీరియస్‌గా సీతని అడిగాడు.

సీత రామానికి సమాధానం చెప్పకుండా పిల్లల వైపు నవ్వుతూ చూసింది.

రామం అప్పుడు వాళ్ళని చూసాడు. వాళ్ళు ముగ్గురూ నవ్వుతుండడం చూసి –

"మీరేం అలా నవ్వక్కర్లేదు. తీపి తినకుండా నేను ఉండగలను. ఈ క్షణం నుండీ నేను ఇంక తీపి తినను. ఇదిగో ఈ పంచదార లేని కాఫీ ఎలా తాగేస్తున్నానో చూడండి" అని కాఫీ ఒక్క గుక్కలో తాగేసాడు రామం.

తాగేసిన రామం మొహంలో రంగులు మారాయి. ఆ మొహంలో ఉన్న భావం ఏమిటో ఎవ్వరికీ అర్థం కాలేదు. పిల్లల మొహాల్లో ఆనందం కనిపించింది. అంతే కాదు. రామం అంటే గౌరవం పెరిగినట్లు అనిపించింది. సీత మొహంలో మాత్రం ఒక్క క్షణం నవ్వు మాయమయి బాధ కనిపించినట్లయింది. అదీ ఒక్క క్షణం మాత్రమే. ఆ బాధ రామం కంట్లో పడింది. అది రామానికి ఆనందాన్నే కలిగించింది.

ఇంక ఆ రోజు అంతా అలానే గడిచిపోయింది. ఇంట్లో సీత చేసిన స్వీట్లని రామానికి పెట్టనివ్వలేదు పిల్లలు. పులుసుని బెల్లం వెయ్యకుండా కొంత విడిగా తీయించి అదే రామానికి వేయించారు. సాయంత్రం హోటల్లో రామం చూస్తుండగానే ఐస్‌క్రీములు తినేసారు, పిల్లలిద్దరూ – నాది బావుందంటే నాది బావుందనుకుంటూ.

రామాన్నీ, సీతనీ ఎక్కడా విడిగా ఉండనియ్యలేదు – ఎక్కడ సీత తమకి తెలియకుండా రామానికి ఏదో ఒక తీపి పదార్థం ఇచ్చేస్తుందోనని. సీత అలాంటి ప్రయత్నం ఏమీ చెయ్యలేదు. అది రామానికి కష్టంగా అనిపించింది. చిన్న పిల్లలు

అర్థం చేసుకోకపోతే పోయె తన్ని సీత కూడా అర్థంచేసుకోవడం లేదని బాధ కలిగింది. దాంతో ఉక్రోషం వచ్చింది. తొమ్మిది అవకుండా మంచం ఎక్కేసి పడుక్కున్నాడు – తలనొప్పిగా ఉందని.

రామం పక్కనే పడుక్కుని పిల్లలు ఆ రోజు జరిగిన విషయాలు నవ్వుకుంటూ చెప్పుకుంటున్నారు. అందులో వాళ్ళు ఆ రోజు తిన్న స్వీట్లూ, ఐస్‌క్రీముల గురించే కాక రామాన్ని తినకుండా ఎలా ఆపగలిగారో కూడా ఉంది.

రామం వింటూనే నిద్ర నటించాడు. పిల్లల్ని పడుకోమని సీత చెప్తూనే ఉంది. ఐతే వాళ్ళ ఉత్సాహంలో వాళ్ళుండి బాగా ఆలస్యంగా పడుక్కున్నారు. పడుక్కోబోతూ కూడా 'నాన్నకి స్వీట్లు పెట్టద్దు' అని సీతతో చెప్పి పడుక్కున్నారు వాళ్ళు.

వాళ్ళు నిద్రపోయారని నిర్ధారించుకున్నాక రామం పక్కకి వచ్చింది సీత.

సీత రావడం తెలిసింది రామానికి. అయినా కళ్ళు మూసుకుని అలా పడుక్కనే ఉన్నాడు రామం.

"కోపమా?" అని అడిగింది సీత మంచం పక్కనే నేల మీద కూర్చుని, రామం మీద చెయ్యి వేస్తూ.

సీత గొంతులోని ఆత్మీయతకి రామం కరిగిపోయాడు. సీత చేతి స్పర్శ లోని లాలిత్యానికి రామం కదిలిపోయాడు.

"కాదు బాధ" అన్నాడు ఇంకేం అనాలో తెలియక.

"ఎందుకు?" అని అడిగింది సీత. అలా అడుగుతూ సీత రామం జుట్టుని తన వేళ్ళతో నిమరసాగింది. రామానికి పొద్దున్న నుండి వచ్చిన బాధా, ఉక్రోషం, కోపం అన్నీ ఒక్కొక్కటే పోయాయి.

"ఏమో" అన్నాడు, నిజంగానే బాధ ఎందుకో తెలియదన్నట్లు.

"మీకు పొద్దున్న నుండి స్వీట్ పెట్టలేదనే కదూ?" అని అడిగింది సీత రామం చెవుల దగ్గరగా నోరు పెట్టి, ఏదో రహస్యం చెప్తున్నట్లు.

"ఊఁ" అన్నాడు రామం.

"మీరలా కళ్ళు మూసుకునే ఉండండి" అంది సీత.

రామం కళ్ళు మూసుకునే ఉన్నాడు. రామం మొహానికి సీత ఊపిరి తగిలింది – వెచ్చగా. ఆ తర్వాత రామం పెదాలకి సీత పెదాలు తగిలాయి – మధురంగా.

ఆ వెచ్చదనంలో, మాధుర్యంలో ఏం జరుగుతోందో తెలియకుండా ఉండిపోయిన రామం – "స్వీట్ బావుందా?" అని సీత అడగడంతో ఏదో అందమైన మత్తులోంచి బయటికి వచ్చినట్లు కళ్ళు తెరిచాడు.



E:\
Ramaneeyam\
Ramaneeyam
27



సీత బుగ్గలు ఎరుపెక్కి ఉన్నాయి. పెదవులు కంపిస్తున్నాయి.

"ఇంకా కావాలి" అన్నాడు రామం, సీత పెదవులనే చూస్తూ.

"అమ్మో ఆశ. డాక్టర్ వద్దన్నారు. పిల్లలు వద్దంటున్నారు. అయినా వాళ్ళు చూడకుండా పాపం కదాని కొంచెం ఇస్తే ఇంకా కావాలని అడుగుతారేం? మీరు స్వీట్ తినకూడదు. తెలుసా?" అంది సీత.

"ఈ స్వీట్ కాదు. ఇది దేవుడు ప్రత్యేకంగా నా కోసమే చేసి ఇచ్చింది. ఇది తినచ్చు. ఎంతయినా తినచ్చు. తినే కొద్దీ ఆరోగ్యం మెరుగవుతుందే కానీ పాడవదు"

"ఆరోగ్యం సంగతి సరే – ఎక్కువ తింటే మొహం మొత్తుతుంది"

"మొహం మొత్తేవి కాకినాడలో కోటయ్య కాజాలూ, బందరులో తొక్కుడు లడ్లూ, హైదరాబాద్‌లో పుల్లారెడ్డి స్వీట్లూ" అని రామం ఇంకా చెప్తూంటే ఆపేస్తూ –

"ఈ సంవత్సరం పెళ్ళి రోజుకి ఇవేం తినలేకపోయారు మీరు. లోటుగా అనిపిస్తోందా? లోపల్నుండి ఏదన్నా స్వీట్ కొంచెం తీసుకువచ్చి ఇవ్వనా?" అని అడిగింది సీత.

"వద్దు సీతా – నువ్వైనా, పిల్లలైనా ఎందుకు నన్ను తినద్దంటున్నారు? నా ఆరోగ్యం కోసమే కదా? నా ఆరోగ్యం సంగతి నేను కూడా చూసుకోవాలి సీతా. అది నా కోసం కాదు. నీ కోసం. మన పిల్లల కోసం. ఆ సంగతి నాకు తెలియదూ? నేను నిజంగానే స్వీట్లు తినడం మానేస్తాను. నేను బావుంటేనే కదా మీకు ఏదన్నా చెయ్య గలిగేది? నాకు స్వీట్లంటే ఇష్టమే. అయితే అంత కన్న నువ్వంటే ఇష్టం. మన పిల్ల లంటే ఇష్టం. అయినా ఈ రోజు నేను తిన్న స్వీట్ అంతకు ముందు ఏ పెళ్ళి రోజునా తిననంత తియ్యనైనది" అన్నాడు రామం సీత పెదాల్నే చూస్తూ.

"అయితే తినడం ఆపేసారేం?" అంది సీత సిగ్గుపడుతూ.

"ఇది మన పదిహేనో పెళ్ళి రోజు. అయినా నీ కింకా సిగ్గు పోలేదు" అన్నాడు రామం.

"సిగ్గుంటే ఈ పని చేస్తానా?" అంది సీత.

"ఏ పని?" అని అడిగాడు రామం.

"స్వీట్లు తినే పని" అంది సీత ఇంకాస్త సిగ్గు పడుతూ.

"తినే పనా? తినిపించే పనా?" అని అడగబోయి – సీత కావాలనే తినే పని అని అందని అర్థం చేసుకుని – సీతని దగ్గరికి తీసుకున్నాడు రామం.

తను చెప్పదల్చుకుంది రామానికి అర్థమైందని అర్థమై – ఇంకా సిగ్గుపడి పోయింది సీత.

❋

'స్వాతి' మాసపత్రిక – *అక్టోబర్, 1999*

E:\
Ramaneeyam\
Ramaneeyam
28

# చతుర్థాంకం

సన్నని వేళ్ళు తన్ని సన్నగా తట్టి లేపినట్లయితే, మెల్లగా కళ్ళు తెరిచాడు రామం.

పక్కనే కూర్చునుంది సీత. ఇరవై నాలుగేళ్ళ ఆరు నెలల రెండు రోజుల క్రితం పెళ్ళి పీటల మీదెలా ఉందో, అలానే ఉంది సీత.

అవే కళ్ళు, అదే నోరు, అదే జడ. నల్లగా, పొడుగ్గా, లావుగా ఉన్న జడ.







ఇన్నేళ్ళలోనూ సీత జడ లావూ తగ్గలేదు – సీత నడుం సన్నమూ తగ్గలేదు.

"టైమెంతయింది?" అన్నాడు రామం.

"పన్నెండున్నర" అంది సీత వాచీ చూడకుండా.

"మెలకువ వచ్చేసిందా?" అన్నాడు రామం సీత జడని చుట్టలా తన గుండెల మీద చుట్టుకుంటూ.

"అసలు నిద్రే పట్టలేదు" అంది సీత. అంటూ రామం చుట్టిన తన జడ చుట్ట మీద  తల వాల్చింది.

"ఎన్ని ఉపయోగాలో దీంతో" అన్నాడు రామం.

"మోసేవాళ్ళకి తెలుస్తుంది దేని బరువైనా?"

"తీగకి కాయా, తల్లికి పిల్లా, సీతకి జడా బరువా?"

చిన్నగా నవ్వింది సీత.

నవ్వినప్పుడు పడ్డ సొట్ట బుగ్గలనే చూస్తూ – “ఎందుకు నిద్ర పట్టలేదు సీతా?” అని అడిగాడు.

“ఏమో – ” అంది సీత.

సీత ‘ఏమో’కి అర్థం తెలియని వాడు కాదు రామం. అందుకే – “చెప్పవూ?” అని అడిగాడు.

“మనకి పెళ్ళయి ఎన్నాళ్ళయింది?” అడిగింది.

“ఇరవై నాలుగేళ్ళ ఆరు నెలల రెండు రోజులు” అన్నాడు రామం కంఠతా పడుతున్న రెండో ఎక్కాన్ని రెండో క్లాసు పిల్లాడు అప్పచెప్పినట్లు.

“అంటే – ఇంకో అయిదు నెలల, ఇరవై ఎనిమిది రోజులకి–” అని సీత మొదలెట్టగానే –

“ఇరవై అయిదేళ్ళు పూర్తవుతాయి” అంటూ పూర్తి చేశాడు రామం.

“అంటే పాతిక సంవత్సరాలన్నమాట” అంది.

“అవును – సిల్వర్ జూబిలీ” అన్నాడు రామం.

“ఆ రోజుకి–” అంటూ ఆగింది సీత.

“ఊ– ఆ రోజుకి” అని అడిగాడు రామం.

కొంతసేపు ఏమీ మాట్లాడలేదు సీత. ఆ తర్వాత నెమ్మదిగా –

“మీ నిద్ర పాడుచేశాను. ఏదయినా మంచి కల వస్తుందేమో” అంది.

“కలలు కలలే – నిజాలు కావు. అయినా ఎంతటి కలయినా, సీత కన్నా అందంగా ఉండదు” – అని అన్న రామం మాటలకి –

“– మీకు” అని కలిపింది సీత.

“అవును నాకే – అయినా అసలు సంగతి వదిలేస్తావెందుకు? ఆ రోజుకి ఏం కావాలో చెప్పు. నెక్లెసా? వడ్డాణమా? నీ సన్నని నడుంకి వడ్డాణం చేయించడం కష్టం కాదు” అన్నాడు రామం.

“నగలేం కావు” అంది సీత.

“మరింకేం కావాలి?” అని అడిగాడు రామం.

“ఆ రోజు – నా పెళ్ళిరోజు – నా కూతురి పెళ్ళి రోజు కూడా కావాలి” అంది సీత.

“నీ పెళ్ళి రోజా? నీ కూతురా?” అన్నాడు రామం.

“అదే మన పెళ్ళిరోజు – మన కూతురు” అంది.



E:\
Ramaneeyam\
Ramaneeyam
29



“బేబీకి పెళ్ళా?” అన్నాడు రామం.

“మనం బేబీ అని పిల్చినంత మాత్రాన అది బేబీగా ఉండిపోతుందా? దానికి ఇరవై మూడేళ్ళు” అంది సీత.

“ఇంకో రెండు మూడేళ్ళు ఆగచ్చునేమో” అన్నాడు రామం.

“ఇంకో పదేళ్ళు కూడా ఆగచ్చు” అంది సీత.

“ఎందుకంత వ్యంగ్యం సీతా! మొన్ననే గదా దాని చదువు పూర్తయింది. హాయిగా కొన్నాళ్ళు ఉద్యోగం చేసుకోనీ” అన్నాడు రామం.

“సంవత్సరం దాటుతోంది బేబీ ఉద్యోగం చెయ్యడం మొదలెట్టి. మీ ఆలోచన దాని ఉద్యోగం గురించి కాదు. దానికి పెళ్ళి చేసి పంపించడం మీకు కష్టం. అవునా?” అని అడిగింది సీత.

“అవునేమో” అన్నాడు రామం. అని, కొంత సేపు మౌనంగా ఉండి; “నీ ఇష్టం – నువ్వు చెప్పినట్లే చేద్దాం. సంబంధాలు చూద్దాం” అన్నాడు.

ఏ విషయంలో సీత చెప్పింది వినాలో తెలుసు రామానికి – అలానే సీతకీనూ.

‘ఫలానా కంప్యూటర్ బావుంటుంది – కొందాం’ అని రామం చెప్తే, సీత ఒప్పుకుంటుంది.

‘కారుని దూరంగా ఉన్న మెకానిక్ దగ్గరకే రిపేరుకి తీసికెళ్ళ’మని రామం అంటే, అక్కడికే తీసుకెళ్తుంది సీత.

‘అబ్బాయికి ఈ సారి జ్వరం ప్రతీసారిలా లేదు, స్పెషలిస్టు దగ్గరకు తీసుకువెళ్దాం’ అని సీత అంటే అలానే చేస్తాడు రామం.

‘అమ్మాయి ఎందుకో అదోలా ఉంది. కాలేజీలో ఏమైనా అయిందేమో కనుక్కో’మని సీత చెప్తే, అలాగే చేస్తాడు రామం.

ఏ విషయంలో ఎవరి మాట వినాలో ఇద్దరికీ తెలుసు. తెలుసునంటే ముందునుండే తెలుసునని కాదు – తెలుసుకున్నారు.

తెలుసుకుందుకు పాతికేళ్ళు తక్కువ సమయం కాదు. పాతికేళ్ళంటే ఎన్ని రోజులు? ఎన్ని గంటలు? ఎన్ని నిముషాలు? అంతకుమించి ఎన్ని అనుభవాలు? ఎన్ని అనుభూతులు?

అన్ని అనుభవాల్లో, అన్ని అనుభూతుల్లో కలిసి పయనించిన జీవితాలు వాళ్ళవి.

రెండు వాగులు కలిసిన చోట, ఒక నీరు ఇంకో నీరుతో కలుస్తుంటే, అలజడి ఉంటుంది.

అలానే వాళ్ళ తొలి నాళ్ళలో సరదాల జగడాలు ఉండేవి. వాగులు రెండూ

ఒకటై ప్రవహిస్తోంటే – ఒక్క వాగు నీరే ప్రవహిస్తుంది. ఇప్పుడు వాళ్ళ జీవితమూ అంతే!

అందుకే సీత 'పిల్ల పెళ్ళిచేద్దాం' అంటే 'సరే'నన్నాడు రామం. రామానికి విడిగా అభిప్రాయం లేక కాదు. అయితే ఏది ఇద్దరికీ, కుటుంబానికీ మంచో రామానికి తెలుసు. సీతకీ తెలుసు.

❁ ❁ ❁

"వర్ధనిగారు ఫోన్ చేశారు" అంది సీత.

ఏమంటుంది?" అన్నాడు రామం.

"వాళ్ళబ్బాయికి మనమ్మాయిని చేసుకుంటారా అని అడిగారు" అంది సీత.

"నిజంగా?" అన్నాడు ఆనందంగా రామం.

"నిజంగానే" అంది – రామం ఆనందానికి ఆనందిస్తూ సీత.

"మన బేబీ ఎంత అదృష్టవంతురాలు సీతా! మనం ఇంకా పెళ్ళి సంబంధాలు చూద్దాం అనుకునేలోగానే – మంచి సంబంధం వెతుక్కుంటూ వచ్చేసింది. నువ్వేమన్నావు?" అన్నాడు రామం.

"మీతో మాట్లాడి చెప్తానన్నాను" అంది సీత.

"నాతో మాట్లాడడమెందుకు సీతా! సరే ననెయాల్సింది. వాళ్ళబ్బాయి నీకు తెలుసుగా – సుందర్ – పెద్ద కంపెనీలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు – బుద్ధిమంతుడు – బావుంటాడు" అని రామం అంటూంటే –

"సుందర్‌కి అమెరికాలో ఉద్యోగం వస్తోందిట. అయిదారు నెలలలో వెళ్ళిపోతాడుట. ఈలోగా పెళ్ళి చేసి, కోడలితో కొడుకుని అమెరికా పంపించాలని వర్ధనిగారి కోరిక" అంది సీత.

"సుందర్ అమెరికా వెళ్ళిపోతాడా? అంటే ఈ సంబంధం చేస్తే బేబీ కూడా..." రామానికి ఏం చెప్పాలో తెలియనట్లు ఆగిపోయాడు.

"పెళ్ళయితే ఇద్దరూ అమెరికాలోనే ఉంటారు" అంది సీత.

అలా అంటున్న సీత కళ్ళు తడవుతున్నట్లనిపించింది రామానికి.

"బేబీకి పెళ్ళి చేసి అమెరికా పంపించేద్దామా?" అని అడిగాడు రామం.

అలా అడుగుతున్న రామం కంఠం వణుకుతున్నట్లనిపించింది సీతకి.

కొంచెం సేపు ఇద్దరూ ఏమి మాట్లాడుకోలేదు.

"బేబీని అమెరికా పంపించెయ్యాలంటే, ఈ సంబంధం మనకొద్దు సీతా! ఇంకో మంచి సంబంధం చూద్దాం. మనకి దగ్గరగా కాకుండా బేబీ ఉండగలదా?" అన్నాడు



E:\ Ramaneeyam\ Ramaneeyam 30



రామం.

"బేబీ ఉండగలదో, లేదో – మనం ఉండగలమా?" అని అడిగింది సీత.

"నువ్వుండగలవా?" అని అడిగాడు రామం.

"ఏమో!" అంది సీత.

"అంటే?" అన్నాడు రామం.

"ఉండగలనో, లేదో ఇప్పుడే ఏం చెప్పగలను? ఉండగలగాల్సి వస్తే – అప్పుడు తెలుస్తుంది".

"అసలు ఉండగలగాల్సిన పరిస్థితి ఎందుకు సీతా? వర్ధని ఏమి అనుకోదు – వద్దని చెప్పేద్దాం" అన్నాడు రామం.

"తమ పిల్లల కోసం సంబంధాలు చూసుకుంటున్న చాలామంది – అమెరికా సంబంధం దొరికితే బావుండుననుకుంటున్నారు. మనం, మన దగ్గరికి వచ్చిన అమెరికా సంబంధాన్ని వదిలేసుకుంటే – అందరూ నవ్వుకుంటారు" అంది సీత.

"ఎవరో నవ్వుతారని –" అని రామం ఏదో అనబోతుంటే –

"ఎవరో నవ్వుతారనే కాదు, ఈ సంబంధం వదిలేసుకుంటే మనమూ నష్టపోతామేమోనని" అంది సీత.

"మనమా?" అని అడిగాడు రామం.

"అవును మనం. మనం అంటే – మీరూ, నేనూ, బేబీ – ముఖ్యంగా బేబీ" అంది సీత.

"బేబీ అక్కడకెళ్ళి సుఖపడుతుందా?"అని అడిగాడు రామం.

"ఎందుకు పడదు? ఎందరు అక్కడ కెళ్ళి సుఖపడ్డంలేదు? అలానే బేబీనూ. అక్కడ కెళ్ళి రకరకాలుగా రాణిస్తున్నారు మన వాళ్ళు. అక్కడ ఏం చేసేందుకైనా అవకాశాలు ఎక్కువ. అందుకనే గదా అందరూ అక్కడ కెళ్తున్నది?" అంది సీత.

"సీతా! నువ్వేనా ఇలా మాట్లాడుతున్నది?" అన్నాడు రామం ఆశ్చర్యంగా.

"తల్లితండ్రులం – మనం – మన స్వార్థం కోసం – బేబీకి ఈ సంబంధం చెయ్యకపోతే – బేబీకి ఓ మంచి సంబంధం – ఓ మంచి అవకాశం – పోగొట్టిన వాళ్ళం అవుతామేమోననిపిస్తోంది" అంది సీత.

"నిజం చెప్పు సీతా! నిజంగా నీకు బేబీ అంత దూరం వెళ్ళిపోతుందంటే బెంగగా లేదూ?" అని అడిగాడు రామం.

"ఎందుకు లేదు? అయితే ఏం చేద్దాం?"

"సుందర్‌కి నచ్చచెప్దాం" అన్నాడు రామం.

"అమెరికా వెళ్ళాలన్న కోరిక సుందర్‌కి ఎంత ఉందో నాకు తెలియదు. అయితే ఆ కోరిక బేబీకి చాలా ఉంది. దాని చదువుకి అక్కడ మంచి అవకాశాలున్నాయం టోందది" అలా అంటున్న సీత కళ్ళు తడయ్యాయి.

"అంటే – బేబీకి అమెరికా వెళ్లాలని ఉందా?" అని అడిగాడు రామం.

"అవును. ఒక్క మన బేబీనే కాదు. ఈ కాలంలో మంచి చదువూ, ఉద్యోగం కావాలనుకుంటున్న పిల్లలందరికీ అదే కోరిక. నిజానికి అది కోరిక కూడా కాదు. స్కూలు చదువు కాగానే కాలేజీలో చేరుతున్నట్లు కాలేజీ చదువు పూర్తవగానే, పై చదువులకో, ఉద్యోగాలకో అమెరికా వెళ్ళిపోతున్నారు. అది ఎంతో సహజంగా జరిగిపోతోంది" అంది సీత.

"పిల్లలలా వెళ్ళిపోతే మరి పెద్దవాళ్ళ సంగతి?" అని అడిగాడు రామం.

"నిజానికి చాలామంది పెద్దవాళ్ళే పిల్లల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ కాలంలో మంచి సంబంధం అంటే – అమెరికా సంబంధమే" అంది సీత.

"అది సరే కాని – ఈ సంబంధం గురించి వర్ధని మాట్లాడిందన్నావు కదా – ఈ సంబంధం సుందర్‌కి ఇష్టమేనా?" అన్నాడు రామం.

"సుందర్ ఇష్టం తెలిశాకే ఆవిడ ఫోన్ చేశారుట" అంది సీత.

"మరి మన బేబీకి సుందరంటే ఇష్టమేనా?" అని అడిగాడు రామం.

"తెలియదు – కనుక్కోవాలి" అంది సీత.

"కనుక్కో. బేబీ ఏమంటుందో? అది ఏమంటే మనం అదృష్టవంతులమో – అవునంటేనో – కాదంటేనో?" అన్నాడు రామం.

"ఏమో" అంటూ రామం ఒళ్ళో తల దూర్చింది సీత!

సీత జడ మీద తల వాల్చాడు రామం!

❁ ❁ ❁

ట్యూబ్‌లైట్ ఆపేసి, బెడ్‌లైట్ వేసి, రామం పక్కనే పడుక్కోంటూ –

"దానికి అతనంటే ఇష్టమేనట" అంది సీత.

"భాషలో నామవాచకాలూ, సర్వనామాలూ అని రెండు ఉన్నాయి. అసలు నామవాచకాలే లేకుండా, సర్వనామాలే వాడితే ఎలా? దానికంటే ఎవరికి? అతనంటే ఎవరు?" అన్నాడు రామం.

"దానికన్నమాట దానికెవరికో అయితే మీ కెందుకు చెప్తాను? దానికంటే బేబీకి – అతనంటే సుందర్. సుందర్‌కి మన బేబీ అంటే ఎలానో – అలానే మన బేబీకి కూడా సుందర్ అంటే ఇష్టమేనట" అంది సీత.



E:\
Ramaneeyam\
Ramaneeyam
31



రామం వెంటనే ఏమి మాట్లాడలేదు. ఏం మాట్లాడాలో తెలియలేదు. ఇరవై మూడేళ్ళు వచ్చినా, బేబీ రామం దగ్గర మూడేళ్ళ పిల్లలానే ఉంటుంది. రామం సోఫాలో కూర్చుంటే, అతని ఒళ్ళో తల పెట్టుకు పడుకుంటుంది. బయటికి ఎక్కడికి వెళ్ళినా రామం చెయ్యి పట్టుకునే నడుస్తుంది. అలాంటి బేబీ తను ఓ మగాడ్ని ఇష్టపడుతోందని సీత చెప్తోంటే రామానికి నమ్మకం కుదరలేదు.

బేబీకి పెళ్ళి చేసి పంపించడమే కష్టం అనుకుంటున్న రామానికి, బేబీ, తానింక బేబీని కాదని చెప్తున్నట్లనిపించి, ఇంకా కష్టంగా తోచింది.

"కన్నతల్లివి – నీ క్కూడా ఈ విషయం చెప్పలేదా?" అన్నాడు.

"అది పెద్దదయింది. దాని మంచిచెడులు అది చూసుకుంటుంది. దానికి ఇష్టమైన సంబంధం చెయ్యడమే మన కర్తవ్యం" అంది సీత.

"మనం ఈ పెళ్ళి జరిపించాలని ఏముంది? ఈ పెళ్ళి చెయ్యొద్దు మనం' అన్నాడు కోపంగా రామం.

సీత నవ్వింది. ఆ నవ్వులో –

'మీకూ కోపమా?' అన్న ఆశ్చర్యం  ఉంది.

'పిల్లను కోప్పడద్దు' అన్న అర్థింపు ఉంది.

'కోప్పడి ఏం చెయ్యగలరు?' అన్న జాలి చూపు ఉంది.

ఇన్ని భావాలు ఒక్కసారే తన నవ్వులో చూపించగలగడం – అంత బాధలోనూ నవ్వడం –  ఒక్క సీతకే సాధ్యం అనుకున్నాడు రామం.

నవ్వుతూనే సీత – "కణ్వుడు ఆశ్రమంలో లేని సమయంలో శకుంతల దుష్యంతుడిని ప్రేమించడమే కాదు – గాంధర్వ వివాహం కూడా చేసుకుంది. ఆ వివాహ విషయం తెలిసిన కణ్వుడు దూర్వాసుడు కాలేదు. తను పెంచి పెద్ద చేసిన పిల్ల తనకి చెప్పకుండా పెళ్ళి చేసుకుందని ఆగ్రహించలేదు సరికదా – సరైన వరుణ్ణి చూసుకుందని సంతోషించాడు" అంది సీత.

"కణ్వుడు మహర్షి. దుష్యంతుడు సద్గుణ సంపన్నుడు. కాళిదాసు మహాకవి" అన్నాడు రామం మూడు సత్యాలను ఆవిష్కరిస్తున్నట్లు.

"మీరన్న మూడు వాక్యాలలోనూ మూడవదొక్కటే సత్యం. మొదటి రెండూ అసత్యాలే. కణ్వుడేం మహర్షి? అంతటి మహర్షే అయితే, శకుంతలను అత్తారింటికి పంపిస్తూ ఏడుస్తాడా? దుష్యంతుడు సద్గుణసంపన్నుడా? అలాంటి వాడు తను కట్టుకున్న భార్యను గుర్తించడా? కాళిదాసు మాత్రం గొప్పకవి. అందుకే దుష్యంతుడి దుర్గుణానికి, దూర్వాసుడి మంత్రపు మసి పూసి మతి మరుపు మారేడుకాయను

చేశాడు" అంది సీత.

"ఇప్పుడు మనం కణ్వుడి గురించి కాదు మాట్లాడుకోవలసింది" అన్నాడు రామం.

"నిజానికి మనం మాట్లాడుకోవల్సింది కణ్వుడి గురించే. అదొదిలెయ్యండి. బేబీ సుందర్‌ని ఇష్టపడుతోంది. సుందర్‌కీ బేబీ అంటే ఇష్టమే. వర్ధనిగారే ఈ సంబంధం గురించి అడిగారు" అని సీత అంటూంటే ––

"నీకీ సంబంధం బాగా ఇష్టం లాగుందే" అన్నాడు రామం.

"ఈ పెళ్ళి చేసుకుంటే పిల్ల సుఖపడుతుందనిపిస్తోంది నాకు" అంది సీత.

"నిజం చెప్పు సీతా! నీకీ సంగతి ముందే తెలుసా?" అని అడిగాడు రామం.

"ఏం సంగతి?" అంది సీత.

"బేబీకి సుందర్ అంటే ఇష్టమన్న సంగతి" అన్నాడు రామం.

సీత తల వంచుకుంది. వంచుకుని కళ్ళెత్తి రామాన్ని చూసింది.

రామం సీతనే చూస్తున్నాడు. పాతికేళ్ళ క్రితం ఎలా చూశాడో, అలానే చూస్తున్నాడు. ఆ కళ్ళలో అదే ప్రేమ. అదే ఆరాధన. అదే నమ్మకం.

"నీకు చెప్పి నిన్ను కష్టపెట్టడం ఇష్టంలేక..." అంటూ ఆగింది సీత.

గౌరవార్థక బహువచనం నుండి, ఆత్మీయార్థక ఏకవచనంలోకి సీత దిగినప్పుడల్లా, సీతకి రామం – పాతికేళ్ళకి ముందు రామంలా కనిపిస్తాడని రామానికి తెలుసు. అందుకే –

"సీతా!" అన్నాడు సీతనే చూస్తూ.

"ఊ" అంది, సీతకే సాధ్యమయ్యేలా సీత.

"వర్ధనితో ఫోన్లో నువ్వు మాట్లాడుతావా? బావగారితో నేను మాట్లాడనా?" అని అడిగాడు రామం.

"నా కోసం ఒప్పుకొంటున్నారా?" అంది సీత.

"బేబీ సుఖపడుతుందని నీకు అనిపిస్తే – నాకూ అదే అనిపిస్తోంది" అన్నాడు రామం.

"అసలు మీకేమనిపిస్తోంది?" అంది సీత.

"ఇంతకుముందు ఏమీ అనిపించలేదు. ఇప్పుడు మాత్రం నీకేమనిపిస్తోందో – అదే అనిపిస్తోంది" అన్నాడు రామం.

"మీరెంత..." అని సీత మొదలెట్టగానే –

"మంచివారంటే – నువ్వు బావున్నంత, నువ్వెంత బావున్నావంటే నీ..." అని రామం అంటూండగానే –



E:\ Ramaneeyam\ Ramaneeyam 32



"...జడంత" ముగించేస్తూ పక్కకి తిరిగింది సీత.

రోజుకి ఎన్నిసార్లు తన అందం గురించి ప్రస్తావన వస్తే, అన్నిసార్లు ఆనందించే సీత జడ – పాతికేళ్ళగా వచ్చిన ప్రస్తావనలన్నీ కలిపి కూడా తనలోని వెంట్రుకలన్ని లేవని – బాధగా, గర్వంగా – సీతతో పాటు పక్కకి తిరిగింది.

❋ ❋ ❋

"ఇంకొక్కరోజు. వెళ్ళిపోతుంది బేబీ" అన్నాడు రామం.

"ఇన్నాళ్ళూ పనుల హడావిడిలో తెలియలేదు. దాన్ని పంపే రోజు వచ్చేసింది" అంది సీత.

"మన పాతికేళ్ళ పెళ్ళి రోజునే దాని పెళ్ళి చెయ్యాలని ఒకటే తొందర చేసిందానవు నువ్వు. అప్పుడే తొందరెందుకని నేనన్నా వినిపించుకోలేదు" అన్నాడు రామం.

"మనం చేసింది తప్పని అనుకోవడం లేదు నేను. ఆడపిల్లకి పెళ్ళి చెయ్యకా తప్పదు. అల్లుడితో పంపించకా తప్పదు" అంది సీత.

"ఇన్నేళ్ళూ మన పిల్ల – ఇంక మీదట...." అంటూ ఆగాడు రామం.

"ఇంక ముందూ మన పిల్లే – అయితే..." అంది సీత, ఇంకేమనాలో తెలియక.

"ఆ 'అయితే'నే బాధిస్తోంది. మనకే ఇలాగుంటే – దానికి ఎలాగుందో? మనల్ని వదిలి అంత దూరం వెళ్ళాలి" అన్నాడు రామం.

"దానికేం – అది సరదాగా, హాయిగా తిరుగుతోంది" అంది సీత.

"లేకపోతే, అతని ముందు కూర్చుని ఏడుస్తుందా?" అన్నాడు రామం.

"పెళ్ళయి వారం అవుతోంది. రోజూ ఎక్కడికో ఒకచోటకి వెళ్లి వస్తోంది" అంది సీత.

"అది పుట్టి పెరిగిన ఊరిది. ఊరి నిండా స్నేహితులే. అందరి దగ్గరకూ తీసుకువెళ్తోంది. అలానే దాని స్కూలూ, కాలేజీ, అది చిన్నప్పటినుండీ తిరిగిన పార్కులూ, గుళ్ళూ, బీచ్ – అన్నీ చూపిస్తోంది. నిన్న నేనూ వాళ్ళతో వెళ్ళానుగా గుడికి. గుళ్ళో చిన్న ఏనుగుల బొమ్మలున్నాయి చూడు. వాటి దగ్గరే కూర్చున్నాం. ఎంతసేపు చెప్పిందో – చిన్నప్పుడు తను వాటి మీద కూర్చుని ఆడుకోవడం గురించి. అప్పుడంత పెద్దగా అనిపించిన ఏనుగులు. ఇప్పుడెంతో చిన్నగా అయిపోయాయంది. నాకు చిన్న చిన్న గౌన్లు వేసుకుని తిరిగిన పిల్లే గుర్తుకు వచ్చింది. అది పెద్దవకుండా అలానే ఉండిపోతే బాగుండుననిపించింది" అన్నాడు రామం.

"నాకూ అంతే. మొన్న మేం ముగ్గురం బీచ్‌కి వెళ్ళాం కదా. మా అమ్మ నన్ను చెయ్యి పట్టుకుని అలల్లో నిలపెట్టేదని చెప్తూ, నా చేతులు పట్టుకుని అలల్లో నిల్చుంది.

సుండల్, మురుకులూ అడిగి నా చేత కొనిపించుకుంది. దాని దగ్గర డబ్బులు లేక కాదు – నేను కొనిపెడితే బావుంటుందని. నాకూ అదే అనిపించింది. అది చిన్నపిల్లలా అలా ఉండి పోయుంటే – ఈ రోజు – దాన్నిలా పంపాల్సిన అవసరం వచ్చేది కాదని" అంది సీత.

"అది వెళ్ళిపోతే ఎలా ఉంటాం సీతా!" అన్నాడు రామం.

"మీకు గుర్తుందా – దానికి మూడేళ్ళప్పుడు దాన్ని స్కూల్లో చేర్చాం. అప్పుడు మనం తప్ప మరో లోకం లేదు దానికి. అలాంటి పిల్లని స్కూల్లో దింపేసి వస్తుంటే, నేనూ వచ్చేస్తానని గట్టిగా ఏడ్చింది – గుర్తుందా మీకు? అయినా అక్కడే వదిలేసి వచ్చాం. అంత చిన్న పిల్ల మనల్ని వదిలి ఉండగలదో, లేదోనని మనస్సు బాధపడుతున్నా, ఇంటికి వచ్చేశాం. ఇంటికొచ్చి ఎంత ఏడ్చానో నేను. మీరైతే ఆఫీసుకు వెళ్ళలేకపోయారు. అంత కష్టపడుతూ ఎందుకు స్కూల్లో వదిలేశాం? దాని మంచి కోసం – దాని భవిష్యత్తు కోసం. ఆ తర్వాత దానికి స్కూలు అలవాటైపోయింది. ఎప్పుడన్నా మనం మానమన్నా స్కూలు మానేది కాదది. మనకీ అలవాటైపోయింది. ఇదీ అంతే" అంది సీత.

"దానికీ, దీనికి పోలికేంటి సీతా! – అది కొన్ని గంటలు స్కూలుకి వెళ్ళి రావడం – ఇది – ఇది – మనల్ని వదిలి ఇంకొకరితో వెళ్ళిపోవడం – మన గురించే కాదు – దాని గురించి ఆలోచించు. సుందర్ తెలిసినవాడే కావచ్చు. ఇష్టపడ్డ వాడే కావచ్చు. అయినా అతనితో వెళ్ళి అక్కడ ఎలాగుంటుందో? మన దగ్గర గారాబంగా పెరిగిన పిల్లని అతను ఎలా చూస్తాడో? ఏదన్నా అంటాడేమో – అంటే అది ఎలా తట్టుకుంటుంది?" అన్నాడు దిగులుగా రామం.

"ఆ మాటే చెప్తున్నాను దానికి. జాగ్రత్తగా ఉండు బేబీ – అమ్మా నాన్నల దగ్గర ఉన్నట్లు కాదు – అతనికి కావల్సినవి చూసి చెయ్యి – అతనికి కావాల్సినట్లుండు – అప్పుడే నీ జీవితం, అతని జీవితం సుఖంగా ఉంటాయని. నేను చెప్పిందంతా వింటోంది. వింటూ నవ్వుతోంది. నాదంతా చాదస్తం అనిపిస్తోంది దానికి. నన్నో అమాయకురాలిని అనుకుంటోంది. ఇవన్నీ నాకు తెలియవా అన్నట్లు చూస్తోంది" అంది సీత.

"నన్నూ అలానే చూస్తోంది. నేను దానితో కాదు – అతనితోనే మాట్లాడాను. పెళ్ళయ్యాక అప్పగింతల తంతు జరిగింది చూశావూ – అప్పుడు – అప్పుడు దాన్ని – వాళ్ళకి అప్పగించేస్తున్నామన్న ఆలోచన భారంగా అనిపించి – అతనితో – 'బాబూ – గారాబంగా పెంచుకున్న పిల్ల – అది తెలిసో, తెలియకో తప్పు చేసినా నువ్వేమి అనుకోకు – దాన్నేమీ అనద్దు – నీకుకావల్సినట్లు దాన్ని మలచుకో' – అని చెప్పాను. ముందుగా – అలా చెప్పాలని నేననుకోలేదు. అయినా నేననుకోకుండా – అప్రయత్నంగా – నా గుండెలోని బాధ ఆ మాటల రూపంగా బయటికి వచ్చేసింది. ఆ మాటలు నేననడం వింది బేబీ. విని నన్ను దగ్గరకు తీసుకుంది – నేను దానికి తండ్రిలా కాక, నాకది తండ్రిలా. దానికి అంత పెద్దరికం, హుందాతనం ఎలా వచ్చాయో. అసలు వచ్చాయా? లేక, లోపల బాధపడుతూ,పైకి అలా ఉంటోందా?" అని అడిగాడు రామం.

"పాతికేళ్ళ క్రితం నా గురించి మా నాన్న ఏమనుకొని ఉంటారో ఇప్పుడర్థమవుతోంది నాకు" అంది సీత.

"అంటే" – అని అడిగాడు రామం.

"మీకు అర్థం కాదు – ఎప్పటికీ అర్థం కాదు" అంది సీత.

"ఏంటీ–" అన్నాడు రామం.

"ఇప్పటి బేబీ ప్రవర్తన – అప్పటి నా ప్రవర్తన" అంది సీత.

❁ ❁ ❁

"వెళ్ళిపోయింది బేబీ – మళ్ళీ ఎప్పుడొస్తుందో – ఈ దేశంలో ఉండి ఉంటే, కొన్నాళ్ళో, కొన్ని నెలలో అనుకోవచ్చు. అమెరికా – ఓ సంవత్సరం దాకా నైనా రాకపోవచ్చు" అన్నాడు రామం కార్లో కూర్చుంటూ.

"ఇక్కడ నుండి ఓ రోజు ప్రయాణం అమెరికా" అంది సీత, రామం పక్కనే కార్లో కూర్చుంటూ.

"ఏం చేద్దాం?" అన్నాడు రామం.

"ఇంటికి వెళ్దాం" అంది సీత.

"బేబీ లేని ఇంటికి వెళ్ళాలంటే భయంగా ఉంది" అన్నాడు రామం కారుని స్టార్ట్ చేస్తూ.

"ఎవరైనా, ఎప్పటికైనా చేరుకోవాల్సింది వాళ్ళింటికేగా" అంది సీత.

రామం కారుని నడుపుతూ–

"వెళ్ళిపోతూ కూడా బాధపడలేదు బేబీ" అన్నాడు

"నిన్న మీతో అన్నాను. అది అలా వెళ్ళడం మీకు అర్థం కాదని" అంది సీత.

"ఏంటి సీతా నువ్వనేది – తొమ్మిది నెలలు మోసి కన్నావు నువ్వు దాన్ని – అది పసిపిల్లగా ఉన్నప్పుడు దాని అవసరాలన్నీ తీర్చావు – దాన్ని పెంచి పెద్దదాన్ని చేశావు – అలాంటి నిన్ను వదిలి వెళ్ళిపోతుంటే దానికి బాధగా ఉండదూ? మనల్ని వదిలి



E:\ Ramaneeyam\ Ramaneeyam 33

వెళ్ళిపోతున్నట్లే అనిపించదా దానికి?" అని రామం అంటుంటే, సీత మాట్లాడకుండా కారు సీటుకి తల ఆనించి, కళ్ళు మూసుకుని కూర్చుంది.

సీత చేతిని తన చేతిలోకి తీసుకోబోతున్న రామంతో, "నేనేం బాధపడడం లేదు" అంది సీత.

"మరి అలా కళ్ళు మూసుకుని కూర్చుంటావెందుకు?ఏదన్నా మాట్లాడు" అన్నాడు రామం సీత నిశ్శబ్దాన్ని సహించలేనట్లు.

సీత మాట్లాడసాగింది.

"మనం దాన్ని విమానం ఎక్కించడానికి వస్తున్నప్పుడే చెప్పిందది – ఏడవడాని కయితే ఎయిర్‌పోర్ట్‌కి రావద్దని. మనం విన్లేదు. దాన్ని పంపించేటప్పుడు మనమింత బాధపడతామని తెలియదా మనకు? తెలుసు. తెలిసే వచ్చాం. అది ప్రయాణం హడావిడిలో ఉంది. దాని ధ్యాసంతా ఒక్కదానిమీదే – సుందర్‌తో కలిసి ప్రయాణం చెయ్యడం మీదే. దాని మనస్సులో మరో భావం లేదు"

సీత కళ్ళు మూసుకుని మాట్లాడుతోంది. తన పక్కనుండి వస్తున్న ఆ మాటలు ఎంతో దూరాన్నుండి వస్తున్నట్లు గంభీరంగా, మృదువుగా వినిపిస్తున్నాయి రామానికి. సీత చెప్తున్నది మంత్రముగ్ధుడిలా వింటున్నాడు రామం.

"బేబీకి మనమంటే ఇష్టం లేక కాదు. మనం దాన్ని పెంచడం దానికి గుర్తు లేక కాదు. అయితే దాని మనస్సుకి రెక్కలొచ్చాయి. రెక్కలొచ్చిన పక్షి ఎగిరిపోవడం సహజం.

పెళ్ళి చేసుకోవడం, మొగుడితో కొత్త గూటికి చేరుకోవడం ఆడపిల్లలకి ఎంతో సహజంగా, సామాన్యంగా జరిగిపోతాయి. ఆ సమయంలో అమ్మా నాన్నల్ని వదిలి వెళ్ళిపోతున్నామన్న బెంగ వాళ్ళని కృంగతియ్యదు. కొత్త చోటులో ఎలా ఉంటుందో నన్న భయం వాళ్ళని భయపెట్టదు.

"ఆ స్థితిని వర్ణించడం కష్టం – దాన్ని అనుభవించాల్సిందే – అది మీ అనుభవం లోకి రాదు –

"ఆడవాళ్ళకి కొన్ని దురదృష్టాలతో పాటు కొన్ని అదృష్టాలను కూడా ఇచ్చాడు సృష్టికర్త. పుట్టబోయే పాపాయి కదలికల్ని అనుభవించగలరు ఆడవాళ్ళు. భర్తతో కొత్తగూటికి చేరుకునే అనుభవమూ వాళ్ళదే. ఆ గూటి మీద ప్రేమ పెంచుకుని, దాన్ని స్వంతం చేసుకుని, ఆ గూటి నుండి ఎగిరిపోబోయే పిల్లల్ని కనగలరు – పెంచగలరు"

పెళ్ళి కాక ముందు మరదలూ, తర్వాత భార్యా, అయిన సీత – కృష్ణుడిలా



E:\
Ramaneeyam\
Ramaneeyam
34



జీవిత సారాన్ని బోధిస్తోంటే – అర్జునుడిలా వింటున్నాడు రామం.

వింటున్న రామం కళ్ళకి సుందర్ చేతుల్లో చేతులుంచుకుని ఎయిర్‌పోర్టులోకి వెళ్తున్న బేబీ కనిపిస్తోంది. బేబీ కళ్ళు కనిపిస్తున్నాయి. ఆ కళ్ళలో మెరుపు కనిపిస్తుంది.

గమ్యం చేరిన తృప్తితో మెరుస్తున్న కళ్ళవి. జీవితాంతం ఉండేందుకు తోడు దొరికిందన్న ఆనందంతో మెరుస్తున్న కళ్ళవి.

ఆ మెరుపుని అంతకు ముందు చూశాడు రామం. పాతికేళ్ళ క్రితం సీత కళ్ళలో అదే మెరుపు కనిపించింది. ఈ రోజు బేబీ కళ్ళలో ఆ మెరుపే కనిపించింది. సీత తనతో వచ్చేసింది. బేబీ సుందర్‌తో వెళ్ళిపోయింది.

రామానికి ఏదో అర్థమైనట్లనిపించింది.

❋ ❋ ❋

"మేం బానే ఉన్నామమ్మా – మా కోసం నువ్వేం బాధపడకు – నిన్న నువ్వు వెళ్ళిపోతోంటే ఏడుపు వచ్చింది – అంతే – ఇప్పుడు ధైర్యంగా ఉన్నాం – నాన్నగారితో ఇంకా ఏదన్నా మాట్లాడాలా – ఏం లేదా – అయితే ఫోన్ పెట్టెయ్యనా? అలవాటయే వరకూ రెండు మూడు రోజులకోసారయినా ఫోన్ చేస్తుండు – బై" అంటూ సీత ఫోన్ పెట్టెయ్యగానే –

"దానికక్కడ బావుందిట. చుట్టుపక్కల కొందరు ఇండియన్స్ ఉన్నారుట. దగ్గర్లోనే దాని ఫ్రెండ్ ఉందిట" అని ఉత్సాహంగా చెప్పాడు రామం.

"ప్రయాణమంతా హాయిగా అయిపోయిందిట. మధ్యలో లండన్ కూడా చూసిందిట. సుందర్ దారి పొడుగునా దాన్ని బాగా చూసుకున్నాడట" అంది సీత.

"పాతికేళ్ళ క్రితం నువ్వు నాతో రైల్లో వచ్చేశావు. ఇప్పుడు బేబీ విమానంలో సుందర్‌తో వెళ్ళిపోయింది" అన్నాడు రామం.

"అవును. అప్పుడు మీరు నన్ను బాగా చూసుకున్నారు...." అంది సీత.

"ఇప్పుడు నువ్వు నన్ను చూసుకుంటున్నావు" అన్నాడు రామం.

సోఫాలో కూర్చున్న రామం ముందు నేల మీద కూర్చుని, అతని ఒళ్ళో తల పెట్టుకుని –

"దాని పెళ్ళి రోజూ, నా పెళ్ళి రోజూ ఒక్కరోజే. నాకు దొరికినట్లే – దానికీ ఓ రాముడు దొరకాలని, రాముణ్ణి కోరుకుంటున్నాను. దాని జీవితమూ – నా జీవితంలా సుఖంగా సాగిపోవాలి" అంది సీత.

"సీతా!' అన్నాడు రామం సీత జడని తన పెదవులకు తాకించుకుంటూ.

"ఊఁ" అంది సీత తనకి మాత్రం సాధ్యమయ్యేలా.

"బేబీ లేదని బాధపడుతున్నావా?" అని అడిగాడు రామం.

"బాధగా ఉంది. ఆనందంగా కూడా ఉంది. ఇది మధురమైన బాధ. బావుంది" అంది సీత.

"బావుంటే?" – అని అడిగాడు రామం.

"పెళ్ళాడచ్చు" అంది సీత నవ్వుతూ.

"అది పెళ్ళికి ముందు – ఆ తర్వాత?" అన్నాడు రామం.

"ఇదిగో – ఇలా కూర్చోవచ్చు" అంది సీత.

"ఎంత దూరం వచ్చాం సీతా!" అన్నాడు రామం.

"నాలుగో అంకంలోకి" అంది సీత.

"నాలుగో అంకమా?" అని అడిగాడు రామం.

"పెళ్ళికి ముందుది మొదటి అంకం. పెళ్ళయినప్పట్నుంచీ పిల్లలు పుట్టేదాకా రెండో అంకం. పిల్లల్ని పెంచి పెద్ద చెయ్యడం మూడో అంకం. వాళ్ళకి పెళ్ళిళ్ళు చేసి పంపించేశాక – ఇదిగో – ఇది నాలుగో అంకం" అంది సీత.

"మన జీవన నాటకంలోనా?" అన్నాడు రామం.

"మనదైనా – మరెవరిదైనా అంతే" అంది సీత.

"ఇంక మనిద్దరమే ఒకరికొకరం" అన్నాడు సీతని ఒళ్ళో ఇంకా దగ్గరకి లాక్కుంటూ రామం.

"మనవడో, మనవరాలో పుట్టేదాకా" అంది.

"బేబీ పురిటికి అమెరికా వెళ్ళాలి నువ్వు" అన్నాడు రామం.

"నేనా? అమెరికాకా?" అంది సీత.

"మరి, బేబీ పురిటికి ఇక్కడకి వస్తుందేమిటి?" అన్నాడు రామం.

"అయితే, నేనొక్కదాన్నే వెళ్ళాలా?" అంది సీత, రామాన్నే చూస్తూ.

"నీ వెనకే నేనూను" అన్నాడు రామం.

"నా వెనుక మీరా? మీ వెనుక నేనా?" అని అడిగింది సీత.

"నీ వెనుక నేనూ కాదు. నా వెనుక నువ్వూ కాదు. నీతో నేను, నాతో నువ్వు. ఇద్దరం కలిసి" అన్నాడు రామం.

"అయినా ఏం చెప్పగలం – బేబీ డెలివరీకి ఇక్కడికే వస్తుందేమో – చాల రోజులైంది డాబా మీద కూర్చుని – పైకి వెళ్దామా?" అని అంటూ లేచి నడవసాగింది సీత.

సీతతో పాటే కదిలింది సీత జడ.

దాంతో పాటే –

❋



E:\
Ramaneeyam\
Ramaneeyam
35



'రచన' మాసపత్రిక – నవంబర్, 2005

# అవునా?

ఓ రాత్రి –

"ఈ రోజే ఆఖరు రోజు. రేపట్నుంచి ఇంక దీంతో పనుండదు" అన్నాడు రామం అలారం సెట్ చేస్తూ.

"అవునా?" అని అడిగింది సీత.

సీత అలా 'అవునా?' అని అనడం ప్రశ్నలా కాక 'నువ్వు అవుననుకుంటున్నావు – కానీ – అది అవును కాదు – కాదు' అని అన్నట్టు ఉంటుంది. అందులోని ధ్వనీ, వ్యంగ్యం రామానికి వినిపిస్తుంది కూడా. ఐనా అవేం పట్టించుకోకుండా –

సీత 'అవునా' అని అనడంలోని అందాన్నీ – 'అవునా' అని అంటూ సీత నవ్విన నవ్వునీ – నవ్వుతూ సీత వెనక్కి తోసుకున్న జడనీ చూస్తుండిపోయాడు.

"రిటైరైపోతోంటే అందరూ బాధ పడతా రనుకున్నాను. మీరేంటో చిన్న పిల్లలు వేసవి సెలవులొస్తోంటే ఎంత సంబరపడి పోతారో అంతకన్న ఎక్కువ సంతోష పడి పోతున్నారు" అంది సీత పక్క మీద ఒక పక్కకి జరుగుతూ.

"నేనొక్కడినే రిటైరౌతోంటే అలానే అనుకునే వాడినేమో. నాతో పాటు నువ్వూ రిటైరై పోతున్నావుగా. ఇంక జీవితమంతా ఇద్దరం హాయిగా గడిపెయ్యచ్చు. ఐనా చిన్న పిల్లలకి వేసవి సెలవులెన్నాళ్ళుంటాయి – రెండూ – మహా ఐతే మూడూ – నెలలు. మరి మనకో – ఇంక జీవితమంతా సెలవే" అన్నాడు సీత ఖాళీ చేసిన పక్క

– పక్క మీద వాలుతూ, రామం.

"అవునా?" అంది సీత మళ్ళీ, ఇందాక అన్నట్లే.

"నా సంగతి సరే – రిటైరైపోతున్నందుకు నీకెలా ఉంది?" అని అడిగాడు రామం.

"నేను రిటైరవడం లేదుగా – రిజైన్ చేస్తున్నానుగా–"

"ఏ రాయైతేనేం కానీ – నువ్వూ ఎల్లుండి నుండి ఆఫీసుకి వెళ్ళవు. నాది వాళ్ళు చేసే రిటైర్మెంటైతే నీది వాలంటరీ – అంతేగా?"

"నేను స్వయంగా స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్నాను. అంటే నాకు నచ్చే కదా?"

"నేను రిటైరౌతున్నాను కదాని నువ్వు కూడా ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నావు కదూ?"

"అవునేమో–" అంది సీత నవ్వుతూ. నవ్వుతూ అంటే అంతకు ముందు సీత నవ్వడం లేదని కాదు. సీత మొహమూ, కళ్ళూ ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాయి. ఐతే నవ్వాల్సి వచ్చి సీత నవ్వినప్పుడు ఆ నవ్వు నవ్వు పైన నవ్వులా ఉంటుంది. అది పన్ను మీద పన్నులా అందంగా ఉంటుంది.

"నువ్వు నా కోసం ఇలా చేస్తోంటే నాకు –" అని రామం అంటూండగానే మధ్యలో ఆపేసి – "ఆనందంగా ఉంటుంది" అంది సీత.

"అలా అంటావేంటి సీతా – నా కోసం నువ్విలా చేస్తోంటో నాకు బాధగా ఉంది".

"మూడు నెలల క్రితం 'మీరు రిటైరౌతున్న రోజే నేనూ రిటైరౌతున్నాను' అని నేను అన్నప్పుడు 'ఎందుకు సీతా నువ్వు మానెయ్యడం' – అని నోటితో అంటూ కళ్ళతో ఆనందపడిపోలేదూ మీరు?"

"అలా అంటావేంటి సీతా?"

"ఇంక ఆ విషయం వదిలెయ్యండి. రేపు పొద్దున్న మనం మా ఆఫీస్‌కి వెళ్ళాలి – గుర్తుందా?"

"ఆఁ అక్కడ మీ కొలీగ్స్ మనకి ఫేర్వెల్ పార్టీ ఇస్తున్నారుగా – అది అవగానే నేను మా ఆఫీసుకి వెళ్ళిపోతాను. నువ్వు సాయంత్రం మా ఆఫీస్‌కి వచ్చెయ్యి. అక్కడ మా వాళ్ళు ఇచ్చే ఫేర్వెల్ పార్టీ –"

"మా వాళ్ళూ ముందు సాయంత్రమనే అన్నారు. నేనే చెప్పాను. మీ ఫేర్వెల్ పార్టీకి నేను సాయంత్రం మీ ఆఫీసుకి వెళ్తానని. నేను లేకుండా మీరు రిటైర్మెంట్ పార్టీ తీసుకోరని చెప్పాను. నిజమే కదా?" అంది సీత రామానికి దగ్గరగా జరుగుతూ.



E:\ Ramaneeyam\ Ramaneeyam 36



"నిజాలలోకెల్ల నిజం. నువ్వు రాలేకపోతోంటే నేను అసలు పార్టీయే వద్దని చెప్పేసి ఉండేవాడిని" అన్నాడు రామం సీతని దగ్గరగా తీసుకుంటూ.

"నేనూ అదే చెప్పాను" అంది సీత.

"ఇంతకీ నేను రావడం నీకు ఇష్టమేనా? లేక....." అంటూ ఆగాడు రామం.


"నేనేం చెప్పను–" అంది సీత తన తలని రామం గుండెల మీద పెట్టుకుంటూ.

"నీకేం అనిపిస్తే అది చెప్పు" అని అన్నాడు రామం సీత జడతో ఆడుకుంటూ.

"నేనేం అనుకుంటానో మీకు తెలియదా?"

సీత అలా అంటున్నప్పుడు రామానికి తెలియకుండా రామం కళ్ళు తడి అయ్యాయి. అదేసమయంలో గుండెల మీద వెచ్చగా తడి తగిలింది. సీత మొహాన్ని రెండు చేతులతోనూ ఎత్తాడు. సీత రెండు కళ్ళలోనూ తడి. రామం కళ్ళలో ఉబికిన తడే. ప్రేమ తడి.

ఆతడే –



ఇద్దరి గుండెల్లోనూ ఆనందంగా స్రవిస్తోంది – ఇద్దరి కళ్ళలోనూ ఆర్తితో ద్రవిస్తోంది.

అదే – వాళ్ళని ఇన్నేళ్ళుగా – ఒకరికొకరుగా – ఒకరిగా చేస్తోంది.

❁ ❁ ❁

మర్నాటి రాత్రి –

"మీరిచ్చిన ఫేర్వెల్ స్పీచ్ వింటోంటే నాకు ఏడుపొచ్చింది."

"నీ స్పీచ్ వింటున్నప్పుడు నాకూ ఏడుపొచ్చింది."

"మీరిలా నన్ను పొగిడేస్తోంటే – నా వల్లే ఇన్నాళ్ళూ మీరు సుఖంగా ఉద్యోగం చెయ్యగలిగానని చెప్తోంటే–"

"నాకూ అంతే – నేనే లేకపోతే నువ్వు ఉద్యోగమే చెయ్యగలిగే దానివి కాదని నువ్వు చెప్తోంటే–"

"అది నిజం. నిజంగా నిజం."

"నేను చెప్పిందీ నిజమే."

"సర్లేండి. మనం ఇలా మాట్లాడుకుంటూ ఉంటే పరస్పర డబ్బాలా ఉంటుంది."

"అవును – మనం ఒకరినొకరం పొగుడుకోవడం – ఒకరికొకరం థాంక్స్ చెప్పుకోవడం – సిల్లీగా ఉంటుంది."

"నలుగురి మధ్యా నిలబడినప్పుడు తెలియకుండా చెప్పేసుకున్నాం. అది సరే – మీ వాళ్ళూ, మా వాళ్ళూ ఇద్దరూ మనకి ఒక రకం గిఫ్టే ఇచ్చారే–"

"వాళ్ళు ఏం కావాలని అడిగారు. నేను చెప్పనన్నాను".

"నేనూ అదే అన్నాను. ఏం కావాలో మనం ఏం అడుగుతాం?"

"చెప్పేవాళ్ళూ ఉన్నారు. ఒక విధంగా అది మంచిది కూడా. ఉన్న వస్తువో – అక్కర్లేని వస్తువో రాదు."

"ఇచ్చిన వాళ్ళకీ, వాళ్ళు ఇచ్చిన వస్తువు మనకి ఉపయోగపడుతుంది కదా అన్న తృప్తి ఉంటుంది."

"ఇద్దరికీ సీతారాముల విగ్రహాలే వచ్చాయి – మీకు వెండివీ – నాకు పాలరాయివీ".

"మీ వాళ్ళకీ – మా వాళ్ళకీ – ఇద్దరికీ – ఒక్కలాంటివే ఇవ్వాలని ఎందుకు అనిపించిందంటావు?"

"మనం సీతారాములం అని అనిపించిందేమో వాళ్ళకి – ఇద్దరికీ అనిపించడంలోనే ఉంది వింత."



E:\
Ramaneeyam\
Ramaneeyam
37



"నన్ను ఆఫీసులో అందరూ అదే అంటారు – శ్రీరామచంద్రుడి లాంటి వాడిననీ – అలా ఆఫీస్ అవగానే ఇలా నీ దగ్గరకి వచ్చేస్తాననీ."

"నాకూ అదే పేరు– వాళ్ళతో కలిసి సినిమాకో, షాపింగ్‌కో రానని".

"మనమే సీతారాములం" అని రామం అంటోంటే –

"విడిపోని సీతారాములం" – అంది సీత.

"నన్ను వదిలి నువ్వు వెళ్ళిపోవన్నమాట – అమ్మయ్య" అన్నాడు రామం.

"సీత వెళ్ళిపోలేదు – రాముడే"– అంటూ ఆగింది సీత.

"ఆ రాముడు సీతని వదిలి ఉండగలిగాడు. ఈ రాముడు –" అంటు ఆగిపోయాడు రామం.

"ఇంక పడుక్కుందాం" అంటూ లేచింది సీత.

"లైటాపెయ్యి" అన్నాడు రామం.

"అలారం ఆరింటికి పెట్టీ–" అని సీత అంటోంటే–

"ఈ రోజు నుంచీ అలారం అక్కరలేదు సీతా – మరిచిపోయావు చూసావా–" అన్నాడు రామం నవ్వేస్తూ.

ఐనా సీత అలారం సెట్ చెయ్య సాగింది.

"ఏంటది సీతా – వద్దన్నా ఆ పనే చేస్తున్నావు. రేపట్నుంచీ ఒక టైంకి లేవాలని లేదు. ఓ సమయానికే తిండి తినాలని లేదు. రాత్రి తొందరగా పడుక్కోవాలని లేదు."

"మనిష్టం వచ్చినట్లు మనం ఉండచ్చు కదూ?" అంది సీత.

"అవును. నువ్వు ఇన్నాళ్ళు ఆఫీస్ పనీ, ఇంటిపనీ చేసి అలిసిపోయావు. విశ్రాంతి తీసుకో. మనం ఇద్దరమేగా? ఎప్పుడేం కావల్సి వస్తే అది చేసుకోవచ్చు. అక్కర్లేకపోతే మానెయ్యచ్చు. ఎంత హాయి ఈ రిటైర్మెంట్?" అని రామం అంటోంటే –

"అవునా?" అని అంది సీత.

అదేమాట. అదే నవ్వు. అదే జడ విసురు. అదే ధ్వని. అదే వ్యంగ్యం.

"అవునూ" అన్నాడు రామం అనుమానంగా.

"పడుక్కోండి – రేప్పొద్దున్నే ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాలి".

"ఎందుకూ?"

"రేపు పొద్దున్న అమ్మాయి వస్తోంది."

"ఎందుకూ?"

"మన దగ్గర ఆరేడు నెలలైనా ఉంటుంది."

"ఎందుకూ?"

"ఎందుకేంటి ఎందుకు? అమ్మాయి వస్తోందీ – కొన్ని నెలలు ఉంటుందీ అంటే ఆనందించకుండా ఎందుకూ అని అడుగుతారేంటీ?"

"హఠాత్తుగా వస్తోందెందుకు?"

"హఠాత్తుగా ఏం కాదు, కొంతకాలంగా అనుకుంటున్నదే."

"నాకు తెలియదే – ఇంతకీ ఎందుకు – అమ్మాయీ, అల్లుడూ సుఖంగా–"

"మీ కన్నీ అలాంటి ఆలోచనలే – అమ్మాయి కడుపులో–"

"ఆ – అమ్మాయి కడుపులో ఏమైంది?"

"అంత కంగారెందుకు – అమ్మాయి కడుపులో – మీరో, నేనో".

ముందు కాస్సేపు రామం సీత వైపు అర్థం కానట్లు చూసాడు. ఆ తర్వాత కాస్సేపు ఆనందంగా చూసాడు. అదీ అయ్యాక బాధగా చూసాడు.

"ముందుగానే మీకెందుకు చెప్పలేదనా బాధ?" అని అడిగింది సీత.

అవునన్నట్లు తలూపాడు రామం.

"మీ సంగతి నాకూ అమ్మాయికీ బాగా తెలుసు. చెప్పినప్పట్నుంచీ మీరు కంగారు పడి మమ్మల్నీ కంగారు పెట్టేస్తారు. రిటైరవడానికి ముందెందుకు – రిటైరయ్యాక ఐతే తీరిగ్గా ఉంటారని–"

"అమ్మాయి విమానంలో ప్రయాణం చెయ్యచ్చా?"

"చూసారా – మీ ధోరణి. మాకేదన్నా అయిపోతుందేమోనని నిరంతరం మథన పడుతూనే వుంటారు. అందుకే–"

"ఇంతకీ నువ్వు ఈ రోజే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోడానికి కారణం–"

"మనం ఇద్దరం ఒకే రోజు రిటైర్ అవు తామనే – ఐతే ఇది కూడా కలిసొచ్చింది."

"ఇంతకూ మనం రిటైర్ అవుతున్నట్లా లేదా?"

"మీకు కావల్సినట్లు మనం ఇద్దరమే ఒకరినొకరం చూసుకుంటూ కాలక్షేపం చేసుకునే రిటైర్మెంట్ ఐతే – మనం రిటైర్ అవడం లేదు."

"అంటే ఉద్యోగంలో మార్పొచ్చిందన్న మాట. ముందుగా అమ్మాయిని చూసుకునే ఉద్యోగం – ఆ తర్వాత–"

"ఊఁ – ఆ తర్వాత?"

"మనవణ్ణో – మనవరాలినో – చూసుకునే ఉద్యోగం."

"మీకెవరు కావాలేం?"

"తెలీదు – ఎవరైనా ఆనందమే – ఏదైనా మనది రిటైర్మెంట్లా లేదు – ప్రొమోషన్లా



E:\
Ramaneeyam\
Ramaneeyam
38



ఉంది."

"అవునా?" అంటూ నవ్వింది సీత.

సీతతో పాటే సీత కళ్ళూ, వాటితో పాటే సీత జడా.

❁ ❁ ❁

ఇంకొన్నాళ్ళ తర్వాత ఇంకో రాత్రి –

"పిల్ల రేపెళ్ళి పోతుందా?" అన్నాడు రామం బెంగగా.

"తీసికెళ్ళడానికేగా అల్లుడొచ్చింది?" అంది ఇంకేమనాలో తెలియదన్నట్లు సీత.

"అంటే – మనవరాలు కూడా –" ఇంక మాట్లాడలేక ఆపేసాడు రామం.

"అంతేగా మరి–" అంది సీత. అలా అంటున్న సీత గొంతు వణికింది.

"ఉంచమంటే–" అన్నాడు రామం.

"ఎవరిని?"

"అల్లుడినే – అమ్మాయినీ, మనవరాలినీ మన దగ్గర ఇంకొన్నాళ్ళు ఉంచమని అడిగితే?"

"ఎందుకుంచుతాడు?"

"పోనీ – మనవరాలిని ఉంచెయ్య మంటే–" అన్నాడు రామం ఉత్సాహంగా.

"ఏంటా వెర్రి? వాళ్ళ పిల్లని మన దగ్గరెందుకుంచుతారు?"

"అదేం మాట సీతా? వాళ్ళ పిల్లేంటి? ఆ పిల్లని పేరుకి కన్నది మన అమ్మాయే ఐనా – కనిపించిందీ, ఈ ఆరు నెల్లూ పెంచిందీ నువ్వే కదా?"

"అవునా?"

"కాదా? అమ్మాయికి సిజేరియన్ అవడంతో తన తిన్న తను లేవలేకపోతోంటే – అమ్మాయికీ, మనవరాలికీ ఒకే చేత్తో అన్నీ చేసింది నువ్వు కాదూ? నీకేం ఓపిక ఎక్కువగా ఉందా? ఇందుకోసమే నువ్వు ఉద్యోగం కూడా మానేసావు. అలాంట ప్పుడు మనవరాలు నీ పిల్ల కాకుండా ఎలా?"

తన దగ్గర రామం అలా ఆవేశంగా మాట్లాడ్డం సీతకి కొత్త.

"ఎందుకంత ఆవేశం? ఎవరి మీద కోపం? మన అమ్మాయి మీదేనా?" అంది.

"డెలివరీకని ఇక్కడికి పంపించేసాడు – చూసుకున్నదంతా మనమే కదా – పిల్ల పుట్టిందని తెలియచెయ్యగానే రెక్కలు కట్టుకుని వచ్చేసాడు – తన భార్యకీ – తన పిల్లకీ – ఇలా చెయ్యాలీ – అలా చెయ్యాలీ అని ఆర్డర్లివ్వడానికి – తనేం సాయం చేసాడు? ఇంతా చేసి పిల్లని తనతోపాటు తీసికెళ్ళిపోతున్నాడు–"

"మీరు మనవరాలిని వదిలి ఉండాలన్న ఆవేదనలో అర్థం లేకుండా మాట్లాడుతు

న్నారు. మన పిల్ల మనకి సాయం చెయ్యాలనే అనుకుటుంది కానీ మన చేత చేయించుకోవాలనుకోదు. మన అల్లుడూ అలాంటి వాడు కాదు. చేతనైన సాయం చేస్తాడే కానీ మనల్ని కష్టపెట్టాలని అనుకోడు. ఐనా మనం ఎవరికి చేసాం? మన పిల్లకీ, మన మనవరాలికే కదా?"

"ఆ చిన్నపిల్లని చూడకుండా నేనుండలే ననిపిస్తోంది సీతా" అని బాధగా అంటున్న రామాన్ని చూస్తోంటే సీతకి జాలి కలిగింది.

ఆఫీసులో ఎన్నిప్రమోషన్‌లు వచ్చాయి? ఎంత మంచి పేరొచ్చింది? అక్కడ చక్కగా పనులు చేసేసుకోగలిగినవాడు – పిల్లల దగ్గరికి వచ్చేటప్పటికి ఎలా అయిపోతాడు. ఇప్పుడు మనవరాలి దగ్గర ఐతే మరీ బేల అయిపోతున్నాడు.

"దాని బుల్లి బుల్లి చేతులూ, కాళ్ళూ – దాని బూరి బుగ్గలూ, బోసి నోరూ – ఆ కూతలూ – నవ్వులూ – కేరింతలూ–"

"నాకు లేదూ ఆ బాధ?"

"లేదన్నానా? అందుకే మన దగ్గర ఉంచమని అడుగుదామని అంటున్నాను."

"మిమ్మల్ని ఎవరైనా అడిగి ఉంటే మీరు ఏం చేసి ఉండేవారు?"

ఆ ప్రశ్న రామం ఊహించనిది. అది ఎక్కడో బలంగా తగిలింది.

"మావయ్య – అడగలేదు కదా" అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

"నేనడిగింది – అడిగి ఉంటే మీరు ఏం చేసుండేవారు అని?"

"తెలియదు."

"తెలుసు. వద్దని ఉండేవారు. నాకు బాగా గుర్తుంది. మా అక్క డెలివరీ మా ఇంట్లోనే అయింది. ఆ పిల్లని మేం మా పిల్లగానే అనుకున్నాం. మా బావ వచ్చి పిల్లని దగ్గరకి తీసుకుంటే – మా పిల్లని తను లాగేసుకున్నాడని బాధపడ్డాను నేను. మమ్మల్ని సంప్రదించకుండా తనే పేరు పెడితే తల్లడిల్లిపోయాను. పిల్లకి మూడు నెల్లు రాకుండా తీసికెళ్ళిపోతోంటే మా నాన్న ఇలానే బాధపడ్డాడు. నాకైతే కోపం కూడా వచ్చింది. తర్వాతేమయ్యింది. మనమూ అదే చేసాం. అప్పుడు మనకి ఏమీ అనిపించలేదు. ఇప్పుడు ఇలా అవుతోంటే మనకి బాధ తెలుస్తోంది. అవునా?"

సీత 'అవునా' అని అనడంలో అంతకు ముందులా వ్యంగ్యం వినిపించలేదు – బాధే కానీ. సీత కళ్ళలో నవ్వు కనిపించలేదు – కన్నీటి చారే కానీ.

సీత మనోభావాల్ని అర్థం చేసుకున్నట్లు సీత జడ కదలకుండా ఒద్దికగా సీత ఒడిలో ఉండిపోయింది.

ఆ ఒడిలోకే తల దూర్చాడు రామం. ❁



E:\
Ramaneeyam\
Ramaneeyam
39



'అన్వేషణ' వారపత్రిక – జనవరి 9, 1996

# అలిగిన వేళ

సీతకి రామం స్వంతం.

రామానికి సీత స్వంతం.

వాళ్ళిద్దరికీ ఆ ఇల్లు స్వంతం.

అందంగా పెంచబడ్డ చెట్లూ, మొక్కలతో నిండి ఉన్న పెద్ద స్థలం మధ్య పొందిగ్గా తీర్చిదిద్దబడిన చిన్న ఇల్లది.

ఆ ఇంటి డాబా మీదకి, మెట్ల మీదగా పాకించబడిన సన్నజాజి తీగకి పూసిన పువ్వుల వాసన –

డాబా మీద కూర్చున్న రామం ముక్కుకీ –

పడగ్గదిలో కిటికీ పక్కన కూర్చున్న సీత నాసికకీ –

ఒకేలా తగులుతోంది.

అలానే వెన్నెల కూడా వాళ్ళిద్దరికీ ఒకేలా కనిపిస్తోంది.

అలాంటి ఆహ్లాదకరమైన వెన్నెల రాత్రులలో – వాళ్ళిద్దరూ అలా విడిగా ఉండడం అదే మొదటిసారి.

అసలు వాళ్ళు విడిగా ఎప్పుడూ ఉండరు. అలాంటది – వాళ్ళ పెళ్ళి రోజున, వాళ్ళిద్దరూ అలా విడిగా ఉండడం – ఆ ఇంట్లోని మొక్కలకీ, చెట్లకే కాక, ఆకాశంలోని చంద్రుడికి కూడా కొత్తగా, వింతగా ఉంది.

సాయంత్రం సీత గుడికి వెళ్ళి వచ్చేవరకూ, ఇద్దరూ కులాసాగా, ఆనందంగా గడిపారు.

ఉదయం –

సీతకి ఇష్టమని, సీత కోసం, రామం చేసిన పాయసం, రామం తినిపిస్తే తింది సీత.

మధ్యాహ్నం–

తమ స్థలంలో ఉన్న మామిడి చెట్టు పండు కోసి, తొక్కలు తీసి, చిన్న ముక్కలు చేసి, రామానికి తినిపించింది సీత.

ఆ చెట్టుని నాటింది సీతే! ఒక్క ఆ చెట్టునే కాదు – ఇంటిలోని మొక్కలన్నీ సీత నాటినవే!! వాటికి నీళ్ళు పోసి పెంచుతున్నది వాళ్ళిద్దరే!!!

సాయంత్రం –

మల్లెమొగ్గలు కోసి, దండ కట్టి, సీత జళ్ళో పెట్టబోతూ నవ్వాడు రామం.

“నవ్వకండి – రాత్రి నేను వచ్చేవరకూ ఆగండి” అని అంటూ ఆ దండను రామం దగ్గర నుండి తీసేసుకుంది సీత. తీసుకుని, “గుడికి వెళ్ళివస్తాను” అంటూ బయల్దేరింది.

అంతకు ముందటి అన్ని పెళ్ళి రోజులలానే – ఆ రోజు కూడా – రామం కొన్న చీర కట్టుకుంది సీత.

జరీ చుక్కలు ఉన్న ముదురు నీలం రంగు పట్టుచీర, మెరిసే నక్షత్రాలు నిండి వున్న ఆకాశంలా ఉంది.

ఆ చీరలో సీతను చూసి, ‘సీత మొహమే చంద్రుడు’ అని అనుకుని తృప్తిగా నవ్వుకున్నాడు రామం.

గుడి నుండి సీత తిరిగి రావడం కోసం రామం ఎదురు చూస్తూండగా వచ్చింది ఎదురింటి సుందరి.

సుందరి పేరుకే కాదు. రూపానికి కూడా సుందరే!

అందంగా ఉన్న సుందరి, ఆకర్షణీయంగా తయారవుతుంది.





E:\
Ramanee
Ramanee
40



ఆ రోజు తను వేసుకున్న ఎర్ర రంగు డ్రెస్‌కి మేచింగ్‌గా, విరబోసుకున్న తన జుట్టులోకి, ఎర్రరంగు పువ్వు పెట్టుకుందామని వచ్చింది సుందరి.

ఒక పక్క నిండుగా విచ్చుకున్న ఎర్రరంగు రోజా పువ్వుని చూసి – “ఎంత బావుందో” అని గొంతులోనూ, మొహంలోనూ ఆనందాన్ని వ్యక్తం చేసి, “అది కోసుకుంటాను” అని – దాన్ని కోసుకుని, తల్లో పెట్టుకుని, “థాంక్స్” అని అంటూ బయటికి నడిచింది సుందరి.

ఏమనాలో తెలియక నవ్వాడు రామం.

సరిగ్గా ఆ సమయానికే గుడి నుండి తిరిగి ఇంటికి వస్తున్న సీత కళ్ళల్లో పడ్డాయి – సుందరి జడలోని పువ్వూ, రామం మొహంలోని నవ్వూ.

వెంటనే రోజా మొక్కని చూసింది.

తను వెళ్ళేటప్పుడు ఎర్రగా, అందంగా పూసిన పువ్వుతో వున్న మొక్క వెల వెల పోతోంది.

ఆ మొక్కని కొన్నాళ్ళ క్రితం ఎవరి దగ్గరో అడిగి తీసుకువచ్చి నాటింది సీత. దాన్ని జాగ్రత్తగా చూసుకుంటోంది. కొన్ని రోజుల క్రితం మొగ్గ వేసిందది. ఈ రోజుకి పువ్వు అందంగా తయారయింది.

పువ్వులేని మొక్క సీతని వెక్కిరించినట్లయింది.

అలా అవుతుందని సీత ఊహించలేదు.

రామం వైపు ఒక్కసారి కోపంగా చూసి, ఇంట్లోకి చరచరా నడుచుకుంటూ వెళ్ళి తలుపు వేసేసుకుంది సీత.

సీతకు కోపం రావడం ఇంతవరకూ చూళ్ళేదు రామం. సరదాకి కూడా సీత కోపం తెచ్చుకోలేదు.

ఏం చెయ్యాలో తెలియలేదు రామానికి.

పురాణ కథల్లో సత్యభామ అలుగుతుంది. ఆవిడ అలకను కృష్ణుడు తీరుస్తాడు. అలా అలకను తీర్చడంలో కృష్ణుడు ఎంతో ఆనందం అనుభవిస్తాడు.

అయితే ఆ ఆనందం అనుభవించే అవకాశం రాముడికి దక్కలేదు. పౌరాణిక సీత అలగలేదు. అలాగే ఈ సీత కూడా.

రామం తలుపు దగ్గరకెళ్ళి సీతను తలుపు తియ్యమని అడిగాడు.

సీత తియ్యలేదు.

సత్యభామ అలిగినప్పుడు, కృష్ణుడు వచ్చి అలక తీర్చేందుకు వీలుగా, తలుపులు తీసి ఉంచింది.

అయితే సీత తలుపులు మూసేసుకుంది.

మూసిన తలుపులు తెరుచుకుంటాయేమోనని, కొంతసేపు ఎదురు చూసాడు రామం.

సీత తలుపు తియ్యలేదు.

అక్కడ నిల్చుని ఏంచెయ్యాలో తెలియక, నెమ్మదిగా మెట్లెక్కి, డాబా మీద కూర్చున్నాడు రామం.

సుందరి తమ ఇంటికి వచ్చి, సీత దగ్గర పువ్వులు తీసుకోవడం కొత్త కాదు. అది ఈ రోజు మొదటిసారి జరగలేదు. అలాంటప్పుడు సుందరి పువ్వు కోసుకుంటే, సీతకి ఎందుకు కోపం వచ్చిందో అర్థం కాలేదు రామానికి.

పెళ్ళి రోజున, సీత అలా కోపగించుకుని, ఇంట్లోకి వెళ్ళి తలుపు వేసేసుకోవడం కష్టంగా అనిపించింది రామానికి. సీత వచ్చి పిలిచినా వెళ్ళకూడదనుకున్నాడు.

సరిగ్గా ఆ సమయానికే, పడగ్గదిలో కూర్చున్న సీత కూడా రామం వచ్చి మళ్ళీ పిలిచినా తలుపులు తియ్యకూడదనుకుంది. సుందరి తల్లో పువ్వుని చూసినప్పుడు వచ్చిన కోపం పోయి, ఆ స్థానంలో తన కోపానికి కారణం అడగకుండా రామం వెళ్ళిపోయాడన్న బాధ నిండుకోసాగింది.

భార్యాభర్తలలో ఎవరో ఒకరు అలగడం సహజం. అలా చాలామంది దంపతులకి,



E:\ Ramaneeyam\ Ramaneeyam 41



చాలాసార్లు జరుగుతుంది. రెండోవారు, అలిగినవారి అలకని తీరుస్తారు. ఆ తర్వాత ఇద్దరూ సంతోషంగా ఉంటారు. దాంపత్య జీవితాలలో అలకలు సన్నటి పన్నీటి జల్లులు.

అయితే రామం, సీతా ఎన్నడూ ఎరగనిది అలక.

అందుకే వాళ్ళకి అలాంటి సమయంలో ఏం చెయ్యాలో తెలియడం లేదు.

పెళ్ళినాటికి, సీతకి ఇరవై రెండేళ్ళు.

ఆ వయస్సుకి ఎంత పెరగాలో, అంతే పెరిగిన సుకుమార శరీరంతో, తెల్లని దంతం బొమ్మకి ప్రాణం వచ్చినట్లుంది సీత, పెళ్ళి పీటల మీద.

ప్రపంచంలోని సౌందర్యాన్నంతా ఒక్కచోట పోగుచేసి అందంగా తీర్చిదిద్దితే సీత అవుతుందనుకున్నాడు రామం – సీతని పెళ్ళి రోజున చూసి.

సీత సౌందర్యానికి సరిపోయే అందమే రామానిది కూడా.

అందుకే పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా, వాళ్ళని చూసి ఆనందించి, "వాళ్ళు సీతా రాములే" అని మెచ్చుకున్నారు.

వాళ్ళిద్దరూ – వాళ్ళనుకున్నట్లుగానే – ఒకరికి ఒకరుగా, ఒకరుగా అయిపోయారు.

రామానికి ఏం కావాలో చూసి చేస్తుంది సీత.

సీత అడగకుండానే సీతకి కావాల్సినవి చూస్తాడు రామం.

ఒకరిని ఒకరు ఎప్పుడూ తప్పు పట్టుకోలేదు వాళ్ళు.

సరదాకి కూడా ఒకరి మీద ఒకరికి కోపం రాలేదు.

అలాంటిది, ఈ పెళ్ళిరోజున, దూరంగా ఉన్నారు వాళ్ళు. అలా ఉండడం ఇద్దరికీ కష్టంగానే ఉంది.

'కోపగించుకుని ఇంట్లోకి వెళ్ళిపోకుండా ఉండాల్సింది' అనుకుంది సీత.

'సీతకి కోపం వచ్చిన కారణం కనుక్కుని ఉండాల్సింది' అనుకున్నాడు రామం.

'రాత్రి తొమ్మిదవుతోంది. ఆయన భోజనం వేళ' అనుకుంది సీత.

'చీకటి పడింది. కింద ఒక్కతే ఎలాగుందో' అనుకున్నాడు రామం.

'బయట ఏ చెట్టు కింద కూచున్నారో, పాపం' అని అనుకుంటూ బయటికి రావడానికి లేచింది సీత.

"కిందకి వెళ్ళి పిలుస్తాను" అని అనుకుంటూ లేచాడు రామం.

అంతవరకూ పైన కూర్చుని కోసిన జాజిపువ్వులు దోసిటలో ఉంచుకొని, డాబా అంచుకు వచ్చాడు.

అదే సమయానికి, ఆ అంచు కిందకి వచ్చింది సీత.

అప్పుడే వీచిన ఒక గాలి తెమ్మెర రామం దోసిటలోని పువ్వులని తోసుకుని తీసికెళ్ళి, సీత తల మీద జల్లుగా కురిపించింది.

హఠాత్తుగా తన మీద కురిసిన పూలవానకి పులకించి, నవ్వుతూ తలెత్తి పైకి చూసింది సీత.

పై నుండి, సీత తల మీదకి రామం చేతులు నుండి పువ్వుల వాన కురిస్తే –

కింద నుండి, రామం కళ్ళకి సీత మొహం నుంచి నవ్వుల వాన కురిసింది.

రామం ఆనందంగా నవ్వాడు.

రామాన్ని పైన చూడగానే, సీత మెట్లెక్కి పైకెళ్ళింది.

"పైకి ఎందుకు ఎక్కారు?" అని అడిగింది రామాన్ని.

"నువ్వు ఇంటి తలుపులు వేసుకుంటే నేనింక ఏం చెయ్యను?" అని అడిగాడు రామం.

రామాన్ని పొదివి పట్టుకుని, కిందకి నెమ్మదిగా నడిపించుకుంటూ తీసుకెళ్ళి, గున్నమామిడి చెట్టు కింద, తన ఒళ్ళో కూర్చోపెట్టుకుంది సీత.

రామం కళ్ళల్లో ఆనందపు పొర.

సీత కళ్ళల్లో ఆత్మీయపు తడి.

"మీ ఆరోగ్యం గురించి పట్టింపు లేదా? ఇలా పైకి ఎక్కి వెళ్ళవచ్చా?" అంది సీత.

"నువ్వు ఇంటి తలుపులు వేసుకోవచ్చా?" అని అడిగాడు రామం.

"మరి మీరు పువ్వుని సుందరికి ఇవ్వచ్చా?" అంది సీత.

"నేనివ్వలేదు" అన్నాడు రామం.

ఆ మాటలను విననట్లు అంది సీత –

"ఆ రోజా మొక్కని నేను కొన్నాళ్ళ క్రితం తీసుకొచ్చి దొడ్లో నాటింది ఎందుకో తెలుసా? అది ఎర్రని రంగు రోజా పువ్వు పూస్తుందని. ఆ పువ్వుని, నేను మీ చేతుల మీదుగా నా జుట్టులో పెట్టించుకోవచ్చుననుకున్నాను. అదృష్టం కొద్దీ, అది మన పెళ్ళిరోజు నాటికి అందంగా పువ్వయింది – దాన్ని మీరు సుందరికి ఇచ్చేసారు"

"నేనియ్యలేదు సీతా – సుందరే తీసికెళ్ళిపోయింది"

"ఆ మాట మీరు చెప్పలేదు"

"నువ్వు నన్ను అడగలేదు"

"ఇదంతా వదిలెయ్యండి. సాయంత్రం, మల్లెపువ్వుల దండ తల్లో పెట్టబోతూ ఎందుకు నవ్వారు?" అని అడిగింది సీత.



E:\
Ramaneeyam\
Ramaneeyam
42



"నీకు తెలియదా?" అన్నాడు రామం.

"నా జుట్టు నెరిసిందనేగా? నల్లగా లేదనేగా?"

"నీ జుట్టు నెరిస్తేనేం – ఇంకా ఒత్తుగా, పొడుగ్గా ఉంది. నా తల చూడు – అసలు జుట్టే లేదు"

సీత నవ్వింది. నవ్వి –

"తెల్ల జుట్టులో మల్లెపువ్వులు ఏం బావుంటాయి? అందుకే మీ చేతుల మీదుగా ఈ పెళ్ళి రోజున నా జుట్టులో ఎర్రని రోజా పువ్వు పెట్టించుకుందామనుకున్నాను. ఆ అవకాశం తప్పిపోయేసరికి, బాగా నిరుత్సాహ పడిపోయాను. ఇన్నాళ్ళ మన వివాహ జీవితంలో ఇదే మొదటిసారి" అని సీత అంటుంటే –

"అలిగావు. అవునా?" అని అడిగాడు రామం.

"అయితేనేం – మీరు అలక తీర్చలేదుగా" అంది సీత.

"నీ మీద పూల వాన కురిపించాను. అంతకన్నా ఏం చెయ్యాలి, అలక తీర్చేందుకు?" అని అడిగాడు రామం.

"అందులో రోజా పువ్వు లేదుగా"

"రోజాది ఏం ఎరుపు సీతా? అంతకన్నా ఎర్రనైనది – రాగరంజితమైనది – నా హృదయం – నా గుండె – నీ జుట్టులో పెడుతున్నాను" అని అంటూ, తన గుండెను కోసి, సీత జడలో పెడుతున్నట్లు అభినయించాడు రామం.

సిగ్గుపడింది సీత.

అరవై అయిదు ఏళ్ళు వస్తున్నా సిగ్గు వదలలేదు సీత.

అరవై అయిదు ఏళ్ళు దాటినా అమాయకత్వం వీడలేదు రామం.

ఇన్నేళ్ళుగా – ఆ ఇంట్లోని మొక్కలని పెంచుతున్నట్లు – వాళ్ళిద్దరూ – ఒకరి మీద ఒకరు ప్రేమను పెంచుకుని పెద్ద చేసుకుంటూనే ఉన్నారు.

ఆ రోజు వాళ్ళ నలభయ్యవ పెళ్ళిరోజు. ఆ రోజున మొదటిసారిగా అలిగింది సీత – అలాగే రామం – అదీ కొంతసేపే – అంతే!

ఇన్నాళ్ళూ ప్రేమే తప్ప – ప్రణయ కలహాలు తెలియని వాళ్ళకి, కొంత సరసం నేర్పగలిగానని ఆనందించింది రోజా మొక్క.

ఎన్నడూ విడిగా ఉండని వాళ్ళని, ఓ రెండు గంటలు విడిగా ఉంచింది ఈ రోజా మొక్కని బాధపడ్డాయి తక్కిన మొక్కలన్నీ.

వాటి భావాలతో సంబంధం లేకుండా –

ఒకరి పక్కన ఒకరు నడుచుకుంటూ ఇంట్లోకి వెళ్లారు సీతారాములు.

'రచన' నూతన సహస్రాబ్ది + జన్మదిన ప్రత్యేక సంచిక – ఫిబ్రవరి, 2000

E:\ Ramaneeyam\ Ramaneeyam 43

# వానప్రస్థం

అదో రైలు.

ఆ రైల్లో అదో ఫస్ట్ క్లాస్ బోగీ. ఆ బోగీలో అదో కూపే.

ఆ కూపేలో కిటికీ పక్కనే కూర్చుని బయటకి చూస్తున్నాడు రామం. రామాన్నే చూస్తోంది సీత. అలా చూస్తూనే–





"ఏంటలా తదేకంగా కిటికీలోంచి చూస్తున్నారు? ముళ్ళపూడి వారి కథలోలా – ఎంకీ, నాయుడు బావా కనిపిస్తారనా?" అని అడిగింది సీత.

"నా పక్కనే ఎంకివి నువ్వుండగా – ఇంకో ఎంకి కోసం చూడడమేంటి సీతా?" అని అడిగాడు రామం.

"అవును డెబ్భై మూడేళ్ళ ఎంకి. నండూరి వారు కానీ, ముళ్ళపూడి వారు కానీ ఊహించలేనంత ముసలి ఎంకి"

"ఊహించలేరు. ఎందుకంటే వాళ్ళు నిన్ను చూళ్ళేదు. చూసుంటే, వాళ్ళ ఎంకి నీ వయస్సుదే అయ్యుండేది"

సీత నవ్వలేదు. రామమే అన్నాడు –

"రైల్లో కిటికీ పక్కనే కూర్చుని బయట కనిపించే కొండలనీ, కాలవలనీ, పొలాలనీ చూస్తోంటే, ఎంత హాయిగా ఉంటుందో – నేనెప్పుడూ అందుకే కిటికీ పక్కనే కూర్చుంటాను"



"అవును కూర్చుంటారు. అయితే బయటికి చూడరు. యాభై యేళ్ళ క్రితం – పెళ్ళయి మనం ఇలాగే రైల్లో ఫస్ట్ క్లాస్ కూపేలో ప్రయాణం చేస్తున్నంత సేపూ – కిటికీలోంచి బయటకి చూసారా? కూపేలో ఉన్న నన్ను చూసారా?"

"నిన్నే చూసాను"

"మరిప్పుడు నన్ను చూస్తున్నారా?"

"లేదు. అయితే సీతా! అంత మాత్రాన నాకు నీ మీద ప్రేమ తగ్గిందని మాత్రం అనుకోకు. అప్పుడెంత ఉందో – అంతో, అంతకన్నా ఎక్కువో, ప్రేముంది నీపైన నాకు ఇప్పుడు"

"నాకు తెలియదా? మీ మీద నాకో, నా మీద మీకో – ప్రేమ తగ్గిందచుకునే భ్రమ లేదు నాకు. అయితే అప్పుడు శరీరాల మీద మమకారం ఉండేది. అందం మీద ఆశ ఉండేది. ఇప్పుడు అవేం లేవు. ఉత్త ప్రేమ. సీత మీద రామానికి, రామం మీద సీతకి"

"సీతా!" అన్నాడు ఏమనాలో తెలియక రామం.

సీత నవ్వలేదు. నవ్వకుండా –

"చూడండి. కదులుతున్న రైల్లోంచి చూస్తోంటే, దగ్గరున్నవి వేగంగా వెనక్కి వెళ్ళిపోతున్నట్లు, దూరంగా ఉన్నవి నెమ్మదిగా మనతో వస్తున్నట్లు కనిపిస్తాయి. ఎంత మాయో!" అని అంది.

"మాయే – అయినా అందంగా ఉంటుంది"

"మాయ – అందుకే అందంగా ఉంటుంది" అని, "చూడండి. ఇలా చూసే అవకాశం మళ్ళీ ఇంక రాదేమో" అంది సీత.

"అంటే?" అన్నాడు రామం.

"ఇదే మన ఆఖరి ప్రయాణం" అంది సీత.

"అంటే – మనం ఎక్కడికి వెళ్తున్నామో అక్కడ నుండి మళ్ళీ తిరిగి రామా?" అన్నాడు రామం.

"అవును రామా!" అంది సీత.

"అసలు మనం ఎక్కడకు వెళ్తున్నాం? ఎందుకు వెళ్తున్నాం? ఏమీ చెప్పకుండా ప్రయాణం చేసావు నన్ను. మనం తిరిగి రాకపోతే, మన ఇల్లు ఏమయిపోతుంది? మన సామాను..."

"ఎన్నాళ్ళు మనం ఆ ఇంటినీ, ఆ సామానుని అంటిపెట్టుకుని ఉంటాం? ఎప్పుడో ఒకప్పుడు వదిలెయ్యాలి కదా? ఇప్పుడే వదిలేద్దాం"



E:\
Ramaneeyam\
Ramaneeyam
44



"నన్నెక్కడికి తీసుకెళ్తున్నావు సీతా?"

"యాభై ఏళ్ళ క్రితం నేను మీతో వచ్చేసాను. అలాగే ఈ రోజు మీరు నాతో వస్తున్నారు. ఆ రోజు నేను మీతో రావడానికి భయపడ్డానా? ఈ రోజు మీకు నాతో రావడానికి అంత భయం దేనికి?"

"భయమా? నాకు నీతో రాడానికా? ఏం మాట్లాడుతున్నావు సీతా? నీతో తప్ప ఇంకెవ్వరితోనైనా ఎక్కడికైనా ఇంత ధైర్యంగా వెళ్ళగలనా నేను? నాకు భయం లేదు. అయితే అసలెక్కడికి వెళ్తున్నాం? ఎందుకు వెళ్తున్నాం? అది అర్థం కావడం లేదు"

"ఈ సంసారాన్నీ, ఈ బంధాలనీ వదిలేసుకుని వెళ్ళిపోదాం"

"అంటే – మన ఇంటినీ, మన పిల్లలనీ వదిలెయ్యడమనేనా?"

"అవును. మనం పిల్లల్ని కన్నాం. పెద్దవాళ్ళని చేసాం. వాళ్ళు పెద్ద ఉద్యోగాలు చేసుకుంటూ సంపాదించుకుంటున్నారు. వాళ్ళకీ పిల్లలు పుట్టి పెరుగుతున్నారు. ఇంక మనం ఈ బంధాలకి దూరంగా వెళ్ళిపోవాలి. లేకపోతే, ఈ మాయలో ఇలానే ఉండిపోతాం"

"ఇక్కడ నుండి వెళ్ళిపోతే, ఈ మాయలోంచి బయటికి రాగలుగుతామా?"

"రాగలుగుతామో లేదో తెలియదు. ఇక్కడ ఉంటే మాత్రం రాలేం. శ్లేష్మంలో పడ్డ ఈగల్లా కొట్టుకుంటూనే ఉంటాం. మా అమ్మాయి మమ్మల్ని బాగా చూస్తుంది. మా కోడలంత మంచిది కాదు. మా మనవడు చాలా బాగా చదువుతాడు. ఇదిగో, ఈ ఝుంఝూటంలోనే ఉండిపోతాం"

"ఇన్నాళ్ళూ దేన్ని మనం మన లోకం అనుకున్నామో – దాన్ని ఈ రోజు కాదనుకోడం ఎందుకు సీతా?"

"ఇన్నాళ్ళూ మనం అనుకుంటున్న లోకం కాకుండా మరో లోకం ఉందేమో మనకి తెలియదు. ఉన్నా దాని గురించి మనం తెలుసుకోగలమో లేదో తెలియదు. అయితే మరణం మాత్రం నిజం. అది దగ్గరవుతున్నప్పుడయినా దాని తర్వాత ఏముందో ఆలోచించుకోవద్దూ? ఈ సృష్టికి మూలం గురించి తెలుసుకుందుకు ప్రయత్నించవద్దూ? ఉందో లేదో తెలియని – మరో జన్మకి మంచి బాట వేసుకోవద్దూ?"

"మరో జన్మ – దానికి బాట – దాన్ని మనం వేసుకోవడం – ఏం మాట్లాడుతున్నావు సీతా?"

"మరో జన్మ ఉందో లేదో తెలియదు. అసలు ఉండడం అంటే ఏమిటో కూడా తెలియదు. మరణంతో శరీరం నశిస్తే, నశించకుండా ఉన్నదేదో మరో శరీరంలోకి ప్రవేశిస్తుందని కదా – పునర్జన్మ వాదుల సిద్ధాంతం. దాన్నే ఆత్మ అంటున్నారు.

ఆత్మకి మరణం లేదంటున్నారు. ఈ ఆత్మ ఒక శరీరాన్ని విడిచి మరో శరీరంలోకి వెడుతుదంటున్నారు. దాని నిజానిజాలు మనకి తెలియవు. ఒకవేళ అదే నిజమైతే, మన ఆత్మని మనం పవిత్రంగా ఉంచుకోవద్దూ? ఎందుకంటే ఆత్మ జీవిస్తూనే ఉంటుంది. ఈ జన్మ ఎక్కడ అంతం అవుతుందో, మరుజన్మ అక్కడ ఆరంభం అవుతుంది. ఈ జన్మ అంతం అయ్యేటప్పుడు ఏ ఆలోచనలు ఉంటాయో, మరో జన్మ వాటితోనే ప్రారంభం అవుతుంది"

"అంతా చూసినట్లు చెప్తున్నావు. ఇంతవరకూ ఒక్కరైనా మరణించిన వాళ్ళు మళ్ళీ మనకు కనిపించారా? మరణం తర్వాత ఆత్మలు మరో శరీరంలోకి ప్రవేశించినట్లు మనం కథలు వింటున్నాం. అవి నిజాలని ఎలా అనుకోగలం?"

"అనుకోలేం. అనుకోకూడదు కూడా. అయితే కొన్ని విషయాలను చూడండి. పుట్టిన నాలుగైదేళ్ళకే సంగీతం వచ్చేస్తోంది కొందరికి. ఎవ్వరి దగ్గరా నేర్పకుండా పెద్ద పెద్ద లెక్కలు చిన్న వయస్సులో చేసెయ్యగలుగుతున్నారు కొందరు. వాళ్ళకి ఆ విద్యలు ఎక్కడ నుండి వస్తున్నాయి? వాటినే పూర్వజన్మ వాసనలు అంటున్నారు. ఆ వాసనలు మనల్ని వదలవు. అంటి పెట్టుకునే ఉంటాయి"

"మనకి ఇంతకు ముందొక జన్మ ఉందో లేదో తెలియదు. ఈ జన్మలో మనకు పూర్వజన్మ జ్ఞాపకాలు ఏవీ లేవు. అలాగే వచ్చే జన్మలో కూడా ఉంటాయన్న నమ్మకం లేదు. పూర్వజన్మ జ్ఞానమే లేనప్పుడు దాని గురించి ఆలోచించడం ఎందుకు?"

"మనకి తెలిసినా, తెలియకపోయినా ఈ జన్మలోని ఆలోచనలు వచ్చే జన్మలో మనల్ని అంటిపెట్టుకుని ఉంటాయేమో. అసలు జన్మరాహిత్యమే లభిస్తుందేమో ప్రయత్నిస్తే. జన్మ జన్మకూ ఆత్మ జన్మరాహిత్యానికి దగ్గరై ముక్తి పొందుతుందని కదా అంటున్నారు. అలాంటప్పుడు మనం మంచి ఆలోచనలతో కాలం గడపడం మంచిది కాదూ?"

"ఆలోచనల్ని మంచిగా, మనం మన ఇంట్లోనే ఉంటూ, ఉంచుకుందుకు ప్రయత్నించవచ్చు కదా?"

"ప్రయత్నించవచ్చు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించే అవకావం తక్కువ. నా కూతురూ, నా కొడుకూ, నా మనవడూ, నా మనవరాలూ – ఈ బంధాలు మనల్ని మరో విషయం గురించి ఆలోచించనివ్వవు. ఇది కావాలి, అది కావాలి అన్న కోరిక పోదు. కోడలిని కష్టపెట్టడం, కూతురిని సుఖపెట్టడం, ఆస్తి పోతుందేమోననుకోవడం, కూతురు పిల్లలని కోడలిని పిల్లలకన్నా బాగా చూడడం – ఇవన్నీ చెయ్యకుండా ఉండగలమా?"



E:\ Ramaneeyam\ Ramaneeyam 45



"ఇంత కాలం మనం అలా చేస్తున్నామా?"

"మీకేనిపిస్తోంది?"

"అలాగే అనిపిస్తోంది"

"అసలలా అనిపించకపోయినా, ఈ బంధాల మాయలో కొట్టుకుపోతున్నామా? లేదా? మనం మన పిల్లలని బాగా చూసాం, వాళ్ళు మనల్ని చూడాలి అన్న ఆలోచన కలుగుతోందా లేదా? చూడకపోతే బాధ కలుగుతోందా లేదా? వాటికి దూరంగా వెళ్ళి పోవాలి"

"అవును సీతా – వెళ్ళిపోవాలి. ఈ సంసారానికి దూరంగా వెళ్ళిపోవాలి. చాలా రోజులుగా నాకూ అలానే అనిపిస్తోంది. అయినా అలా వెళ్ళిపోవడం భయపడి పారిపోతున్నట్లుగా – పలాయనత్వంలా అనిపించి, అలా చెయ్యడం లేదు. ఆ మాట చెప్పడం లేదు"

"వెళ్ళాల్సిన చోటుకి వెళ్ళడం పలాయనత్వం కాదు"

"మనం వెళ్ళాల్సిన చోటు ఏది?"

"మనుషులు నిర్మించిన ప్రపంచానికి దూరంగా – ప్రకృతికి దగ్గరగా"

"అంటే, అడవులకా?"

"అలాంటి చోటుకి, ఈ జనారణ్యానికి దూరంగా"

"మనం ఇలా వెళ్ళిపోయామని తెలిసి, మన పిల్లలు బాధ పడరూ?"

"పడతారు – పడితే–"

"వాళ్ళని బాధపెట్టడం సరయిన పనేనా?"

"ఎన్నాళ్ళని వాళ్ళని మనం చూస్తాం. వాళ్ళ బాధలనీ, సుఖాలనీ వాళ్ళు చూసుకోగలరు. వాళ్ళ కోసం మనం మన మార్గాన్నీ మన గమ్యాన్నీ వదిలేసుకుంటామా?"

"వాళ్ళ కోసం కాదు. మన కోసం. మన అవసరాల కోసం"

"మనకేం అవసరాలుంటాయి?"

"ఎందుకుండవు? మనకేం కావల్సివచ్చినా, చూడాల్సింది మన పిల్లలే కదా? వాళ్ళు చూస్తామనే అంటున్నారు కదా. అలాంటి వాళ్ళని వదిలేసి వెళ్ళడం ఎందుకు?"

"అసలు మనకు అవసరాలు లేవు. ఉండకూడదు. పిల్లల్ని పెంచి పెద్ద చెయ్యడం తల్లితండ్రుల కర్తవ్యం. అయితే పెద్దవాళ్ళని చూడ్డం పిల్లల పని కాదు. ఎందుకంటే పిల్లలు వాళ్ళ పిల్లల్ని పెంచి పెద్ద చేయాలి. ముసలివాళ్ళని చూడ్డంలో వాళ్ళు వాళ్ళ పిల్లల భవిష్యత్తుని విస్మరించకూడదు. అలా జరిగితే ఏ తరమూ, ముందు తరాన్ని ముందుకు నడిపించలేదు"

"ఈ లోకమంతా మాయ. దీన్ని వదిలిపెట్టాలని అంటావు ఒక పక్క. ఇంకో పక్క ప్రతి తరం ముందుకి వెళ్ళాలంటావు. ఈ రెంటికీ లంకె ఎలా కుదురుతుంది సీతా?"

"ఎందుకు కుదరదు – కుదురుతుంది. ఈ వయస్సులో మనం తెలుసుకోవల్సింది ఈ విశ్వరహస్యం గురించి. మన గమ్యం భగవదైక్యం. మన మనవలూ, మనవరాళ్ళూ తెలుసుకోవల్సింది ఈ ప్రపంచంలో బతికే మార్గం. దాన్ని వాళ్ళకి చూపించడం మన పిల్లల కర్తవ్యం. మనకీ, వాళ్ళకీ ఒకటే గమ్యం ఉండదు. మన మార్గాలు ఒకటవవు"

"మన గమ్యం భగవదైక్యమా?"

"కాక? – మనం ఎందులోంచి పుట్టామో, ఎందులో లీనమవుతామో అదే కదా భగవంతుడు. మధ్య ఉన్నదంతా మాయ. మనం అన్నది మన శరీరమే అయితే, జనన మరణాలే ఆదీ, అంతం. అప్పుడు మరణమే భగవదైక్యం. అలా కాక మనం అన్నది ఆత్మ అయితే అది జనన మరణాల శృంఖలాలనెన్నిటినో చూసి చూసి, చివరి కెప్పుడో కర్మ పరిపక్వం చెందినప్పుడు భగవదైక్యం చెందుతుంది. ఆ కర్మ పరిపక్వానికి అది ప్రతి జన్మలోనూ ప్రయత్నించాలి"

"అలాగనే మన మహర్షులు చెప్పారు. రామకృష్ణుడైనా, అరవిందుడైనా, రమణుడైనా చెప్పింది అదే"

"నేనేం కొత్తగా చెప్తున్నానని అనడం లేదు. మనం కొత్త మార్గం వెతకడం లేదు. ఆ మహర్షులు చెప్పిన మార్గంలో వెళ్ళేందుకు ప్రయత్నిస్తాం. వాళ్ళందరూ భగవంతుణ్ణి చేరడానికి చెప్పిన మార్గం ధ్యానం. ధ్యానం అంటే ఏదో ఒక్క విషయం పైనే మనస్సుని లగ్నం చెయ్యాలి. మనస్సుకి ఇంకో ఆలోచన కలగకూడదు. అందుకే మనస్సుకి మరో ఆలోచన కలగని చోటుకి మనం వెళ్ళిపోవడం. అక్కడ మన ధ్యానానికి అంతరాయం ఉండదు"

"ఒకవేళ భగవంతుడు సత్యం కాకపోతే – ఈ మహర్షులు చెప్పిన మార్గం సరయింది కాకపోతే–"

"కాకపోయినా మనకేమీ అవదు. అదే యాభై ఏళ్ళ క్రితం అయితే, ఆ సంగతి వేరు"

"అంటే?"

"అంటే" అని ఆలోచిస్తున్నట్లు చూసి, రామం జేబులోంచి పెన్ను తీసుకని తన దగ్గరున్న పేపర్ మీద రాయడం మొదలెట్టింది సీత. సీత రాస్తున్నది చూస్తున్నాడు రామం.



E:\
Ramaneeyam\
Ramaneeyam
46



సీత రాసిందిలాగుంది.

**ముసలివాళ్ళకి**

| | | మహర్షులు చెప్పిన మార్గం సత్యం | |
|---|---|---|---|
| | | అవును | కాదు |
| మహర్షులు చెప్పిన మార్గంలో | ప్రయత్నిస్తే | ఉపయోగకరం | ఈ వయస్సులో చెయ్యాల్సిన పనులు లేవు. పెద్ద నష్టం లేదు |
| | ప్రయత్నించకపోతే | నష్టం | లాభనష్టాలు లేవు |

**పడుచువాళ్ళకి**

| | | మహర్షులు చెప్పిన మార్గం సత్యం | |
|---|---|---|---|
| | | అవును | కాదు |
| మహర్షులు చెప్పిన మార్గంలో | ప్రయత్నిస్తే | ఉపయోగకరం | ఈ వయస్సులో చెయ్యాల్సిన పనులుంటాయి. అవి చెయ్యకపోతే, చాలా నష్టం |
| | ప్రయత్నించకపోతే | నష్టం | లాభనష్టాలు లేవు |

తను రాసినదాన్ని చూపిస్తూ సీత చెప్తోంది –

"యాభై యేళ్ళ క్రితం మనం పడుచువాళ్ళం. మనకి ఈ లోకంలో చెయ్యాల్సిన పనులు చాలా ఉన్నాయి. పిల్లల్ని కనడం, వాళ్ళని పెంచడం, పెద్దవాళ్ళని చెయ్యడం. ఇప్పుడు అవేం లేవు. ఇప్పటి మనకీ, అప్పటి మనకీ మార్గాలూ, గమ్యాలూ వేరు.

"మనం లెక్కల్లో గేమ్ థీయరి గురించి పే ఆఫ్ మేట్రిక్స్ గురించీ చదివాం. అదే గీసాను ఇందులో.

"మనం ముసలివాళ్ళం. మనకి చెయ్యాల్సిన పనులు లేవు. అందుకే భగవంతుడు సత్యమనీ, ఆయన దగ్గరకి చేరడానికి ధ్యానం మార్గం అనీ నమ్మడం వల్ల, మనకీ,

మన వాళ్ళకీ నష్టం లేదు. భగవంతుడు అసత్యమైనా, ఈ మార్గం మనల్ని అక్కడకి చేర్చకపోయినా ఫరవాలేదు.

"యాభై ఏళ్ళ క్రితం మనం పడుచువాళ్ళం. అప్పుడు భగవంతుడూ, ధ్యానం అంటూ కాలం గడిపి ఉంటే, మనకీ, మన పిల్లలకీ నష్టం వచ్చి ఉండేది. అప్పటి పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితి వేరు. ఇప్పుడు మనకి –"

సీత చెప్తోంది.

రామం వింటున్నాడు.

❁ ❁ ❁

రైలు ఆగింది.

ఇద్దరూ బయటికొచ్చి టాక్సీలో కూర్చున్నారు. ఎక్కడికి వెళ్ళాలని సీత చెప్పిందో, అక్కడకెళ్ళి ఆగింది టాక్సీ.

రామం దిగి చుట్టూ చూసాడు.

ఒక పక్క గలగలా పారుతున్న గోదావరి. గోదావరి ఒడ్డునే పెద్ద మామిడి తోట. ఆ తోటలో అక్కడక్కడా చిన్న కుటీరాలు. రెల్లు దుబ్బుతో అందంగా అల్లిన కుటీరాలు.

ఆ కుటీరాల వైపుకి నడిచింది సీత. వెనకే కదిలాడు రామం.

ఓ కుటీరంలోకి దారి తీసింది సీత. అనుసరించాడు రామం.

విశాలంగా ఉంది కుటీరం. ఒక పక్క వంటకి కావల్సిన సదుపాయాలన్నీ ఉన్నాయి. మరో పక్క పడకకి కావల్సిన సరంజామా ఉంది. ఆ గదికి ఆనుకొని స్నానాల గది.

"మనకి కావల్సినవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎలా ఏర్పాటు చేసావు సీతా?" అని అడిగాడు రామం.

"ఇక్కడ అందరూ మనలాంటి వాళ్ళే. అన్ని కుటీరాల్లోనూ మనలాంటి దంపతులే. ఇలాంటి సదుపాయాలే" అంటూ కుటీరం బయటకి వచ్చింది సీత. వెనకాలే వచ్చిన రామానికి గోదావరిని చూపిస్తూ –

"మనకిప్పుడు కావల్సింది సత్సాంగత్యం – అదిగో, ఆ నదే – ఆ గోదావరే – మనకి సత్సాంగత్యం"

– అని మరో పక్కనున్న గుడిని చూపిస్తూ –

"అదిగో, ఆ గుడే మన ధ్యానాలయం" అంది.

"ఇంకా" అని అడిగాడు రామం.

"ఇంకేం కావాలి? టీవీయా?" అని అడిగింది సీత.

"టీవీ అక్కర్లేదు కానీ..."



E:\ Ramaneeyam\ Ramaneeyam 47



"పేపరా? ఆ పక్కన ఒక లైబ్రరీ ఉంది. అందులో అన్నీ వేదాంత గ్రంథాలే. పేపర్ వస్తుందేమో కనుక్కోవాలి"

"అన్నీ బావున్నాయి. వైద్య సదుపాయం"

"ఎందుకు వైద్య సదుపాయం?"

"మనకి ఏదన్నా రోగం వస్తే?"

"వస్తే – వస్తే ఏమవుతుంది? చిన్న రోగాలకి మనమే మందులు వేసుకోవచ్చు. పెద్ద రోగాలు వచ్చాయా – వాటి మానాన వాటిని వదిలెయ్యాలి. గుండె కొట్టుకుంటూనే ఉండాలని అనుకోకూడదు"

"నా గురించి కాదు – నీ గురించి"

"నా కయినా, మీ కయినా అంతే. డెబ్భై ఏళ్ళు దాటాయి. ఇంకా ఈ శరీరం మీద మమకారం ఎందుకు?"

"అలాగని మరణం కోసం ఎదురు చూస్తామా?"

"మరణం అంటే ఏమిటి? శరీర విసర్జనం. మన ప్రయత్నం ఫలిస్తే – ఈ శరీరాన్ని వదిలేసిన ఆత్మ – భగవంతునిలో లీనమైపోతుందేమో. ఆ ఐక్యం కోసం ఎదురు చూద్దాం. ఆ దివ్య సాక్షాత్కారం కోసం వేచి ఉందాం. దాని కోసం కలలు కందాం. దాని కోసం ధ్యానం చేద్దాం. ఒకవేళ భగవంతుడిలో కలవకపోయినా, ఆ ధ్యానం, ఆ కలలు అందంగా ఉంటాయి. ఆనందాన్నిస్తాయి"

రామం మాట్లాడలేదు. సీత అడిగింది –

"మీకీ పరిసరాలు నచ్చలేదా? నేనిలా తీసుకువచ్చానని కోపంగా ఉందా?"

రామం అన్నాడు –

"సీతా! నీ మీద నాకు కోపమా? దేని నుండి బయటపడాలని ఆశపడుతున్నానో, దాని నుండి బయటకు తీసుకువచ్చావు. దేని కోసం ప్రయత్నిద్దామని కోరుకుంటు న్నానో, దాని కోసం ప్రయత్నించేందుకు అవకాశం కల్పించావు. నన్నిలా తీసుకు వచ్చావని నీ మీద నాకు కోపమా? నీకు కృతజ్ఞుడినై ఉండాలి కానీ–"

"కృతజ్ఞతలు నాకు కాదు. ఇవన్నీ నాకు చెప్పి నా చేత చేయించింది సుజాత" అని అంది సీత.

"ఏ సుజాత?" అని అడిగాడు రామం.

"ఏ సుజాత అని అడుగుతున్నారు? ఎందరు సుజాతలు తెలుసు మీకు?"

"నాకూ, నీకూ తెలిసిన సుజాత ఒక్కతే. ఆ సుజాత ఈ పాటికి మన ఇంట్లోని సామానుని ఊళ్ళోని అనాథాశ్రమానికి తరలిస్తూ ఉండి ఉంటుంది" అన్నాడు రామం.

సీత రామం వైపు అనుమానంగా చూసింది.

"ఈ ఆశ్రమం గురించి సుజాతకి ఎలా తెలుసుట?" అని అడిగాడు రామం.

"ఎవరో అంకుల్ చెప్పారని అంది" అని అంది సీత – రామం వైపు అనుమానంగా చూస్తూనే.

"రామం అంకుల్ అని చెప్పలేదా?" అని అడిగాడు రామం.

"మీరేనా సుజాత చేత..." అంటూ ఆగింది సీత.

రామం నవ్వాడు.

సీత నవ్వలేదు. నవ్వకుండా –

"మీరు ఈ విషయాలన్నీ చెప్పి నన్ను రమ్మని ఉంటే, మీ వెనక వచ్చి ఉండేదాన్ని కాదా? ఎందుకు సుజాత ద్వారా చెప్పించి, నా చేత చేయించి – నా వెనుక మీరు..." అని సీత అంటోంటే –

"సీతా! పెళ్ళయిన వెంటనే నువ్వు నాతో వచ్చావు. ఆ తర్వాత ఎప్పుడూ ఇద్దరం కలిసే ప్రయాణం చేసాం. ఈసారి నీ వెనుక నేను ప్రయాణం చేద్దామని"

"ఎప్పటిలాగే మీరు నా వెనుక కాదు. ఎప్పుడూ నేను మీ వెనుకే"

"అన్ని ప్రయాణాలూనా?" అని అడిగాడు రామం.

రామం అడిగింది అర్థం అయినట్లు సీత –

"ఆ ప్రయాణం మాత్రం కాదు" అని అంది.

"అన్ని ప్రయాణాలూ మనం కలిసే చేసాం సీతా. భగవంతుడు అనుగ్రహిస్తే – ఆయన దగ్గరికి ప్రయాణం కూడా కలిసే చేస్తాం" అని అంటున్న రామం కంఠం వణికింది.

వింటున్న సీత కళ్ళలో తడి ఉబికింది.

గోదావరి – ఎప్పటిలాగే – గంభీరంగా – ప్రవహిస్తూనే ఉంది. ❋





E:\
Ramaneeyam\
Ramaneeyam
48



'ఆంధ్రప్రభ' దినపత్రిక – శ్రీరామనవమి, 1985 అనుబంధ కథ

# ఏకపత్నీవ్రతం

అయోధ్యానగరంలోని ఒక పెద్ద సరస్సులోని అలల మీద అల్లకల్లోలంగానూ– నింగిలో నిశ్చలంగానూ –

ప్రకాశిస్తున్నాడు పున్నమి చంద్రుడు.

రాముడు హరుని విల్లు విరిచి ఇంకా ఆరు నెలలు కూడా కాలేదు.

మరుని విల్లు నిరంతరంగా పుష్పబాణాలు కురిపిస్తోంది –

నవదంపతులు సీతారాముల మీద.

రాముడి ఒళ్ళో సీత ఒదిగి వుంది.

"మైథిలీ!" రాముడి గొంతులోంచి ఆ పిలుపు ఆకాశపు సుదూర తీరాలలో ఎక్కడో మ్రోగిన వీణానాదం మధురంగా, మందంగా తన చెవులకి సోకినట్లయింది సీతకి.

"ఊఁ" అన్నది కళ్ళు తెరవకుండానే.

"ఈ వెన్నెల రాత్రి అందాన్ని చూసి ఆనందించక అలా కళ్ళు మూసుకుని ఏమిటి ఆలోచిస్తున్నావు దేవీ?" – రాముడి చేతివేళ్ళు సీత పెదవుల మీద కదులుతున్నాయి.

సీత చెయ్యి ఆ వేళ్ళని తన వేళ్ళలోకి తీసుకుంది.

"మీరు చూస్తుంటే నేను చూస్తున్నట్లేగా" – సీత పెదవుల మీద కనిపించీ

కనిపించనట్టు చిరునవ్వు నిలిచింది. ఆమె బుగ్గల మీద సొట్టలు పడ్డాయి.

"అదెలా?" – రాముడు, ఆ చెక్కిళ్ళ మీద నుండి దృష్టి మరల్చకుండా అన్నాడు.

"మీరు నేనే కనుక, నేను మీరే కనుక" – రాముడి నడుం చుట్టూ వున్న సీత చెయ్యి మరింత పెనవేసుకుంది.

సీత వంక రాముడు చూస్తూనే వున్నాడు.

సీత కళ్లు మూసుకునే వుంది.

ఆమె తల రాముడి భుజం మీద ఉంది. ఒక చెయ్యి రాముడి నడుం చుట్టూ వుంది. మరో చెయ్యి రాముడి చేతిని పట్టుకుంది. సీత రాముడి ఒళ్ళో వుంది.

ఆమె మొహంలో ఎంతో ఆనందం కనిపించింది.

"నీ ముఖంలో ఇంత ఆనందానికి కారణమేమిటి జానకీ?"

"మీ ఒళ్ళో పడుక్కోవడమేనేమో"

"అదంత ఆనందదాయకమా?"

"నాకయితే – అవును"

"నీ కయినది తక్కిన వారికి కూడా అవుతుందేమో కదా, దేవీ?" అని అన్న తర్వాత అనరానిది అన్నానేమో అన్న భావం రాముడి మొహంలో కనిపించింది. వినరానిదేదో విన్నాననిపించింది సీతకి. ఆ మాటలో ఏదో అపశ్రుతి ధ్వనించింది. రాముడి ఒళ్ళో మరెవరో వున్నట్లనిపించింది. గుండె లయ తప్పింది.

"ఒకవేళ అది ఆనందదాయకమే అయినా – మరెవ్వరికీ దక్కదు దేవీ" అన్నాడు రాముడు.

"నిజంగానా?" సీత నమ్మలేనట్లు కాక నిజంగా తెలుసుకోవాలని అడిగినట్లుంది.

"దేవీ! ఆడిన మాట తప్పడం మా వంశంలోనే లేదు. నేనన్న మాటకు తిరుగు లేదు. నేను విలువిద్య నేర్చుకునే కాలం నుండి ఒక్క బాణమేనన్న ఖ్యాతి వుంది నాకు. అలాగే నాకు ఒకే భార్య అన్న పేరు కూడా కలుగుతుంది. నేను మరో వివాహం చేసుకోను"

సీతకు ఆ మాటలు –

వేల తారకలు మెరిసినట్లనిపించింది.

లక్షల మల్లెలు కురిసినట్లనిపించింది.


కోటి జాజులు విరిసినట్లనిపించింది.

ఈ లోకంలో తామిద్దరూ తప్ప మరెవ్వరూ లేనట్లు, అసలీ లోకం తమ కోసమే వున్నట్లనిపించింది. ఆమె మొహంలో అంతకు ముందున్న ఆనందం ఇంకా



E:\
Ramaneeyam\
Ramaneeyam
49





అధికమయినట్లనిపించింది రాముడికి.

❀ ❀ ❀

దశరథుడు ఆ రోజుకి సభ చాలించి స్నానాదులు ముగించి కౌసల్య దగ్గర కూర్చుని కుటుంబ విషయాలు ముచ్చటిస్తుంటే రాముడి పెళ్ళి విషయం ప్రస్తావన వచ్చింది.

"రాముడికి తమ కుమార్తెల నిచ్చి పెళ్ళి చేస్తామని చాలామంది రాజులు ముందుకు వస్తున్నారు" – దశరథుడు అన్నాడు.

"కౌసల్యలే కాకుండా కైకేయిలు కూడా కావాలి రాజులకు, రాజకుమారులకు" – కౌసల్య గొంతులో అసూయ లేదు, హాస్యం ఉంది.

"ఎంతమంది వుంటే మాత్రం ఏముంది – పట్టమహిషి పట్టమహిషే" అన్నాడు దశరథుడు.

"ఆ గౌరవం జానకికి ఎలాగూ వుంది. అంతేకాక రాముడి సంపూర్ణ ప్రేమాను రాగాలు కూడా ఆమెకు దక్కుతాయేమో. రాముడు మరో వివాహం చేసుకోనంటు న్నాడన్న వార్త విన్నాను నేను"

'ఈ వార్త నాదాకా రాలేదే' అని అంటూనే దశరథుడు పక్క నున్న గంటను మ్రోగించాడు.

ప్రతీహారి లోపలికి వచ్చి నిలిచాడు.

"దాశరథిని మేము రమ్మంటున్నామని వెంటనే తీసుకురా."

ప్రతీహారి వంగి నమస్కరించి నిష్క్రమించాడు.

దశరథుడికి కొడుకులు నలుగురున్నా రాముడే దాశరథిగా అందరికీ తెలుసు.

"బహుభార్యాత్వం క్షత్రియ లక్షణం దేవీ. నీకు తెలియదని కాదు కానీ, నా ముత్తాత దిలీపునికి సుదక్షిణ కాక – మరెందరో భార్యలున్నారుగా. మా తాతగారికి, తండ్రిగారికి భార్యలు తక్కువ కాదు. నా సంగతి నీకు తెలిసినదే. ఈ వంశాచారం ఇంతటితో ఆగిపోరాదు"

"ఈ ఆలోచన రాముడిదో లేక సీత ఏమన్నా కోరుకున్నదో?" అంది కౌసల్య.

"రాముడితో ఈ విషయం తక్షణం మాట్లాడాలి. ఇప్పుడు కాకపోయినా త్వరలో రాముడికి మరో వివాహం అవసరం కావచ్చును"

"అదెలా?"

"దేశాలనేలే రాజులకు వివాహం స్వప్రయోజనాలకే కాక దేశ ప్రయోజనాలకి కూడా అవసరమవుతుంది. ఒక దేశంతో సంధి చేసుకుని సంబంధ బాంధవ్యాలు పెంచుకోవడానికి ఆ అవసరం కలుగుతుంది. ఒక దేశపు రాజు బలవంతుడై, మనమతనితో యుద్ధం చెయ్యడం సముచితం కాదనిపిస్తే ఆ దేశపు రాజకుమార్తెను వివాహం చేసుకోవల్సిన అవసరం రావచ్చును. అలా కాక యుద్ధంలో అవతలి రాజును వోడించినా, ఆ రాజ్యంతో మైత్రీభావం నిలుపుకోవడానికి సంబంధం కలుపుకోవాల్సిన అవసరం కలుగుతుంది. రాముడు నా తర్వాత చాల సంవత్సరాలు రాజ్యం చెయ్యవలసిన వాడు. రాజనీతి చక్కగా తెలిసినవాడు"

"వివాహాలు ధర్మార్థ కామ మోక్షాల కోసం చేసుకుంటారనుకున్నాను. కానీ ఇలా రాజకీయావసరాల కోసం చేసుకుంటారనుకోలేదు."

"రాజనీతి క్షత్రియ ధర్మం"

ఈలోగా ప్రతిహారి వచ్చి రాముడు సీతా సమేతుడై వస్తున్నాడని చెప్పి వెళ్ళాడు.

రాముడు సీతతో ప్రవేశించాడు.

అభివందనాలు చేసి రాముడు దశరథుని పక్కనున్న ఆసనం మీద, సీత కౌసల్య పక్కన కూర్చున్నారు.

"జానకీ! మీ తండ్రిగారింట నీకు జరిగే సకలోపచారాలు ఇక్కడ జరుగుతున్నాయా? ఏమాత్రం లోపం వచ్చినా మీ జనకులు – జనకులు – నన్నంటారు" – దశరథుని కన్నులలో చిరునవ్వు గడ్డంలో మాయమయింది.

"నాకిక్కడ ఏమాత్రం లోపం జరగడం లేదు"

"ఎంతయినా మెట్టినిల్లు పుట్టినిల్లులా వుండదు. కొన్నేళ్ళ వరకు ఆ తేడా



E:\
Ramaneeyam\
Ramaneeyam
50



తెలుస్తూంటుంది. అప్పటికి ఈ ఇల్లు నీ ఇల్లవుతుంది. అంతవరకు కొంత బెంగ, బాధ తప్పవు" – కౌసల్య సీతను దగ్గరగా తీసుకుంటూ అంది.

"ఇది స్వానుభవపు మాట కదూ దేవీ" – దశరథుడి గొంతులో హాస్యం వినిపించింది.

"అయితే ఇక్కడో చిక్కున్నది. ఇక ఇల్లాలు పుట్టింటిని మరచి మెట్టినింటిని తన ఇంటిగా తలచుకోవడానికి భర్త ప్రోత్సాహం ముఖ్యం. చాలా మంది భార్యలున్నచోట ఒకరిద్దరికి ఆ ప్రోత్సాహం లభించకపోవచ్చును. అప్పుడా ఇల్లాలికి కష్టంగా ఉండవచ్చును" – ఈ మాటలన్నది దశరథుడే.

"అందుకే ఒక పురుషునికి పలువురు భార్యలు వుండడం సముచితం కాదని నా భావన" అన్నాడు రాముడు.

"నీ మనస్సులోని ఈ భావాన్ని తెలుసుకోవడానికే నేనామాటలన్నది. నీవు వేరొక వివాహం చేసుకోనంటున్నావని మీ అమ్మ అంటున్నది. దానిలోని నిజానిజాలు నేను తెలుసుకోవచ్చునా?" – దశరథుని కంఠం స్థిరంగా వినిపించింది.

"మీరు విన్నది నిజం" – రాముడి కంఠంలో అస్థిరత ఏనాడూ లేదు. విలువిద్య నభ్యసిస్తున్న కాలంలో లక్ష్యం ధ్యేయంగా వున్న కళ్ళు, విల్లును పట్టిన చేతులు, ఏకాగ్రతతో వుండే మనస్సు స్థిరంగా వుండేవి. తండ్రితో రాజకీయ విషయాలు చర్చించినప్పుడయినా, తల్లితో అంతఃపుర విషయాలు ముచ్చటించినప్పుడయినా, తమ్ముళ్ళతో కలిసి విలువిద్యలను గూర్చి ప్రసంగించినప్పుడయినా – పంచేంద్రియాలు ఐక్యం చెంది స్థిరంగా వుండేవి. ఆ స్థిరత్వమే సీతతో మరో వివాహం చేసుకోను అన్నప్పుడు వినిపించింది. అదే స్థిరత్వం ఇప్పుడు రాముడి కంఠంలో వుంది.

"కాని రాజుగా నీకా అవసరం కలుగుతుంది" – దశరథుడు ఆలోచిస్తున్నట్లు అన్నాడు.

"ఆ అవసరమే కలిగితే నేను రాజరికాన్నే వదలుకుంటాను"

"అది క్షత్రియుడిగా నీ ధర్మం కాదు"

"అవును – కాని మానవుడిగా నా ధర్మాన్ని నేను నిర్వర్తించేందుకు నాకు ఏ ధర్మమూ అడ్డురాదు. భార్యాభర్తల మధ్య వుండాల్సిన అనుబంధం నిత్యమైంది కావాలి. పవిత్రమైంది కావాలి. అది వాళ్ళిద్దరూ పంచుకోవాల్సిందే కాని మరెవ్వరికీ పంచి యిచ్చేది కాదు"

"బాబూ – నువ్వు మీ తండ్రిగారి పద్ధతులను ధిక్కరిస్తున్నావు. పితృవాక్య పరిపాలనా దక్షుడవయిన నీకిది తగదు" – కౌసల్య హెచ్చరించింది.

"నేను తండ్రిగారిని ఎదిరించడం లేదు. వారి పద్ధతులను ధిక్కరించడం లేదు. ఇవి మా ముత్తాతల కాలం నుండి వస్తున్న పద్ధతులు. రాజవంశ పద్ధతులను మహారాజులు పాటించడం ఆచారం. మా తండ్రిగారు వాటిని పాటించి ఉండవచ్చును. ఆయనకు వాటి అవసరం కలిగివుండవచ్చును. లేక వారికి ఇష్టం కావచ్చును. కానీ నా విషయం వేరు. సీతతో నేను పంచుకుంటున్న క్షణాలు, భావాలు అవి మా ఇద్దరికే పరిమితం. నాకు సీత, సీతకు నేను – జీవితాంతం ఇంతే. మరో యువతికి స్థానం లేదు. అంతే!"

"నేను నా ముగ్గురి భార్యలతో సుఖంగా లేనా? వారు అందంగా లేరా?" – దశరథుడు క్రోధం లేని గొంతుతో అన్నాడు. ఆయనకి కొడుకంటే వల్లమాలిన ప్రేమ.

కౌసల్య భావాలు వేరుగా వున్నాయి. తక్కిన రాజవంశపు వాళ్లందరూ పెక్కు వివాహాలు చేసుకుంటోంటే తన కొడుకు ఆ పని చెయ్యకపోవడం ఎంతో చిన్నతనంగా అనిపించింది. అయినా తన కొడుకు అత్యున్నతుడన్న భావం ఆ చిన్నతనాన్ని కొంచెం తగ్గించింది.

"నేను సత్యవాక్పరిపాలన దీక్షగా తీసుకొన్నవాణ్ణి. నిజమే చెప్పాల్సి వస్తుంది – అదెంత కష్టం కలిగించినా, నిష్ఠురంగా వినిపించినా. మీరు మా పిన్ని గారయిన కైకేయిని చూసినంత ప్రేమతో తక్కిన ఇద్దరినీ చూస్తున్నారా? పట్టమహిషి అన్న గౌరవాన్ని మా అమ్మగారికి కాక తక్కినవారికి ఇచ్చారా? సుమిత్రమ్మకి చూపేది చిన్నచూపు కాదూ?

"వారి గురించి మీరనుకున్నది నిజం కాకపోవచ్చును. రాజకీయ కారణాలుగా ఎవరు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో చెప్పలేం. స్వార్థం అవసరం లేనప్పుడు సవతుల ప్రవర్తన సక్రమంగానే ఉంటుంది. అవసరం వచ్చినప్పుడే కదా అసలు ప్రవర్తన తెలిసేది. ఆ అవసరం త్వరలో రావచ్చునేమో కూడా"

"స్వామీ!" సీత ఆ మాటలు ఆపమన్నట్లు అంది. దశరథుడు సీత వైపు దరహాస వదనంతో చూస్తూ అన్నాడు –

"నువ్వు భయపడకమ్మా, జానకీ! ఇది మాకు కొత్త కాదు. ఒక విషయంలో వాదనకి దిగితే మేమిద్దరం సమానమే. తండ్రినన్న కోపంతో రాముడిని మాట్లాడవద్దని నేననను. కొడుకునన్న భావంతో రాముడు తన మనస్సులోని మాటను చెప్పడానికి సంకోచించడు. ఇద్దరం ఒకరు చెప్పేది ఒకరం వింటాం. విని ఇద్దరం ఒక అభిప్రాయానికి వస్తాం. మా ఇద్దరి మధ్య భేధాభిప్రాయాలు రాకపోవడానికి ఇదే ముఖ్య కారణం."



E:\
Ramaneeyam\
Ramaneeyam
51



రాముడు తండ్రికి నమస్కరిస్తూ అన్నాడు.

"తండ్రిగారి దొడ్డ మనస్సే నా ఈ నిస్సంకోచత్వానికి కారణం. వయోవృద్ధులుగా ఆయన నన్నెన్నడూ ఆజ్ఞాపించరు. ఆయన నాకు విధించిన ఆజ్ఞలన్నీ జ్ఞానవృద్ధులుగా విధించినవే. అందుకే నా సత్యవాక్పరిపాలన, పితృవాక్య పరిపాలన – రెండూ అసిధారావ్రతాలే అయినా – నిరాటంకంగా సాగిపోతున్నాయి"

కౌసల్య కొంచెం గర్వంతో అన్నట్లు అంది.

"ముందు ముందు సవతుల మధ్య గొడవలు రావచ్చునన్న నీ మాటలు సత్యం కావచ్చు – పాపము శమించుగాక – రాజ్యాధికార విషయంలో నీ వూహ నిజం కావచ్చు. దానికి నేను కాదనను. కాని తండ్రిగారు మా ముగ్గురినీ సమానంగా చూడరనడం సత్యం కాదు.

దశరథుడు నవ్వాడు.

రాముడు నవ్వుతూ అన్నాడు –

"అమ్మా, నువ్వు, నీ సవతులు తప్పు చెయ్యవచ్చును కానీ, నీ భర్త తప్పు చెయ్యడంటున్నావు. గుర్తించావా?"

దశరథుడు అర్థవంతంగా రాముడి వంక చూసాడు.

రాముడు మళ్ళీ అన్నాడు.

"శృంగార జీవితంలో తండ్రిగారు ముగ్గురినీ సమానంగా చూడ్డం సాధ్యం కాని పని. శృంగారమనేది తనువుకి మాత్రం సంబంధించిన వ్యవహారం కాదని వారు ఒప్పుకుంటారు. ఇది వేశ్యాసంగమం కాదుగా. తనువు, మనస్సు, ఆపైన ఆత్మ – అన్నీ అవతలి వ్యక్తితో ఆయా స్థాయిల్లో కలవాలి. మనస్సు లేని చోట తనువుతో రమించేది రాక్షసం అని నా ఆలోచన. ఏ ఒక్కరి దగ్గరున్నా తక్కినవారి వూహ రాకుండా వుంటుందా?" – రాముడు హఠాత్తుగా చాలించాడు.

కౌసల్య కామాటలు నచ్చినట్లు లేదు. అలాగని పూర్తిగా నచ్చకపోనూ లేదు!

"కాని స్త్రీ చాపల్యం పురుష లక్షణం రామా – ఇవి నా మాటలు కావులే దేవీ – అందుకని పలువురు భార్యలుండడం మంచిదని మంత్రుల అభిప్రాయం. ఒకే భార్యతో వున్న పురుషుని బుద్ధి చలించవచ్చునని, కొత్త కోరికలతో మార్గం తప్పవచ్చునని వాళ్ళంటారు. మహారాజు మనస్సులో అటువంటి కోరికలకి తావుండకూడదట. అందుకే స్నానపానాదులతో, భోజనాలతో, శృంగార జీవితంతో అతడు నిరంతర తృప్తుడయితే రాజ్యానికి అవసరమైన చిక్కు విషయాల గురించి నిశ్చింతగా ఆలోచించ గలడని నా ఊహ" – దశరథుడు చివరి అస్త్రంగా అన్నాడు.

E:\
Ramaneeyam\
Ramaneeyam
52

రాముడు నిశ్చలమైన స్వరంతో అన్నాడు – "స్నానపానాదులతో, భోజనాలతో స్త్రీని కలపడం మీ ఔన్నత్యానికి తగని పనేమో. నిరంతర జీవన విధానంలో స్త్రీ పురుషులు సమానులు. శృంగారం ఇద్దరికీ అవసరమే. ఒకరి అవసరం ఒకరికి సమానమే. ఇంక మనోస్థిరత్వం – రాజు కయినా, మంత్రి కయినా, సైనికుడు కయినా, కట్టెలు కొట్టే వాడి కయినా అవసరమే. ఆ స్థిరత్వం బహుభార్యాత్వం వల్లనే వచ్చేది కాదు. అందమైన భార్యలు ఆరు వందలున్నా మరో స్త్రీని చూసి చంచలిత మనస్కులయే వాళ్ళుంటారు. ఆ విషయంలో నాకు భయం లేదు. నా మనస్సు, తక్కిన ఇంద్రియాలు నా బుద్ధికి అధీనాలు"

సీత వంక చూస్తూ, "దేవీ, ఇంక పోదామా?" అని, "మాకు సెలవిప్పించండి" అన్నాడు తండ్రితో.

"నీ ఏకపత్నీవ్రతానికి నేను అడ్డురాను. నీకు శుభమవుతుంది వెళ్ళిరా" అన్నాడు దశరథుడు.

'ఏకపత్నీవ్రతం' అన్నమాట ఎంతో సుమధురమైన గీతంలా వినిపించింది సీతకి.

ఆమె కౌసల్యకి నమస్కరించింది.

రాజమాత సీతను దగ్గరగా తీసుకుని – "రాముడు సకల గుణాభిరాముడు. దానికి తోడు ఇప్పుడాయన అన్నారే, ఏకపత్నీవ్రతం. నువ్వు అదృష్టవంతురాలవు. నీకంతా శుభం కలుగుతుంది" అని దీవించింది.

సీతారాములు వెళ్ళాక దశరథుడు అన్నాడు.

"సమాజావసరాలని బట్టి ఆచారాలు పుడతాయి. వాటిని కొన్నేళ్ళు గుడ్డిగా నమ్ముతారు. అవసరం గురించి ఆలోచించక పాటిస్తారు. ఎవరో మహాపురుషుడు పుట్టి ఈ గుడ్డి నమ్మకం నిరర్థకం అని గుర్తిస్తాడు. ఆ నమ్మకాన్ని కాదంటాడు. అలా అనడానికి చాలా ఆలోచన వుండాలి. ఎంతో ధైర్యం కావాలి. అవి రాముడిలో వున్నాయి. వాడు మన కడుపు పంట అవడం మన అదృష్టం"

దశరథుడి కళ్ళు తడయ్యాయి.

❁ ❁ ❁

ఇది జరిగిన చాలా యేళ్ళకు రాముడు అశ్వమేధయాగం చేశాడు. అతని పక్కన సీత బంగారు బొమ్మై కూర్చుంది.

అడవిలో వున్న సీతకు ఈ విషయం తెలిసింది. రెండు ఆడ లేళ్ళ మధ్య నున్న మగలేడిని చూస్తూ అంది –

"రాముడు సంపూర్ణ మానవుడు. ఇప్పుడు ఏకపత్నీవ్రతంతో దాన్ని నిరూపించాడు. అంతే!" ❁



## రచయిత స్వపరిచయం

1957లో – మద్రాసులో – మెరీనా తీరంలో – జననం

ప్రస్తుతం – ముంబయిలో –
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో – జనరల్ మేనేజర్ – ఉద్యోగం

మద్రాసు యూనివర్సిటీ నుండి – బీయెస్సీ, ఎమ్మెస్సీలలో ఫస్ట్ రేంక్ –
మద్రాసు ఐ.ఐ.టి. నుండి డాక్టరేట్ – ఆక్స్‌ఫోర్డ్‌లో మేనేజ్‌మెంట్ కోర్స్

Valuation of Financial Assets అనే పుస్తకం –
ముందుగా ఇంగ్లీష్‌లో – ఆ తర్వాత చైనీస్‌లో – ప్రచురితం

తెలుగులో – ఓ రేడియో నాటకం, రెండు నవలికలూ, యాభై దాకా కథలూ – అందులో – రేడియో నాటకానికీ, పది కథలకీ – బహుమతులు

సీతకి రామంలా – రామానికి సీతలా – 'సీతారామం'లా ఉండగలిగితే –
ఏ దంపతుల జీవితం అయినా –
'రమణీయం'

జనవరి 8, 2006 - అనామకుడు

*Writer's Contact*

Dr. A.S. RAMASASTRI
A-27, DHANASTRA
122, N.P. Marg
Colaba
MUMBAI - 400005.
✆ : 022 - 22183149
e-mail : ramasastri@hotmail.com